

# జానపద విజ్ఞానం

## పరిశోధన





డా॥ బి. దామోదర రావు

13
88028

# జానపద విజ్ఞానం - పరిశోధన

## సంక్షిప్త పరిచయం



డా॥ బి. దామోదరరావు

**జానపద విజ్ఞానం - పరిశోధన**

**డా॥ బి. దామోదర రావు**

**డిసెంబర్ 2001**

ప్రతులు 1000

**ప్రచురణ - ప్రతులకు**

బి. శ్రీకాంత్

ఫ్లాట్‌నెం. 202, ఎస్.వి. హోమ్స్,

రాఘవేంద్రనగర్ - కర్మన్‌ఘాట్, హైదరాబాద్.

లేదా

ఇ.నెం. 8-2-147/1,

భగత్‌నగర్, కరీంనగర్.

లేదా

విశాలాంధ్ర బుక్ హౌజ్ - హైదరాబాద్.

**రూ. 40/-**

కంపోజింగ్

రామగిరి ...

ముద్రణ

**అరుణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్,**

కరీంనగర్.

ఫోన్స్ . 22755 / 22200

తెలుగు విశ్వవిద్యాలయ ఆర్థిక సహకారంతో ప్రచురితం

398


C.11432

సుందరయ్య గ్రంథాలయ సం...

A C No. 88028

హైదరాబాద్-500 044.

# అంకితం



నా ఈ కృషీఫలం మా ఆచార్యులు
జానపద వాఙ్మయబ్రహ్మ ఆచార్య బిరుదురాజు రామరాజు గారికి
సమర్పితం.

# ముత్తెమంత ముచ్చట

జానపదం జాతి నాగరికతకు పునాది. నిజానికి తొలితరం జ్ఞానపథమిది. వచించే మంచిని వంచన మింగినట్లు మిగిలిపోయిందే ఈ పల్లెతల్లి. కోటానుకోట్ల గాయాలతో కనలిపోయినా, తన గురించి యోచించని త్యాగమయి.

ఎవరికి తోచినంతవారు దోచుకోవటమేగాని తరగని ఈ పెన్నిధి పల్లె సంస్కృతి. దాచుకుందామని అనుకున్న వాళ్ళు తక్కువ. అటువంటి పుణ్యాత్ముల చిరు ప్రయత్నమే చిగురంతగానైనా మిగిలిన ఈ ఊళ్ళ జాలి ఆనవాళ్ళు. రాళ్ళ రప్పల ఊళ్ళే జాతి బతుకుల రవ్వలు పండిస్తుందని తెలుసుకోలేని ' నయాజమానా ' కొంచెం బుద్ధుల పెడసరం కొంచెం తగ్గితే ఊళ్ల బతుకులు కొంత ఊపిరి పీల్చుకుంటాయేమో మరి.

సరే, జానపద సంపద పుట్లకొద్దీ - అందినంతా అందించలేకున్నా - నా వంతు కృషిచేస్తున్నా -

పండిత జనానికే కాక సగటు పాఠక జనానికి చిరుపరిచితంగా ఉండాలనే నా ప్రయత్నం.

ఏ మంచి రోజు కాలుపెట్టానోగాని ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖలో నాడు కొలువున్న మహానుభావులు, ఆచార్య దివాకర్ల వేంకటావధాని, డా॥ పాటిబండ్ల మాధవశర్మ, డా॥ పల్లాదుర్గయ్య, ఆచార్య ఎం. కులశేఖర్‌రావు, ఆచార్య సి నారాయణరెడ్డి, ఆచార్య యశోదారెడ్డి, ఆచార్య నాయని కృష్ణకుమారి - వీరు నాకు విద్దెనేర్పిన ఒజ్జలు.

ఆ ముహూర్త బలమో, గురువుల ఆశీస్సుల ఫలమో కాని పరిశోధన పథంలో మాత్రం ముందుకే వెళ్తున్నాను. పరిశోధన గ్రంథాల్లో ఇది నా మూడవ ప్రచురణ. ఇంకా ఇంతకు పదింతల జానపద విజ్ఞానసంపద నా సేకరణలో ఉంది. అది ఇంతై అంతై తెలుగు సామెతలకు సమగ్ర నిఘంటువు ఎనిమిది భాగాలుగా నిర్మించాలనే సంకల్పం ఆశయరూపంగా నిలిచింది. ప్రయత్నం స్వాధీనం - ఫలితం దైవా ధీనం.

డా॥ దామోదరరావు

# దండాల దండలు

మమకార సహకారాల్ని సమన్వయిస్తూ ఆశీస్సులు అందిస్తున్న ఆచార్య సి. నారాయణరెడ్డి గార్కి, జానపద విజ్ఞానరంగంలో విశేష కృషి చేయటమే కాకుండా తెలుగు విశ్వవిద్యాలయశాఖ, ప్రత్యేకించి జానపద గిరిజనశాఖ వరంగల్‌లో ఏర్పాటుచేసి తెలంగాణాకే వన్నె తెచ్చినవారు, నాకు అన్నలాంటి ఆచార్య పేర్వారం జగన్నాథం గారికి, నాకు పరిశోధనారంగంలో మార్గదర్శకత్వం వహించిన ఆచార్య నాయని కృష్ణకుమారి గారికి.

తెలంగాణా బాసకు యాసకు ప్రాణప్రతిష్ట కల్పిస్తూ, పదునైన ఉపన్యాసాల్లో పదిలపరుస్తూ నావంటి వారికి ప్రేరణ ఇస్తున్న ఆచార్య యశోదారెడ్డిగారికి, జానపద విజ్ఞానరంగంలో ప్రత్యేక క్రియాశీలురు, మిత్రులు, ఆచార్య డా॥ ఎన్. భక్తవత్సలరెడ్డి, డా॥ ఎన్. భాస్కర్, జానపద విజ్ఞానరంగం చర్చల్లో చర్యల్లో నాతో పాలుపంచుకుంటున్న వీరికి,

ఈ వ్యాససంపుటి ముద్రణ వైభోగంలో కొంత భాగం పంచుకున్న తెలుగు విశ్వవిద్యాలయం వారికి, ముఖ్యంగా కులపతులు, మిత్రులు ఆచార్య ఎన్. గోపిగారికి, ఈ పుస్తక రచనలో ఆయా గ్రంథకర్తల సేకరణలు ఉపయోగించుకున్నాను. వారి గ్రంథాల్ని చివర పేర్కొన్నాను. మరచిపోయిన వారు మరెవ్వరున్నా, వారందరికి కృతజ్ఞతలు. మొత్తం మీద ఈ పుస్తకంలోని గుణములు గురువులవి దోషములునావి.

నిరంతర అధ్యయనానికి, అనవరత దీక్షకు మార్గం చూపిన వేదికలు, సమతాసాహితి, సాహితీగౌతమి, జానపద విజ్ఞానపరిషత్ వంటి వాటి సారథులు, సహృదయవిశారదులు గీట్ల జనార్ధన్‌రెడ్డి, బోయినపల్లి వెంకటరామారావు, నూకలమర్రి గంగయ్యాచార్యులు, డా॥ జి. లక్ష్మణరావు, డా॥ డి. నరహరి ఆచార్య, డా॥ జి. లింగారెడ్డి తదితర మిత్రులకు,

ముద్రణ విషయంలో చక్కని నేర్పు చూపిన అరుణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికి, అధినేత చుక్కారెడ్డిగారికి,

దండాల దండలు వేస్తున్నా -

*నా రచనా వ్యాసంగానికి తోడ్పాటు అందిస్తున్న నా అర్థాంగి రమకు, చిరంజీవులు శ్రీకాంత్, జ్యోత్స్న, సౌమ్యలకు దీవెనలిస్తున్నా .......*

\- రచయిత

# ఈ జనపదంలో .....


మొదటి అధ్యాయం

1. ఎ. ఎవరు జానపదులు ?

బి. జానపద విజ్ఞానం

రెండవ అధ్యాయం

2. జానపద సాహిత్యం

ఎ. గేయాలు

బి. కథాగేయాలు

సి. పురాగాథలు

డి. ఐతిహ్యాలు

ఇ. కథలు

ఎఫ్. సామెతలు

జి. పొడుపుకథలు

హెచ్. జానపదభాష

మూడవ అధ్యాయం

3. జానపద సాంఘిక ఆచారాలు

నాలుగవ అధ్యాయం

4. జానపద వస్తు విజ్ఞానం

అయిదవ అధ్యాయం

5. ప్రదర్శనాత్మక కళలు

ఆరవ అధ్యాయం

6. జానపద విజ్ఞాన పరిశోధన

# జానపద విజ్ఞానం - పరిశోధన

## మొదటి అధ్యాయం

**ఎవరు జానపదులు :**

జనపదం అంటే పల్లె. పల్లీయులు జానపదులు. ఇది జానపదులకు నిర్వచనం. అయితే ఇది సమగ్రమైన నిర్వచనం కాదు. ఎందుకంటే నగరాల్లోను జానపదులుంటారు. వీరు బతుకు తెరువు గురించి పల్లెల నుండి పట్టణాలు చేరుకుంటారు. వీరిని శాస్త్రీయంగా పట్టణ ప్రాంత జానపదులు ( Urban Folk) అనాలి.

నాగరికులు, నాగరికత పదాలు జానపదవిజ్ఞానంలో నాగరికత సంతరించుకున్న వారి గురించే కాని నగరంలో నివసించినంత మాత్రాన కాదు. అందువల్ల జానపద తత్వాన్ని మరువక ,జానపద సంప్రదాయ ఒరవడిలో జీవించే వారంతా జానపదులు అని భావించాలి. ఒకనాటి జానపద పరిశోధనలో జానపదులు అంటే జనపదాల్లో ఉండేవాళ్ళని నిర్వచించినా, నేడు సరికొత్త పరిశోధనలో జానపదతత్వం (Folk Element) ప్రధానాంశంగా జానపదుల్ని నిర్వచించడం సబబు.

జానపద విజ్ఞానంలో తలపండిన మహానుభావుడు ఎలెన్ డాండ్స్ (Alan Dands)Folk అంటే సమాన ధర్మాలుగల జనుల గుంపు అని నిర్వచించాడు. (Alan "The term folk can refer of any group of people what so ever who share at least one common factor . It does not matter what the linking factor is it could be a common occupation. Language or religion but what is important is that a group formed for what ever reason have some traditions which if calls its own " 1.

1. *The study of Folk Lore - Alan Dandes -1965*

ఒకే వృత్తి, భాష,మతం, సంప్రదాయంలో భాగస్వామ్యం పొందిన జనులు జానపదులు.

నిఘంటువుల్లో ' Folk ' అంటే ప్రత్యేక వర్గం లేదా గుంపుకు చెందిన ప్రజలు అని ( people of a specific class or group -The random house dictiionary of the English) [1]

హిందీ భాషలో జనపద్ (जनपद) అంటే (देश) దేశవాసి (देशवासी) ప్రజ (प्रजा) అనే అర్థం కనిస్తుంది. ప్రజలు (लोक) అనే పదమే Folk గా వ్యవహరిస్తున్నారు. లోక్ సాహిత్య, లోక్ గీత్,వంటి పదాల్లోని ' లోక్ ' కు అర్థం జానపదులని మాత్రమే. అందువల్ల ఇన్ని రకాల వివరణలకంటే జానపదులు అంటే, జానపదతత్వం కల్గినవారు, అని నిర్వచించుకోవటం ఉత్తమమని నా అభిప్రాయం.

## 1. జానపద విజ్ఞానం ( Folk lore )

జానపదుల సమస్త జీవితమే జానపద విజ్ఞానం . ఆంగ్లం లోని లోర్ అన్న పదాన్ని తెలుగులో విజ్ఞానమని అంటారు. లోర్ (lore) అంటే దేన్నయితే నేర్చుకుంటున్నామో, నేర్చుకోదగింది అని నిఘంటువు ( That which is learned ) వివరణ.

మొదట్లో జానపద పరిశోధకులు, జానపద విజ్ఞానాన్ని సాంప్రదాయ జ్ఞానంగా పేర్కొన్నారు. కాని సాంప్రదాయమంటే మళ్ళీ జానపద సంప్రదాయమా ! శిష్ట సంప్రదాయమా ! అన్న ప్రశ్నతలెత్తుతుంది. అంతేగాక జానపద అనే పదానికి ఈ నిర్వచనంలో చోటుండదు.

ఈనాడు జానపద విజ్ఞానం ( Folk lore ) [1] అనే పదమే నేటి పరిశోధకులు ఉపయోగిస్తున్నారు.

జానపద విజ్ఞానం ( Folk lore ) అనే పదం మొదటి సృష్టికర్త విలియంథాంస్ (1803-1855) ఈయన 1846 లో ఈ పేరును సూచించాడు. అది ప్రపంచమంతటా వాడుకలోకి వచ్చింది.

---

1. *Webster's new Twentiath Century Dictionary*
2. *Essays in Folk lonslics - Alan Dandes*

" The word was coined by W.J. Thoms in 1846 to denote the traditions, customs and supersitions of cultured classes in civilizations "2 సంప్రదాయ ఆచారాలు మరియు విశ్వాసాలు మాత్రమే జానపద విజ్ఞానం. తర్వాత కాలాల్లో ( Folk lore ) మరింత స్పష్టమైన నిర్వచనాల్ని సంతరించుకుంది.

అను వంశికంగా సామాన్య నిరక్షరాస్యులకు సంక్రమించిన సంప్రదాయ నమ్మకాలు, పనులు, ఐతిహ్యాలు మరియు కథలు జానపద విజ్ఞానం అని భావించారు.

" The traditional beliefs, practices, legends and tales of the common uneducated people transmitted orally " 3

జానపద విజ్ఞానం అనే పదం జర్మన్ ' volks kunde ' పదం నుండి పుట్టింది. జానపదుల సాంప్రదాయిక కళలు, చేతి పనులు అని దీని అర్థం.

Folk lore German ' Volks Kunde ' Covering the traditional arts and craft of the Folk '. Volk Kunde ఈ జర్మన్ పదానికి అర్థం జానపద జీవితము యొక్క సమగ్ర స్వరూపం అని " Volks Kunde embresses the total rural life " Darson పేర్కొన్నాడు. lore అనగా బోధించునది. lore means Saxonlar - Teaching అని M. Edmonson పేర్కొన్నాడు.

నృశాస్త్రములో వాడుక ప్రకారం జానపద విజ్ఞానం, పురాగాధలు, కథలు సామెతలు, పొడుపుకథలు, లయబద్ధ వాక్యాలు మరియు మాటల ద్వారా వ్యక్తపరచే తదితర కళాత్మక భావాల యొక్క రూపాల నుండి వచ్చినదని అర్థం. అందువల్ల జానపద విజ్ఞానాన్ని మౌఖిక కళ అంటారు.

" The meterial as well as the intellectual Culture of the peasentry "2 రైతాంగము యొక్క భౌతిక, మానసిక సంస్కృతిగా పేర్కొనబడినది.

" Folklore is the generic term to designate the customs, beliefs, traditions, takes, magical practices, proverbs, songs etc.," Leach

---

1. *Encyclopeadia britanica - Volume number - 9*
2. *The Random house Dictionary of the English launguage*
3. *The Illustrated heritage Dictionary*

ఆచారాలు, నమ్మకాలు, సాంప్రదాయాలు, కథలు, మాంత్రికచర్యలు, సామెతలు, పాటలు, సాధారణంగా జానపద విజ్ఞానం అని లీచ్ అభిప్రాయం.

"Folk lore is the branch of the study of man (Anthropology) which deals, with local customs, tales and traditions "[3] జానపద విజ్ఞానం నృశాస్త్ర విజ్ఞానంలో ఒక భాగం. ఇది స్థానిక ఆచారాల్ని, కథలు మరియు సాంప్రదాయాల్ని వివరిస్తుంది.

సమగ్రమైన వివరణలో ' జానపద విజ్ఞానం ' జానపదుల జీవితం రెండు ఒకటే అని చెప్పవచ్చు. జానపద సంస్కృతి ( Folk Culture ) జానపద జీవితం విజ్ఞానంలో ఇమిడి వుంటాయి.

" Folk lore to him is an aesthetic product of this society mirroring its values and offering a productive screen that illuminates its fantasies "[3].

జానపద విజ్ఞానం సంఘం యొక్క రసాత్మక దృష్టి. దాని విలువల్ని అది ప్రతిబింబిస్తుంది. మరియు వీటిని తెరమీద పెద్దగా ప్రకాశింపచేస్తుంది. ఇది నృశాస్త్ర జానపద విజ్ఞానవేత్తల అభిప్రాయం.

" The psychological Folk lorist view " మనస్తత్వ జానపద విజ్ఞానవేత్త దృష్టిలో [2]" Folk lore neither aeasthatically nor functionally but behaviouristically "[4] జానపద విజ్ఞానం స్థూలంగా సౌందర్యాత్మకం కాదు, లేక క్రియాత్మకంకాదు కాని ప్రవర్తనాత్మకంగా వుంటుంది.

ఈ నిర్వచనాల్ని పరిశీలించిన తర్వాత జానపద విజ్ఞాన పరిశోధకుడికి నృశాస్త్ర విజ్ఞానం, మానవ సంస్కృతి, పురాశాస్త్రం,మానవ మనస్తత్వ శాస్త్రం, ఆర్థిక, రాజకీయ, సామాజిక శాస్త్రాలతో పరిచయం తప్పనిసరి అని తెలుస్తుంది. వీటి అవగాహనతో జానపద విజ్ఞానాన్ని సమగ్రంగా పరిశోధిస్తాడు. జానపద

1. *American Folk lore - Darson*
2. *Oxford Junior Encyclopeadia Volume 1*
3. *Encyclopeadia Britanica Volume 9*
4. *Encyclopeadia Britanica - Volume - 7*

జీవితంలోని వివిధ రూపాలే జానపద విజ్ఞానంలో ప్రతిబింబిస్తాయని ముందే మనవి చేసాను. ఇందులో గల ఆయా భాగాల్ని వివరించి, విడిగా వాటిని ఉదాహరణలతో పరిచయం చేస్తాను. జానపద విజ్ఞానం గురించి పలు నిర్వచనాలు ఉన్నవే వర్గీకరించారు.

జానపద విజ్ఞానం సమగ్రంగా ఈ క్రింది విధంగా వుంటుంది. ఎ) మౌఖిక జానపద విజ్ఞానం బి) జానపదుల సాంఘిక ఆచారాలు సి) భౌతిక వస్తు సంబంధిత జానపద విజ్ఞానం డి) ప్రదర్శనాత్మక కళలు అని నాలుగు ప్రధాన భాగాలు. వీటిలో వివిధ విషయాలు ఈ విధంగా వుంటాయి.

**ఎ) మౌఖిక జానపద విజ్ఞానం :** ( Oral Folk lore )

1. గేయాలు 2. కథాగేయాలు 3. పురాగాధలు 4. ఐతిహ్యాలు 5. కథలు 6. సామెతలు 7. పొడుపు కథలు 8. భాష ( జానపద సాహిత్యం )

**బి) జానపదుల సాంఘికాచారాలు :** ( Social Folk Customs )

1. పుట్టుక 2. వివాహం 3. కుటుంబం 4. బంధుత్వం 5. పండుగలు 6. వినోదం 7. ఆటలు 8. వైద్యం 9. మతం 10 నమ్మకం 11. మృత్యువు 12. కర్మకాండ

**సి) జానపద వస్తు విజ్ఞానం :** (Meterial Folk lore )

1. కళ 2. శిల్పం 3. వాస్తునిర్మాణం 4. గృహ పరికరాలు 5. దుస్తులు 6. ఆభరణాలు 7. ఆహారం 8. పానీయం 9. ప్రతిమలు 10. పూజాపరికరాలు 11. వ్యవసాయం 12. వేటకు సంబంధించిన పరికరాలు

**డి) ప్రదర్శనాత్మక కళలు :** ( Performing arts )

1. సంగీతం 2. వాద్య సంగీతం 3. తోలుబొమ్మలు 4. నృత్యం 5. నాటకం

ఈ వర్గీకరణ సాధ్యమైనంతగా జానపద విజ్ఞాన పరిశీలనకు సరిపోతుంది ఇది R.M. Dorson ( డార్సన్ ) సూచించిన వర్గీకరణ [1] బాగ్స్ (Bagges) వర్గీకరణ[2]

---

1. *Folk lore & Folk life R.M. Dorson*
2. *Standard Dictionary Folk lore Mythology and legend*

**ఇ) సామాన్య జానపద విజ్ఞానం** : 1) గద్యకథనాలు 2) కథాగేయం, గేయం నృత్యం, ఆట, సంగీతం, పద్యం 3) నాటకం 4 ) సాంప్రదాయక పండుగలు 5) భూగోళం 6) భాష 7) చేతిపనులు శిల్పం 8) ఆహారపానీయాలు 9) నమ్మకాలు 10) మాట 11) సామెతలు, పొడుపుకథలు ఈ వర్గీకరణ డార్సన్ వర్గీకరణకన్నా విపులంగా వివరణాత్మకంగా వుంటుంది. సమగ్రంగా జానపద విజ్ఞానం పరిశీలించ వీలుంటుందని డా॥ ఆర్.వి.ఎస్. సుందరం ( జానపద విజ్ఞాన పరిశోధకుడు ) గారి అభిప్రాయం

అయితే స్పష్టత విషయంలో ' డార్సన్ ' వర్గీకరణ ' కంప్యూటర్ ' పద్ధతిలో ' బాగ్స్ ' వర్గీకరణ అనువుగా ఉంటుంది.

' డార్సన్ ' వర్గీకరణలో ! జంతు విజ్ఞానం ( Animal lore ) 2. వృక్ష విజ్ఞానం ( plant lore ) చేర్చినట్టయితే సమగ్ర జానపద విజ్ఞానంతో పరిశోధకులకు పూర్తి సమాచారం ( విస్తరించడానికి ) లభించటానికి వీలు వుంటుంది.

ఈ ప్రకరణంలో ' జానపద విజ్ఞానం ' యొక్క నిర్వచనాల్ని వాటిలోని విషయాల్ని వివరించాను. ఇక జానపద విజ్ఞానంలో, వివిధ విషయాలను వివరిస్తాను.

**జానపద విజ్ఞాన వర్గీకరణ** : ( Oral Folk lore )

***మౌఖిక జానపద విజ్ఞానం*** : 1 గేయాలు : Folk song ( జానపద పాట ) జానపద గేయాల ప్రత్యేక లక్షణాలు పలువురు నిర్వచించారు.[1] డా॥ బి. రామరాజు గారు తెలుగులో తొలి జానపద సాహిత్య పరిశోధకులు వారు తమ సిద్ధాంత వ్యాసంలో ఈ లక్షణాల్ని పేర్కొన్నారు.

1. మౌఖిక ప్రచారం 2. సహజశైలి 3. పాడుటకు అనువుగా నుండుట
4. పునరావృత్తి 5. జనసామాన్య పరిచిత వస్తువు కలిగివుండుట
6. ఆశురచన [2]

---

1. జానపద సాహిత్యంలో ( Folk literature ) గేయాలు ఒక భాగం మాత్రమే.
2. డా॥ బి. రామరాజు జానపద గేయసాహిత్యం.

[3] డా॥ ఆర్.వి.యస్. సుందరం మైసూరు విశ్వవిద్యాలయంలో జానపద విజ్ఞానంలో కృషిచేసిన పరిశోధకులు, వారు ఈ లక్షణాలు వివరించారు.

1. ఆదిమ మానవుని చిత్తవృత్తిని ప్రతిబింబించే మానసికస్థితిలో వెలువడటం.
2. వాగ్రూపమైన ప్రసారం కల్గి వుండటం.
3. ఒక సంప్రదాయం ఏర్పడటం.
4. అనేక రూపాలతో గోచరించడం. అంతేగాదు భావ ప్రాధాన్యత గీతరూపంగా వుండటం కథారహితంగా వుండటం ప్రత్యేక లక్షణాలుగా పేర్కొన్నారు. [3]

---

3. జానపద సాహిత్య స్వరూపం - డా॥ ఆర్.వి.యస్. సుందరం.

## రెండవ అధ్యాయం

# జానపద సాహిత్యం ( Folk - List )

### ఎ) జానపద గేయాలు :

జానపదం గేయముల పుట్టుక ' వీరులజన్మ ' శూరుల జన్మ, నరులజన్మ తెల్యనట్టుగా తెల్యదు. అని డా॥ రామరాజు గారి అభిప్రాయం.

" No body has found out its origin like the origin of a rivulet " అన్న జానపద పరిశోధకులు Maria leach " Folk song compare the poetry and music of groups. Whose literature is perpetuated not by writting and print, but through oral tradition " ( జానపద గీతం, పద్యాన్ని మరియు ఆయా వర్గాల సంగీతాన్ని పోలివుంటుంది. ఇది మౌఖిక సంప్రదాయంచేత మాత్రమే శాశ్వతం చేయబడుతుంది. కాని వ్రాత మరియు ముద్రితం చేతకాని కాదు [1] ) అని అన్నారు.

జానపద గీతం ఎప్పటికప్పుడు క్రొత్తదనం కలిగివుంటుంది. " The Folk song is neither new nor old because it is continually taking on new life. It is individual flowing on a common stem " ( జానపద గీతం కొత్త జీవితంతో కూడుకొని వుంటుంది. ఇది సహజ ప్రవాహంవలె ప్రత్యేకమైన సృష్టి [2] )

జానపద గేయానికి పైన పేర్కొన్న లక్షణాలతోపాటు జానపద తత్వం కల్గివుండటం ప్రధానమైన లక్షణంగా పేర్కొనవచ్చును. గేయరూపం కల్గివుండడం, ఒక్కొక్క సందర్భంలో రచయిత (కవి) గురించి తెల్యకపోవడము. ద్వితీయ, తృతీయ లక్షణాలుగా పేర్కొనవచ్చును. సహజశైలి, పునరావృత్తి, ఆశువుగా పుట్టడం, జీవితానుభవం, మౌఖిక ప్రచారం ఉపలక్షణాలుగా పేర్కొనవచ్చు.

జానపద గేయాలు వైయుక్తికంగా పుట్టి సామూహిక వికాసం పొందుతాయి.

---

1. *Dictionary of Folk lore Pythology and legend Volume 2*
2. *Encyclopedia Britanica Volume No. 9*

మాటనేర్చిన తొలిదశలో పాట పుట్టింది. మాటకంటే ముందే ఊహలో రాగం తట్టింది. అది పుట్టబోయే పాటకు ప్రేరణ, ఉత్సాహం, ఉద్రేకం ఊతగాపుట్టి నలుగురినోళ్ళలో నలిగి, నలిగి ప్రాచుర్యం పొంది పాటగా స్థిరపడుతుంది.

జానపద గేయాలను పౌరాణిక, శ్రామిక, శృంగార, హాస్య, కరుణ గేయాలుగా విభజించుకొని పరిశీలించవచ్చు.

జానపద గేయ సాహిత్యాన్ని - ఆచార్య బి. రామరాజుగారు

1. పౌరాణిక గేయాలు
2. చారిత్రక గేయాలు
3. మత గేయాలు
4. పారమార్థిక గేయాలు
5. స్త్రీల పాటలు
6. శ్రామికుల పాటలు
7. పిల్లల పాటలు
8. శృంగార గేయాలు
9. అద్భుతరస గేయాలు
10. కరుణరస గేయాలు
11. హాస్యపు పాటలు " అని వర్గీకరించారు.

**1. పౌరాణిక గేయాలు :** పౌరాణిక గాథల ఆధారంగా పుట్టిన గేయాలకు, మూలం, మన రామాయణ భారత గాథలే అయితే, వాటిల్లోని ఉపాఖ్యానాల్లోని కథలు కూడా పౌరాణిక గేయాలుగా, రూపాంతరం చెంది, స్త్రీల నోటిలో, చక్కని తాళగతిలో, చిన్న చిన్న పాటలుగా నిలిచిపోవటం, జానపద తాత్త్విక చింతనకు, వారు అలవర్చుకున్న సులభోపాయంగా భావించవచ్చు. సాధారణంగా రామున్ని గురించి, లేదా భారత కథలోని, ధర్మరాజు, ద్రౌపది, కృష్ణుడు వంటి వారు పాత్రలుగా సుదీర్ఘ కవితా రూపంలో, గేయాలు ఉండటం కన్పిస్తుంది. అయితే అరుదుగా నైన, భారత రామాయణాల్లోని ఘట్టాలకు, చిక్కని ఖండికలుగా మలచిన గీతికలే స్త్రీలనోట ప్రాచుర్యాన్ని పొందాయి. ఉదా : ఊర్మిళాదేవి నిద్ర, ధర్మరాజుజూదం, లక్ష్మణమూర్ఛ వంటివి కన్పిస్తాయి. అయితే, భారత రామాయాణాల మూల కథలే కాకుండా ఆ కథాగమనంలో అక్కడక్కడ మహాకవులు వివరించిన కథాఘట్టాలు కూడా, గేయాలుగా రూపొందటం, జానపద పౌరాణిక గేయాల ప్రత్యేకత. అందుకే, అటువంటి గేయం : - " గోవ్యాఘ్ర సంవాదం " ముక్తసరిగా " గోవుపాట " గా జానపదుల నోటిలో ప్రాచుర్యాన్ని పొందింది.

మాతృహృదయావేదన, మానవతా కారుణ్య దృక్పథం రెండు పెనవేసుకున్న మధుర కథావృత్తాంతమిది ; దీనికి జానపదులు కల్పించిన గేయరూపం గమనించండి. అపురూపమైన ఈపాట పూర్తిరూపం వివరించాను చూడండి - " గొల్ల కృష్ణ వేణునాదం చేతపట్టుకు వూదుకొనుచు గోవుమందలవెంట నడిచి పొన్న వృక్షము చెంత చేర గోవులన్ని పొదలదూరి కలగలసి మేయుచుండగాను, పెద్దకాలపు అవులాగ పేరు పడ్డా మందలార కపిల అవు దూడల్లార, కర్రియావుచూడరావె, తెల్ల అవు పిల్లరావే, బొల్లి అవు నీవురావె, కామధేను కల్పతరువా శ్రీలక్ష్మీపేరిందేవి అన్నపూర్ణ విశాలక్షి, తెల్ల మచ్చ గోవురావె నల్లమచ్చ అవు రావె చిన్న అవు దూడరావె శనివారం విష్ణుప్రీతి పోరునిలచి తాను బట్టి దట్టి బిగియగట్టి లేగ దూడల చేతబట్టి శృంగారపు చెంబువట్టి మొండితాళ్ళు తెచ్చి తాను బంధములను వేయుచూను గోవులకు పాలుపిదికి గొల్లభామల మూపులందు బెట్టి వారి యిండ్ల కలిసి చెట్టు యెక్కి వేణునాదం చేతబట్టుచు వూదుచుండగా గోవులన్నీ పొదల దాటి నలుదిక్కుల మేయుచుండగ తూర్పు దిశకు కొన్ని వెళ్లి గట్టుపైని మేయుచుండగా గొప్పనాదం చెవులబడగ, అదురుకుంటూ బెదురుకుంటూ మేతమాని ఎదురుగా గాండ్రు గాండ్రు మనుచు వేగమే పెద్దపులి యొకటి వచ్చినిలచి నాదు పొలము పాడుశాయగ నేడు వచ్చిన యావులార పోకు పోకుడు మేతమాని చిక్కినారుగా నారు చేతికి వారమొక్క జీవనముగా గొంతు విరిచి రక్తమెల్లా గ్రోలిపొట్ట చించి వేగమె కొవ్వుదీసి నారగిస్తును చాటి పోవా జూతురేమొ పారిపోవా జూతురేమొ కురుచ కొమ్ముల చిన్న యావుల నిడువు కొమ్ముల పెద్దయావుల పేరుపడ్డా యావులార కోట్లకొద్దిగ తిన్న దానను నన్ను విడిచి పారిపోతె వెంట తరిమీ చంపివైతు నాది పొలమూ చేరి మీరు నాకు హితము దొరికినారు. నాదు పేరు వ్యాఘ్రము మాకు మీకు వైరమెందుకు నేను చెప్పినమాట దాటక బుద్ధిగలిగియుండు మనుచూ బల్కగా నా యావుముందునిలచి తాను బల్కుచుండె, వేరు వేరుగనున్న యావులు వెనుక కొంసలగాను వ్యాఘ్రమనూ వినుమునాదు ఒక్క మనవి చిత్తగించు మూడు దినములక్రింద నేను (కవల) దూడల కన్నదానను నన్ను పెంచిన దాతలెల్లా పాలుపితుకకయుండగాను ఆ రెండు దూడల బెంచుచుంటిని కాదుకరాకు దూడలెల్లా యెదురు చూచుచు బెంగతోను శలవుయిచ్చి పాలుయిచ్చి మళ్లీ వచ్చి నీదుయాకలి దీర్తునని బల్కగాను నీదుమాటలు నమ్మి నేను వదిలివేయను నమ్ము నన్ను వ్యాఘ్రమును నేనుగానూ

అనుచు బల్కుచుండెను సకలదేవతలాన వచ్చెద నాదు పుణ్యముదార బోసెద నాదు కోడల మీదుగాను సత్యమైన తల్లిదండ్రి తోడునీడల మీదనేను సకలయానలు బెట్టెదాను సత్యవాక్యము దప్పితేను స్వామిద్రోహం జేసినట్లు పుట్టినింటివారికెల్లా అత్తవారియింటికెల్ల కీర్తిసంపద బోయినట్లు కల్లకాదు చూడవమ్మ బొంకుగాదు మాటనమ్ము శలవు యిచ్చిన వేగవత్తును కోరి మ్రొక్కితి కావుమూ. ఇన్ని విధముల కోరగాను గొప్పయానలు బెట్టగాను పెద్దపులికి జాలిగలిగి యడవిలోన యానబెట్టి తప్పితేను ద్రోహములు చుట్టి చుట్టి తరిమికొట్టి నిన్ను బట్టి చంపివేతును శానవేగమె వెళ్ళి నీవు నీదు కొడుకుల జూచి పాలుయిచ్చి మళ్ళీ రమ్మటంచు శలవుయిచ్చిన గంతువేయుచు ఛంగుఛంగున దాటకొనుచు యింటి మొగమై దొడ్డి జేరియు కవలదూడల జేరబిలిచీ పాలుయిచ్చి తృప్తిపరిచి బిడ్డలారా వేగవెళ్లెద అడవిలోను మేయుచుండగ పెద్దపులి ఒకటొచ్చి బట్టగ బిడ్డలకు జెప్పి వేగమె వస్తుననుచు బాసలిచ్చి వచ్చియుంటిని గాన మీకు బుద్ధిగలిగి మసలు చుండుడి వచ్చెచేను మేయబోకా కాపుచేతిలో చిక్కబోకా పొదచాటున మేయబోక పులులనోటికింద బోకా ఇండ్లలోనా తిరుగబోకా కర్రదెబ్బలుతినక మీరు కాపువాడు మేవబోవు బీళ్ళయందు నిలచికనవు కడుపునిండా తినుచు మీరు దొడ్డికొచ్చి నిద్రజెందుడి పేరిందేవి మీనాక్షి ఆదిలక్ష్మీ అన్నపూర్ణా కామధేనువు కల్పతరువా పేరు బిడ్డా గోవులార నాదుకొడుకుల మీరు జూచి ముందుకొచ్చిన బొడవ బోకా, వెనకొచ్చిన తన్నబోకా, మందజేరు ఇక బుద్ధిగ అడినే వ్యాఘ్రరాజా ఆకలిదీర్చబోయెదా ఓ గోవులారా నాదు కొడుకు దయతో చూడు తుంగభద్రా నదుల్లలోను స్నానమాడి భగవాను దేవిని పూజించితాను అడివికేగెనూ, ఓ జనుల్లారా చూడ చోద్యముగాను యుండెనూ అన్నలారా చిన్నలారా ఆకలిగనుంటి దోషము వ్యాఘ్రరాజా వేగవచ్చితిని కోపగించక నన్ను జంపుము కోటిగోవుల తిన్నదానము లక్ష రుచులను యొరిగియుకడి సకలన్యాయము తెలిసియుండి గడువు మీరక వచ్చి నేను బొబ్బిలిడనా రాకయుండుట పులిరాజా తెలియజాలను, ఓ వ్యాఘ్రరాజా తల్లినీవు లక్ష్మీదేవిని అన్నమాట వాడనేరవు నిన్నుమించినవారు భువిలో నీతిపరులాగాన లేరు నీదు చర్యలు విన్నవారలు చదువువారలు వ్రాయువారలు యెంత మూర్ఖద్రోహులయిన పుణ్యమబ్బి మోక్షమందేరు ఓ జనులారా తప్పకను చదువుచుండిడీ అనుచు చెప్పి ప్రాణ మొదలెను బ్రహ్మవచ్చెను రుద్రుడొచ్చెను. విష్ణువచ్చెను

యింద్రుడొచ్చెను సకలదేవతలు వచ్చిరి తల్లినీవె మాతనీవె నిన్ను మించిన నీతిపరులూ యెల్లలోకములందు లేరు నీవుయున్నా గ్రామమందు పంటలుపండు పూర్తిగను నెలకు మూడు వర్షములు సకలజనులూ సుఖము నొందేరు ఓ గోవులారా నీదుకీర్తిని జెప్ప శక్యమా నీదు చరిత్రము చదువువారలు విన్నవారలు జూచువారలు కైలాసపదవి జేర శుభమును వుందురనుచూ మేము చెప్పిన మాటలెల్లా శాశ్వతంబుగ జరుగుననుచు చెప్పి వారి లోకములకు వెళ్ళి నంతట యల్లయావు మందజేరి బిడ్డలకు పాలుయిచ్చి సుఖముగనుండెను ”

ఇది నాటి జనపదాల్లో వ్యాప్తిలో ఉన్నా ఒక పౌరాణిక కథా ఖండిక, నేడు ప్రాచుర్యంలో లేదు, వీటిని జానపద విజ్ఞాన పరిశోధకుడు, ఏవిధంగా విశ్లేషించుకోవాలో చూద్దాం -

జానపద కథకుడి మనస్తత్వ రీత్య కథాగమనంలోను, మూలకథలోను, మార్పులుంటూంటాయి, ఇది మొదటి అంశం. కథా ప్రసార కాలంనాటి సామాజిక స్థితిగతులు రెండో అంశం. ఉదా ॥ కథలకు పాఠకజనం స్పందన, కథల్లోని నీతికి గల గౌరవం, కథలవల్ల గల ఆసక్తి కారణమవుతాయి, ఇక మూడవ అంశం కథాంశాల పరిశీలన ఇది అత్యంత ముఖ్యమైనది. కథలో అవాస్తవాలు ఉండవచ్చు, అతిశయోక్తి ఉండవచ్చు, వీటి అడుగున దాగిన ఆణిముత్యాల శోధనే జానపద విజ్ఞాన పరిశోధకుడి లక్షణం. ఈ కథ పౌరాణికమా ! చారిత్రకమా అన్నది ఈ కథ గేయరూపంలో పరివర్తన చేసిన వారికి తెలియవలసిన అవసరం లేదు. కేవలం కథలోని నీతి ఆధారంగా దీన్ని కథాగేయంలో మలిచి పాడటమే వాళ్ల అవసరం. పాఠక లోకానికి కూడా, కథాంశాల్లోని ఆసక్తి, నీతిబోధ మాత్రమే ఆకర్షణమవుతాయి. అయితే పాడే వారి గాత్రము, అభినయం తదితర కళాంశాలు కూడా ప్రభావితం చేస్తాయి, అందువల్ల పౌరాణిక గేయాల ప్రాముఖ్యంలో, ‘ గాత్రకళాభినయం ’ కూడా ప్రాధాన్యత గల్గి ఉందని పరిశోధకుడు గమనించాలి.

ఇక కథ అంతా ఒక ఎత్తు, కథాంశఘట్టం వివరించే, దృశ్యం మరో ఎత్తుగా ఉంటుందని పరిశోధకులు గమనించవచ్చు. కథాంశాల్లో లాగా గేయాల్లోనూ కొన్ని అంశాల్ని ప్రాతిపదికంగా విశ్లేషణ చేసి వివరించవచ్చు, ఈ కథాగమనంలో గోపాలుర ఇండ్ల దృశ్యంతో ప్రారంభం కావటం మరో దృశ్యంలో ఆవు తన దూడలకు చేసే హితబోధ ప్రతిరైతు హృదయంలోని మాటలే, గోపాలుర మానసిక

స్థితిగతులకు అద్దం పడుతుందని గమనించటమే జానపద విజ్ఞాన పరిశోధకుడి సరికొత్త శోధనకు దోహదపడుతుంది. దాని ఆధారంగా అతను మున్ముందు తన పరిశోధన విశ్లేషణ పరిధి విస్తరించుకో వీలవుతుంది. కథ చివరలో ముక్కోటి దేవతలు ప్రత్యక్షం కావడం జానపదుల దైవ చింతనాసక్తిని కల్గించే కల్పనగా భావించవచ్చు. ఈ విధంగా గేయాలను, సరికొత్త పద్ధతుల్లో విశ్లేషించుకొని సమన్వయపరచవచ్చు.

**ఊర్మిళదేవి నిద్ర :** " శ్రీరాను భూపాలుడూ పట్టాభిషిక్తుడై కొలువుండగా భరతశత్రుఘ్నులపుడు సౌమిత్రి వరుస సేవలు చేయగా మారుతాత్మజులపుడూ రాఘవుల చేరి పాదములొత్త సుగ్రీవుడా కొలువులో కుర్మితోనమ్రుడై కొలువుండగా తుంబురుడు నారదుడును ఏ తెంచి నిలిచి గానము సేయగా రంభాదులా సభలలో యింతి శుభరమ్యమున నాట్యమాడా సనకాద మునీంద్రులు కొలువులో శాస్త్రములు తర్కించగా, సకల దేవతలు కొలువున ఉదయాన పుష్పవర్షము గురిసెనూ......... వాల్మీకి మహాకవులు మరచిన మహాసాధ్వి ఊర్మిళ, ఆమె త్యాగనిరతి జానపదులు మరవలేదు. ప్రాధాన్యత ఇచ్చి తమ నిత్యగాధలో నిక్షిప్తం చేసారు. అనునిత్యం పారాయణగా ఆమె సుగుణశీలత స్మరించారు. ఆ స్మరణయే ఊర్మిళాదేవి నిద్రపాట రూపంలో స్త్రీలోకంలో నిలిచిపోయింది. భార్యభర్తల అనురాగస్మరణ గీతంగా వీరు ఈ పాట మలిచిన తీరు అమోఘం.

ఈ రసవత్తర ఘట్టమే జానపద మనస్తత్వ పరిశీలనకు మరోసాక్ష్యం - ఊర్మిళ గదిలోకి సుదీర్ఘ వనవాసం పిదప అడుగుపెట్టిన లక్ష్మణ మూర్తితో ఊర్మిళ జరిపిన సంభాషణ ఆదర్శ స్త్రీ మూర్తుల మనోభావాలకు, జానపద ముగ్ధ స్త్రీ సహజ అమాయకతకు దర్పణం.

" అయ్యామీరెవ్వరయ్యా మీరింత యాగడము వొస్తిరో సందుగొందులు వెదుకుజూచి మీరింత తప్పు సేయగవస్తిరి, ( అంతఃపుర రక్షణ రాజరికం కట్టుబాట్లు జానపద స్త్రీ, మనస్సును కట్టడి చేయలేదు ) ఎవ్వరూ లేని వేళ మీరిపుడు ఏకాంతముల కొస్తిరా ! మా తండ్రి జనకుడు వింటే మిము అజ్ఞసేయక మానరూ, మా యక్క బావ విన్నా మీకిపుడు ప్రాణములకు హానివచ్చు. మా అక్క మరిది విన్నచో మిమ్ము ఇపుడు బతకనివ్వరు, జగతిలో హెచ్చైన వంశానికి అపకీర్తి వచ్చే నేనేమి జేతూ, కీర్తిగలయింట బుట్టి అపకీర్తివచ్చె నేనేమి

జేతూ," అంటూ పరస్త్రీ వ్యామోహం తగదని చెప్తూ " ఒకడాలి కోరె గదా ఇంద్రుడకి ఒడలెల్లా హీనమాయె పరసతికోరేగదా రావణుడు మూల్గములో హతమాయెను ఒకడాలి కోరగా కీచకుడు ప్రాణములు గోలుపోయే " అంటూ, అచ్చమైన జానపద స్త్రీ గ్రామీణ వాతావరణంలో ఏ విధంగా ఉంటుందో జానపదుడు మనముందుకు తెచ్చాడు " అడ తోడబుట్టువు మావంటి తల్లిలేదా మీకును అనుచు ఊర్మిళ పలుకగా " ఇది ఓ మామూలు జానపద కుటుంబంలో జరిగే సంభాషణల స్థితిగతుల్ని పౌరాణిక ఘట్టాల్లో సైతం విస్మరించని, జానపద కల్పనా చమత్కృతికి పతాక. జానపద తత్వానికి ఇటువంటి గీతాలెన్నో మచ్చుతునకలు, సుదీర్ఘమైన ఈ పాటలో, ఊర్మిళ లక్ష్మణుని గుర్తించిన పిదప చేసిన సత్కారములు, పతిపట్ల సతికి గల గౌరవం, అభిమానం, ప్రేమ అన్నీ సమగ్రంగా వివరించబడినవి. ప్రేమత్యాగనిరతి గల భిన్న ప్రేమకథాగాధగా తీర్చిదిద్దినట్లుగా అనిపిస్తుంది.

నిజానికి స్త్రీలపాటల్లో, నూటికి తొంభై పౌరాణిక గాథల స్పర్శతో పునీతమైనవే కొన్ని చిన్నచిన్న పాటలు తప్ప ప్రతి పాటలో దైవస్మరణ తప్పని సరి కాబట్టి - పౌరాణిక పాటలు ఉదహరించేటప్పుడు స్త్రీల పాటలు ముందుంటాయి.

ధర్మరాజు జూదం, లక్ష్మణదేవరనవ్వు పారుజాతపల్లవి వంటివే గాక కుటుంబ జీవితంలోని వివిధ ఘట్టాల్ని సైతం, పౌరాణిక పాత్రలకు అంటగట్టి వారంతా తమ కుటుంబ సభ్యులుగా భావించి తరించటం, జానపద మనస్తత్వంలో మరో ముఖ్యాంశం. అందుకే, ' సీతాదేవి వామన గుంటలు ' ' సీతాదేవి సమర్త ' వంటి పౌరాణిక పాటలు కూడా ప్రాచుర్యం పొందాయి. సున్ని పాటలు అటువంటివే. నిజానికి ఈ పాటలన్నీ జనపదాల్లోని తమ కుటుంబాల్లో ఆయా సంఘటనల సందర్భంలో పాడుకునేవిగా రూపొందించారు. ఒకవైపు భగవన్నామస్మరణ, మరోవైపు మనోభావ స్వచ్ఛత కలబోసుకున్నారు. ' సీతసమర్త' ఘట్టంలో ఓ సంఘటన సీత అత్తారింటికి వెళ్లిన పిదప ' సమర్త ' కావటం. ఇది బాల్య వివాహాలకు సంకేతం, నిజానికి నాటి రోజుల్లో తప్పనిసరిగా పాటించిన సాంఘీక ఆచారం, అది సీతారాములకు తప్పనీయలేదు జానపదులు. ఇక్కడ రామాయణ కాలంలోగాని, సీతారాములు దైవస్వరూపులు కాదా ! రాజరిక కుటుంబాల్లో ఈ ఆచారం ఉండేదా ! అనే మీమాంసలతో పనేలేదు. ఇది కేవలం జానపద ఆచార పరంపరలోని భాగం అంతే అని భావించాలి. పరిశోధకుడి నిజమైన విశ్లేషణ ఇటువంటి ఘట్టాల్లోనే స్పష్టమవుతుంది.

**2. చారిత్రక గేయాలు:** చారిత్రక సంఘటనల నేపథ్యంలో వెలసిన పాటలు ఈ చారిత్రక గేయాలు. ఇందులో, పౌరుషం ప్రావీణ్యత, యుద్ధనిపుణత, కష్టాలపాలైన సామాన్యజనంలో పోరాట పటిమ పెంచిన వీరయోధుల చరిత్ర కలిసి ఉంటాయి. చారిత్రక గేయాల్లో ఏదో విధంగా సామాన్య జీవితంలో నుండి, వీరయోధులుగా మారినవారిపట్ల ఆరాధనా భావం కన్పించటం సర్వసాధారణాంశం. అందునా కథాకల్పనలో అతిశయోక్తులుంటాయి. ఈ విషయాన్ని జానపదుల దృష్టిలో పరిశీలించాలి. ఎందుకంటే, అద్భుత శక్తులుంటేనే తప్ప, వీరారాధన కుదరదని వారు భావించటమే కారణం, ఈ అద్భుతశక్తులు, దైవ దత్తం కావొచ్చు, లేదా ఎవరైన గొప్పవ్యక్తి (మునుల వంటివారి) వరప్రసాదం కావొచ్చు. మొత్తం మీద వ్యక్తికి గల వీరత్వానికి, ఈ శక్తులు మరింత వన్నె తెస్తాయని జానపదుల విశ్వాసం, చారిత్రక గాథల్లో వాస్తవమెంత అన్న దానితో జానపద పరిశోధకుడికి పనిలేదు. ఈ విషయ పరిశీలన ఈ పరిశోధన పరిధిలోనిది కాదని యువ పరిశోధకులు గుర్తించాలి. ఇది చారిత్రక పరిశోధకుల పని, ఇక్కడ మనకు కావాల్సింది, జానపదుడి మనోభావ పరిశీలన, వారి జీవిత విధాన భాండాగారం నుండి అజ్ఞాతభావాలు అందుకోవటమే కావల్సింది. సత్యాసత్యాన్వేషణకన్నా, జనపదుడి తాత్త్విక ధోరణిలోని అమాయకత, వారి స్పష్టమైన సులభమైన భావనవైచిత్రి పరిశీలన ముఖ్యమని గుర్తుంచుకోవాలి.

ఎందుకంటే చారిత్రక గేయాల పఠనంలో గాని, పరిశీలనలో గాని, అనేక అవాస్తవ విషయాల కల్పనలు సహజంగానే కన్పిస్తుంటాయి. ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరంలేదు.

సర్దార్ పాపన్న కథలోగాని, కుమారరాముని కథలో గాని, సీతారామరాజు కథలోగాని, ఎన్నోరకాల కల్పనలు కన్పిస్తాయి. మహిమలు అద్భుతశక్తులు వారికున్నట్లు చెపుతారు. అయితే, ఇవన్నీ జానపదుల ఆరాధన దృక్పథంలో అంతరంగిక విషయాలుగా సర్దిపుచ్చుకోవల్సిందే -

**కుమారరాముని కథ:** ఆంధ్ర కర్నాటక ప్రాంతాల్లో రెండు చోట్ల ఈతని వీరగాథ వ్యాప్తిలో ఉండటం విశేషం. దీనికి కారణం, అప్పటి సరిహద్దు ప్రాంతాలు కావొచ్చు లేదా, వీరజనస్తుతి ప్రాచుర్యం పొందటంవల్ల కూడా కావొచ్చు. ఏది ఏమైన, ఒకానొక అపురూప వ్యక్తి చరిత్రగా కుమారరాముని కథగా చెప్పారు.

కుమార రాముడి కథ వృత్తాంతరీత్యా, రాజవంశ చరిత్రగల్గినవాడే, ఢిల్లీ సుల్తాన్ వరకు శౌర్యప్రతాపాలు, వెలువరించి అతని మనసు చూరగొన్నారు. అయితే ఈ కథలో కుమారరాముని సహవాసిగా ఒక విధంగా ఒక చోట పుట్టి పెల్గిన వ్యక్తిగా మరొక రాముడున్నాడు. అతడు పోలిక రాముడు, వాడు చేసే అకృత్యాలు కూడా కథలో వర్ణించారు. ఈ విధంగా, ఇద్దరు రాముల మధ్య మానసిక అంతర్యాన్ని చూపుతూనే, కథా సంవిధానం సాగింది. ఇందులో ఉన్న చారిత్రక అంశాలు. మరే చారిత్రక గేయంలో లభించవు. ముస్లిం పాలకుల రీతి నీతి, కన్నడ తెల్గురాజ్యాల పరిస్థితులు, నాటి కుట్రల కుతంత్రాలు, రాజుల పట్ల పౌరోహితుల ఆధిపత్యం. కపటనాటకాలు, యుద్ధతంత్రాలు, అన్నీ కుమారరాముని కథలో వర్ణితాలు, చారిత్రక అంశాలు, జానపద పరిశోధనలో అవసరం లేకపోయినా, ఇక్కడ వీరుల ఔన్నత్యం, వారి త్యాగనిరతి స్పష్టంగా ప్రజలు గుర్తించారని చెప్పటానికి జానపదుల నోళ్ళలో, పాటలుగా ప్రాచుర్యం పొందుటకిది సాక్ష్యం - నిజానికి కుమారరాముని కథ మొత్తం పూర్తి గేయాత్మకం కాదు గాని, గేయాల వరసలోనే చేరుతుంది. కారణం, కథలో, గేయరీతి, తందనానకథ, రూపంలోని కథనం దీనికి కారణం, వచనం కూడా ఉంది. అయితే, కథాంశంలోని వంతలు సంభాషణల వంటివే కావటంవల్ల గేయంగానే గుర్తింపు పొందింది. సంతానాపేక్ష గల స్త్రీ చేసే పూజలు నోములు తప్పనిసరి, ఈ గాధలో, కుమారరాముని తల్లి, తపస్సు ఆచరించే విధం చూస్తే జానపదుడి కల్పనా చమత్కృతి తెలుస్తుంది -

" పర్వతము మీదికి వచ్చింది
శ్రీరాముల దేవళము
తెచ్చిన సామానంతయు దింపించి
అయిదు బిందెల ఉదకము
స్వామివారికి ఆ వేళ
అభిషేకము సేయించి
యేదుము వెండి పూవులేమి
పందుము పైడి పూవు లేమి
స్వామివారికి ధూపమ్ము వేయించి
ఎదుట అఖండము వెత్తించి
సాష్టాంగము సేవించి -

( ఇక్కడి వరకు సహజంగా సాగిన కథ కథనం మరో కోణంలో జానపద కల్పనగా మారి పోయింది )

*" ఆ దేవళము ముందరను*
*గుమ్మడి పండు మీదను*
*నరులెక్క లేరు దిగలేరు*
*ఆసూది గుండు మీదికి*
*భామ త్రాను ప్రాకెను*
*ధర్భాసనము పరచినది*
*దర్భాసనము మీదను*
*పులిచర్మము పరిచినది*
*పైన జింక చర్మం పరిచినది*
*జింక చర్మము మీదను*
*గుమ్మడి పండు నిలిపెను*
*సూది గుండు ఉన్నదిసూది మీద సూదేమి*
*యేడు సూదులు నిలిపెను*
*చివర సూదిని అరియాలి*
*ఆవగింజల నిలిపెను*
*ఆవగింజ మీదను*
*శిరస్సు క్రింద మోపినది*
*శ్రీపాదము మీదేమి*
*భామ తపస్సు పట్టింది*
*మూడు ఘడియాల తపస్సును*
*చుక్కలు పిక్కటిల్లెను*
*సూర్య చంద్రులు*
*త్రోవలు తప్పుడు విధమాయె*
*భామ తల్లడిల్లెను*
*నాళ్లకు చెదలు పట్టెను*
*అగ్నికి ఈగలు ముసిరెను*
*అప్పుడు స్వామి వారేమి*
*గడగడ వణుకుచును*
*అబ్బ ఎంత తపస్సు పట్టినది*
*నేను చూడలేనేమి*

అంటూ, ప్రత్యక్షమైనా - " ఇది కథాగమనం, ఇక్కడ పరిశోధకుడు గమనించాల్సింది. తపస్సు ఎంత కఠినంగా ఉంటే అంత త్వరగా దైవం ప్రత్యక్షం అవుతాడనే జానపదుల విశ్వాసానికి, ప్రాతిపదిక. నిన్నమొన్నటి వరకు ' సిడి ' లాంటి వీరభక్తి ప్రదర్శనలన్నీ జానపదుల సొత్తు, ఇప్పటికి వీరభక్తి కనిపిస్తూనే ఉంది. అయితే కథలో గల ' సూది మీద సూది ' వంటివి తపస్సు ప్రత్యేకంగా వర్ణించాలనే భావనే, మరోవైపు దైవచింతన. ఎంతవరకైనా తెగిస్తుంది అని చెప్పటం కూడా కారణమవుతుంది. ఏది ఏమైన జానపద పరిశోధనలో గమనించాల్సింది ప్రతి గాథ వెనుక, జానపదీయుడి మనస్సు -

మామూలు వ్యక్తులు మామూలుగా గర్భందాలుస్తారు. అందులో వింతలేదు. అయితే విచిత్ర వ్యక్తిత్వాలు, వీరవరులు, దైవాంశసంభూతులు అదే విధంగా జన్మించారంటే, జానపదులు అంగీకరించరు, ఏవైన ప్రత్యేకతలు ఉంటేనే, జనంలో గాథలకు ప్రాచుర్యం లభిస్తుంది. అవి త్వరగా వ్యాప్తి నొందటానికి సహకరిస్తుంది. ఈ అద్భుత వర్ణన చూడండి.

దైవవర ప్రసాది అయిన కుమారరాముని తల్లి, అరియాలి గర్భం దాల్చిన విధము -

" బంగారు గిన్నెలో
అరటి పండు యుంచినది
అ తొరకంతటిని ఉంచినది
శ్రీరాములను నుతియించి
పండును అనుభవించినది
తొరకను పారవేసినది
అది పుచ్చుకున్న గడియకు
జిల్లేడును పాలిన
పాలిన ఒక్క చందమున
దేహమంతయు బాలెను
తమలపాకు చాకిన

చీకిన ఒక్క చందమున
దేహ మంతయు చాకెను
అన్న హితవు తప్పెను
వేవిళ్ళు ఘనమాయె
వెలదిబ్నిలు అరియాలి
మూడవ ఒక్క ఘడియెకు
ముత్తెమంత పిండము
ముద్దు మీర నిలిచెను
ౕత మంత పిండెము
ౕగాడే గర్భము
ౕయుదు గడియల గర్భము

పట్టముదేవికి నిలచినది " - అదే సమయంలో దాసి కూడా తొక్కతినటం, ఆమెకు గర్భం నిలచి పోలికరాముడు జన్మించటం, అతడు అసహాయశూరుడుగా మారటంలో కథలో గమనించాల్సిన విషయాలు - " పండుకు కల్గే సంతానం తొక్కుకు కల్గదా " అని కథలో నర్మగర్భంగా పలుకటం కథలో పోలిక రాముని అంశం ; వీరత్వానికి, కులతత్వానికి సంబంధం లేదని తెలుపటమే - అయితే, దాసి సంగకు పుత్రుడు కలుగగనే చోద్యములు పుట్టుట, రాణిగారి పుత్ర సంతతి కల్గువేళ శుభపరిణామాలు కల్గుట వంటివి, ప్రత్యేకతలు వివరించేటందుకు కల్పించినవే - దాసి సంగకు పుట్టినవాడు చోరుడవుతాడని బ్రాహ్మణులు తెల్పటం ఈ దుర్గుణములు పన్నెండు సంవత్సరముల వరకే అని వివరించటం జర్గుతుంది. దాంతో మహారాజు, దాసి కుమారున్ని కూడా, తన కుమారునితోపాటు ఒకే బంగారు తొట్లెలో వేయటం, మహోన్నత వ్యక్తిత్వాల్ని చిత్రించటమే - ఈ గాథలో కుమారరాముని తోపాటు దాసిపుత్రుడైన పోలికరాముడు సైతం వీరత్వంలో ముందుంచటం - యుద్ధాల్లో కుమారరామునికి సహకరించటం కన్పిస్తుంది. బాల్యదశలో కుమారరాముని కథ ఎట్లు ఉన్నా, పోలికరాముని అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు, ఇవన్నీ రాజకుటుంబానికి ఇబ్బందులు కలుగజేసేవి - అయినప్పటికి, అతనికి కూడా కుమారరామునితోపాటు యుద్ధవిద్యలు నేర్పి, వీరునిగా తీర్చిదిద్దటం

కన్పిస్తుంది. అదేవిధంగా కుమారరాముడు పోలిక రాముడు ఇద్దరు అన్నదమ్ముల్లా కలిసి ఉండటం - ఈ గాథలో పోలిక రాముని చేష్టలే ఆసక్తి కల్గించేటట్లు కథాగమనం ఉన్నప్పటికి చివర్లో మాత్రం పోలికరాముని వీరత్వం. అతని ఎత్తులు, జిత్తులు అతనికి కుమారరామునితోపాటు సమప్రాధాన్యత కల్పించినాయి. ఈ కుమారరాముని కథ ఆసక్తికరంగా సాగినా ఇందులో, చారిత్రికాంశాలు కోకొల్లలు, ప్రతాపరుద్రుడు, ఢిల్లీ సుల్తాను, తదితర రాజవంశీకుల మధ్యగల పరస్పర ఒప్పందాలు, కలహాలు అన్నీ సంపూర్ణంగా చిత్రించబడినవి. కథలోని వాస్తవాలు ఎట్లున్నా కథల్ని మాత్రం చిత్రవిచిత్రసన్నివేశాలలో ; అద్భుత కల్పనలలో జానపదులు చెప్పుకునే వారనటానికి ఈ కుమారరాముని కథ చక్కని ఉదాహరణ ; అద్భుత దృశ్యాలతోపాటు ఆసక్తి కల్గించే సంఘటనలు కథా గమనంలో ప్రాచుర్యం పొందుతాయని, కుమారరాముని కథలోని, పోలికరాముని వృత్తాంతం చెప్తుంది. ఇక మరో చారిత్రక గేయం, సర్వాయి పాపన్న కథ, ఇదే ' సర్దార్ పాపన్న ' గా ప్రాచుర్యం పొందిన గేయ కథావృత్తాంతం, తెలంగాణాలోని ఒకానొక వెనుకబడిన తరగతుల కులానికి చెందిన ఒక చిన్న బాలుడు, ఏకంగా తన బుద్ధి కుశలత, వీరత్వం కారణంగా, గోలుకొండపై దండెత్తి కొద్ది కాలమైనా గోలుకొండను పరిపాలించటం, ఈ కథావృత్తాంతము. ఇందులో ' పాపన్న ' శౌర్య కుశలత, బుద్ధి చతురతలు ఉన్నప్పటికి, దైవాంశ సంభూతుడని, మహిమలు కలవాడని కథలో కల్పనలు కన్పిస్తాయి. ఇవి జానపద కథల్లో అనివార్య అంశాలు. అయితే పాపన్న శౌర్య గుణాన్ని ఇవి ఏ మాత్రం తగ్గించవు. చారిత్రికంగా కూడా ఆధారాలున్న చరిత్ర పాపన్న కథ. గౌడ కులానికి చెందిన పాపన్న కులవృత్తిని చేపట్టి బతకమని బోధించినా వినలేదు. వ్యవసాయం చేయమన్నా అంగీకరించలేదు. పాపన్న చిన్ననాటి నుండి బానిసతత్వానికి వ్యతిరేకంగా శౌర్యంతో వెలిగిపోతాడు.

" వస్తాడే తాను సర్వాయిపాపడు
కొట్టుదును గోలుకొండ పట్నము
తల్లికొలువుకు త్వరగా వెళ్ళేను
ఢిల్లీకి మోజూరు నౌదును
తల్లి దండముగ నిలిచేను
మూడు గడియల బందరు కొట్టుదును
యేరు కట్టి వ్యవసాయము అమ్మ
మూల కోట కందనూరు సూచి
ఎంగిలి ముంతా ఎత్తాలేను
బంగారు కడియాలు పెట్టుదును
మనకంతా బంట్రోతు తనమే మేలు"
అంటాడు.

చిన్ననాటి నుండి గోలుకొండ పాలించాలనే తన కలను నిజం చేసుకునే ప్రయత్నంలో అరివీరభయంకరుడుగా మారిపోతాడు, అందుకనే ఆ రోజుల్లో పాపని పేరు చెప్పితే పసిపాపలు పాలు తాగరు " అంటూ చెప్పుకునే వారట, ఎక్కడ చూచిన పాపని శౌర్య ప్రతిభా విశేషాలు చెప్పుకునే వారు, అతని చుట్టూ కల్పనలు, వాస్తవాలు రెండు తరగతులు ' పాపన్న' శౌర్య గుణాన్ని మరింత ప్రాచుర్యంలోకి తెచ్చాయి.

**3. మత గేయాలు :** ఈ గేయాల్లో ప్రధానంగా భగవంతుడు, అతని దివ్యశక్తులు, ఆరాధనలు, క్షేత్రమహాత్యాలు, శైవ, వైష్ణవ మతాలకు చెందిన దేవతల వర్ణనలు ప్రధానంగా కన్పిస్తాయి. గ్రామీణ వ్యవస్థల్లో దైవారాధన ఒక ప్రధానాంశం అయితే హైందవ మతంలోని శైవ, వైష్ణవాలయాలు రెండు గ్రామాల్లో కన్పించటంతో పాటు, గ్రామ ప్రజలు రెండు దేవాలయాలను దర్శించటం ఐక్యతకు నిదర్శనం. వారి దృష్టిలో, మత దార్శనికులు చెప్పిన ' దేవుడు ఒక్కటే, రూపాలు వేరు ' అన్న భావనపట్ల గౌరవభావం ఉండటానికి కారణం - ఏ గుడికి వెళ్ళిన మన దేవుడు మన గుడి అనే భావన. అంతేకాదు గ్రామీణుల్లో ఎక్కువశాతం గ్రామదేవతల ఆరాధకులుగా ఉంటుంటారు. ఈ గ్రామ దేవతలు, ' శైవవైష్ణవ ' మతాలకు చెందిన వారివా కాదా ! అన్న ఆలోచన గ్రామీణుల్లో కనిపించదు, వారి ఆరాధనీయ దేవతలకు, తమ కష్టాల్ని, కన్నీళ్ళను తొలిగించే శక్తి ఉంది అన్న భావనే గ్రామదేవతల ఆరాధనలోని విశేషం - ప్రస్తుతం మతగేయాల్లో శివకేశవుల ప్రసక్తి గల్గిన ఒకటి రెండు గేయాల్ని మాత్రం ఉదహరిస్తాను.

ఈ గేయంలో, ఒకవైపు శివుని ప్రసక్తి, మరోవైపు విష్ణుమూర్తి ప్రసక్తి కన్పిస్తుంది. వారి వారి స్వరూప స్వభావాల గురించి వ్యంగ్యంగా వారి ధర్మపత్నులు వాదులాడుకోవటం ఇతివృత్తం.

శివుని అర్ధాంగి పార్వతి, విష్ణుమూర్తి ధర్మపత్ని లక్ష్మి ముచ్చటపడి మరీ తమ నాథుల గురించి వాదించుకునే ఘట్టం స్త్రీ లోకంలో ప్రాచుర్యంలో గల పాట, స్త్రీల అసూయ, అనురాగం సంగమించిన కమనీయ కల్పనా చమత్కృతి-

లక్ష్మి : " గౌరిదేవినీ శంభునిగళమున నలుపేమిటే ఓ యమ్మా -

నలుపేమిటే ఓ యమ్మా -

గౌరీ : నారీమణి నీ విష్ణు దేవుండు నల్పుగాడటే కొమ్మా

లక్ష్మి : బిరుదులేే కాంతుడు జగములో భిక్షమెత్తుటేమమ్మా
గౌరీ : బలములేకను బలి చక్రవర్తిని అడగలేదటె కొమ్మా
లక్ష్మి : శంకలేకను శంకరుకరమున జింకవుండుటేవొమ్మా
గౌరీ : లేని వనవాసము కేగుట జింక కొరకు సుమికొమ్మా

ఈ విధంగా, ఇరువురి భర్తల వైభవాన్ని అలంకరణల్ని, పరస్పరం, పార్వతీ, లక్ష్మీ సంవాద రూపంలో విన్పించారు. ఈ విధంగా ఒకే గేయంలో, శివవైష్ణవ దేవతల గాథలే ఉండనవసరంలేదు, ఇరుమతాల్లో ఏదో ఒక మతానికి చెందిన దైవ సంకీర్తన, దేవతల ప్రాముఖ్యంతో ఉండే మతగేయాలు కోకొల్లలు. స్థలాభావం వల్ల పూర్తిగా ఉదహరించటం కుదరదు. నిజానికి జానపద గేయాల్లో ఎక్కువ భాగం మత ప్రసక్తి గల్గిన గేయాలే -

**4. పారమార్థిక గేయాలు :** ఇహపరాల చింతనే మానవ జీవన సౌభాగ్యమనే భావన జానపదులది, అనుశృతమైన కర్మ సిద్ధాంత ప్రభావం నిరక్షరాస్యులైన గ్రామీణుల్లో సైతం కనిపిస్తుంది. పౌరాణిక కథస్మరణవల్లనో, పెద్దల, గురువుల పారమార్థిక బోధనల వల్లనో గ్రామీణ జీవనంలో చరమసంధ్యలో జీవితం గడిపే వారంతా ఇంచుమించు, భగవత్ చింతలో గడపటం అనివార్యం, ఈ చింతన దైవచింతనే కాబట్టి, చాలా గేయాలు, భగవంతునికి భక్తునికి మధ్యగల సంబంధాలు వివరించే కీర్తనలు, కావటం విశేషం. ఈ కీర్తనలు దైవ సంకీర్తనలే, ఇందులో భక్తి, జ్ఞాన, కర్మ, యోగ సంబంధమైన ముక్తిదాయకమైన గేయాలు ఎన్నో భగవంతుని సదా స్మరించే నుతించే, రామదాసు, అన్నమయ్య, త్యాగరాజు వంటి భక్తా గ్రేసరులు రచించిన కీర్తనలు ఎన్నో గ్రామీణులకు కంఠతావచ్చు, వారు కీర్తనలు ఆలపించే వేళ, తామే దివ్యభక్తులుగా ఊహించుకుని, ఏకాగ్రతతో, ఆలపించే వారెందరో తమ బాధలు, కన్నీళ్లు దూరంచేసి ఆయా దేవతామూర్తులు తమను ఆదుకున్నట్లుగా భావనే. ఈ స్మరణలకు కారణం, ఈ పారమార్థిక గేయాల్లో మొదటి స్థానం అలంకరించేది, తెలుగునాట విశేష ప్రాచుర్యం పొందిన మనమధ్య మెసలిన మహాభక్తుగు, ' కంచెర్ల గోపన్న ' నామధేయుడైన భక్తరామదాసు, అపారమైన ప్రజాధనం వెచ్చించి భద్రాచలంలో దేవాలయ నిర్మాణం, చేయటమేగాక ఎన్నోరకాల ఆభరణాల్ని శ్రీరామచంద్రునికి చేయించి, తనను ఆదుకొమ్మని, వేడుకొని ఫలితాన్ని తనకనుకూలంగా మార్చుకున్న పుణ్య మూర్తిగా చెపుతారు. నాటి ముస్లింపాలకుడు ' తానీషా ' విధించిన శిక్షలు



...గ్రంథాలయ
A C. No 88028

భరిస్తూనే అనన్యసామాన్యమైన, భక్తిపూరిత, భావ గర్భిత, భావావేశ సంకీర్తనలు సృష్టించటం ఆయనకే చెల్లింది. ఈ అపూర్వ సంపద తెలుగునాట, నాడు ప్రతి ఇంట నిండి పోయిందన్న వాస్తవం చాలా మందికి తెలుసు. ఆ మహనీయుని కీర్తనలలో ఒక దానిని పరిశీలించండి- ఒకవైపుభక్తి, మరోవైపు కోపం, మరోవైపు పరితాపం ముప్పేటలో అల్లుకొని మధురశాంత భక్తికి పరాకాష్టగా నిలిచిపోయాయి. ఈ కీర్తనలు -

" ఇక్ష్వాకుల తిలక ఇకనైనా పలుకవేరామచంద్రా - నన్ను
రక్షింపకున్నాను రక్షకులెవరయ్యా రామచంద్రా
చుట్టు ప్రాకారమునకు పట్టె పదివేల వరహాలు రామచంద్రా
సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకాము "

ఆ పతకమునకు పట్టె పది వేల వరహాలు " అంటూ - తాను, తన కోసం కాక, దైవం కోసమే ప్రజాధనం వెచ్చించానని చెరలో ఉన్న తనను కాపాడవలసిన బాధ్యత ముమ్మాటికి రామచంద్రునిదే అని మనసారనమ్మి ఎన్నోబాధలు చెరసాలలో అనుభవించి, చివరికి రామచంద్రుని కరుణాకటాక్ష ప్రసాదాన్ని అనుభవించిన గొప్ప భక్తుడిగా రామదాసు తెలుగువారికి ఆరాధనీయుడుగా నిలిచిపోయాడు. సంగీత పరంగా కూడా రామదాసు కీర్తనలు, భక్త భజన బృందాలకు, వరప్రసాదులుగా తెలుగునాట నలుచెరుగుల పారమార్థిక ప్రచార సాధనాలుగా నిలచిపోయాయి.

**5. స్త్రీల పాటలు :** స్త్రీలు పాడుకునే పాటలు, లేదా స్త్రీల కష్టనష్టాల గురించి వివరించే పాటలుగా విభజించుకోవచ్చు - స్త్రీలు సాధారణంగా ధార్మికచింతనకై సౌభాగ్య సంపదలకై, తమ ఇంట ఆచరించే వ్రతాలు, నోములు, ప్రత్యేకమైన పర్వదినాల్లో పాడుకునే పాటలు బతుకమ్మ పండుగ వంటి రోజుల్లో పాడేపాటలు కూడా లేకపోలేదు - అయితే ముఖ్యంగా ఈ స్త్రీల పాటల్లో శ్రామిక జనజీవన సౌభాగ్యంను వివరించే పాటలెక్కువ ; ఈ అధ్యాయంలో, కేవలం స్త్రీలు తమ తమ కుటుంబ కార్యక్రమాల్లో, దైనందిన సంబరాల్లో పాడుకునే పాటల్ని మాత్రమే వివరిస్తాను, నిజానికి పౌరాణిక పాటల్లో ఎక్కువభాగం స్త్రీల పాటలే - సీతారాముల ఆదర్శ జీవనాన్ని వారి మాధుర్య దాంపత్యాన్ని అడుగడుగునా పాటల రూపంలో చిత్రించారు, వారికి రామయ్య తమ ఇంటి పెద్ద, సీతమ్మ, తను ఇంటి ఆడపడుచు, వారంతా ఆత్మీయులు ఈ భావనలో ఎన్నో గేయాలకు రూపకల్పన చేసారు. తమ

జీవితంలో తాము ఆచరించే ప్రతి చర్య సీతారాముల వేడుకలుగా చిత్రీకరించి తృప్తి చెందారు. సీతాదేవి వేవిళ్ళు, సీతాదేవి వామనగుంటలు, సీతాదేవి సమర్త ఈ విధంగా సీతారాముల చుట్టు పరిభ్రమించే గేయాలు కొన్ని వేలు ఉన్నాయి ; అదేవిధంగా ఆదర్శమూర్తుల గురించి వారి నడవడిని గురించి, ఎన్నో గేయాలు - స్త్రీలోకంలో ప్రచారంలో ఉన్నవే. ఇవిగాక, లాలిపాటలు, జోలపాటలు, మేలుకొలుపు పాటలు, సుతిమెత్తని మాధుర్య భావనను నెలవుల్లై, స్త్రీల సర్వసంపద ఈ గానసంపద అనేట్టుగా ప్రాచుర్యం ఉన్నాయి - మాతృవాత్సల్యాన్ని మించిన వాత్సల్యం ఈ ప్రపంచంలో ఖరీదు కట్టలేని మధుర భావన, దీన్ని రంగరించిన పాటలు " లాలి జోల పాటలు " ఇవే అచ్చమైన స్త్రీల పాటలు.

ఉదా :- అమ్మణ్ణి కన్నులు తమ్మి పువ్వులు - తమ్మి పువ్వుల్లోన కమ్మతేనెల్లు
చిన్నారి కళ్ళల్లో కన్నీటి జల్లు - కన్నీరు చూపకే కరుగునెడదల్లు
చక్కని నా తల్లి గుక్క పెట్టింది - చెక్కుటద్దాలలో చెదిరెనె సంజ
చల్లని గాలి మాచంటి పాపాయి - వొళ్లార్చి శ్రమ దీర్చవోయి రవ్వంత
కిలకిలా నవ్వితే కలువల్లు పూసే - కలువపువ్వులేమొ కలికి చూపుల్లు
వియ్యమందే నాట వెయ్యారు లిచ్చి........................

ఈ విధంగా సాగే లాలిపాటలు - స్త్రీమనో భావాలకు రూపకల్పనలు - తమ బిడ్డల నిద్రబుచ్చి, వారిసేదలో తమ ఆనందాన్ని చవి చూస్తారు. అందుకే, ఆ లాలిపాటల్లో అంత తీపిదనముంది.

**మేలుకొలుపు పాటలు :** ముఖ్యంగా దైవపరంగా కనిపించినా తమ సంతు సౌభాగ్యం కోసమే ఆరాటం అంతా, మేలుకో కావేటి రంగా - అన్నా కస్తూరి రంగా " అన్నా తమ ముద్దుల పట్టి గురించే - " మేలుకోల్పు పాటల ద్వారా, తమవారికే, కర్తవ్యబోధకుడి స్ఫురింపచేస్తుంది. దైవబాధ్యత గుర్తు చేస్తుంది చూడండి. ఈ మేలుకొలుపుపాట.

" మేలుకో శ్రీరామ మేలుకో రఘురామ మేలుకో గుణధామమేలుకో నా స్వామి చాలునింక నిద్రపూనికతో నిన్ను బూజించువారిని బోషింపవలె వేగమేలుకో " ఘోరమైన సంసార బాధల గడ తేరలేదు జనులు దారిజూపి వీరి దరిచేర్చకున్న నెవరు దిక్కుస్వామి ॥మే॥ ఎంత వేడుకున్న సుంతయిన కృపజూప వింత పరాకేల చింతాల దీరనీ చెంత చేరినాము పంతము వదలిక మేలుకో స్వామి " అంటూ సాగిపోతుంది.

జోలపాటలు అంటే, ఆధ్యాత్మికత, తమ సంతుపై మమత కలబోసి దైవమే తమ బిడ్డగా భావించి కీర్తించే పాటలే, సుప్రసిద్ధమైన జోలపాట ఇది - ప్రతి తెలుగు ఇంట మారుమ్రోగిన పవిత్రమైన పాట ఇది -

" జో అచ్యుతానంద జో ! జో ! ముకుందా !

రార పరమానంద రామ గోవింద ॥ జో॥

తొలుత బ్రహ్మాండబు తొట్టె గావించి నాలుగు వేదముల గొలుసులమరించి బలువైన ఫణిరాజు పానుపమరించి చిత్తాము అనియేటి దూలములు వేసి " - ఈ జోలపాటలో అపారమైన భావనా పటిమకు తోడు, వేదాంత పరమైన స్ఫూర్తి కూడా కనిపిస్తుంది

**మంగళ హారతి పాటలు** : దైవారాధనే ప్రధానాంశం - కాబట్టి ఇవి పూర్తిగా దైవసంబంధ గేయాలుగానే భావించవచ్చు అయితే స్త్రీలే ఈ గేయ ప్రచారకులు కాబట్టి స్త్రీల పాటల్లో చేరిపోయాయి హరిదాసులు కూడా తమ కధాకాలక్షేపం చివర, ఈ పాటలకు ప్రాచుర్యం కల్పించినారు

" రామచంద్రాయ జనక రాజాయ మనోహరాయ, మామకాభీష్ట్యదాయ మహిత మంగళం

కౌసలేశాయ వందనాయ దాసపోషణాయ వాసవాది వినుత పద్వరద ॥ రా॥

ఈ విధంగా భక్తి, పారవశ్యంతో సాగే మంగళహారతులు, ఉత్సవాల్లో, ఆరాధనలో, ప్రముఖస్థానాన్ని ఆక్రమించాయి ' హారతి ' లేని పూజ పరి సమాప్తి కానట్లుగానే భావిస్తారు అందుకే ప్రతి శుభకార్యక్రమం చివర ' మంగళహారతి ' తప్పనిసరి సంప్రదాయ రూపంగా మారిపోయింది ఈ ప్రచార సాధనాలు మన సోదరీమణులే

**6. శ్రామికుల పాటలు** : శ్రమశక్తిని మరిపించే గొప్పశక్తి పాటల సొత్తు, బరువులు లాగేటప్పుడో, మోట గొట్టేటప్పుడో, ఏతం పట్టేటప్పుడో, రోడ్డు వేసేటప్పుడో శ్రామికులు పాటల్ని ఆశ్రయించటం కేవలం వినోదం కోసం మాత్రం కాదు తాము పడుతున్న శ్రమను మరచిపోయేటందుకు, వారు పాడుకునే పరమోత్త సాధనం పాట భక్తికైనా, ముక్తికైనా, జనశక్తికైనా, ' పాటే ' పదునైన ఆయుధం, ఇది మనోస్వాంతనానికి, ఎదుటి మనిషిలో మార్పు తేవటానికి చక్కని సాధనంగా

మారి కలకాలం గుండెల్లో నిలిచిపోయింది. అయితే ఈ శ్రామిక గేయాల్ని పరిశీలించేటప్పుడు జానపద విజ్ఞాన పరిశోధకుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. అచ్చమైన జానపద జనజీవనం ఎక్కువగా శ్రామిక గేయాల్లోనే కనిపిస్తుంది. దీనికి కారణం జానపదుల్లో నూటికి తొంబై మంది శ్రమజీవులు కావటమే, అందువల్ల ఈ పాటల్ని కేవలం పాటలుగా కాక జానపదుల జనజీవన సూచికలుగా గమనించాలి. ఎందుకంటే ఈ గేయాలు వారి అంతర్గత బాధలు, జీవన విన్యాసాలు, సరదాలూ, పండుగలు, పబ్బాలు, కష్టనిష్ఠూరాలు, అన్నీ కలబోసుకొని ఉంటాయి. ఏతంపాట, ఏతాన్ని గురించే చెప్పదు ఏతం కొట్టే రైతు జీవనాన్నీ చెప్తుంది. తమ కుటుంబంలోని మోయలేని బాధల్ని చెప్పవచ్చు లేదా మోసపోయిన అమ్మాయిల బతుకుల్ని చిత్రించవచ్చు, లేదా, ప్రియురాలి వింత చేష్టల వర్ణనలు ఉండవచ్చు. మొత్తం మీద శ్రామిక గీతం అంటే, జానపద అంతర్గత జీవన దృశ్యంగా భావించి శోధించాలి. పాటను బతుకుపాటగా గమనిస్తే, జానపదుని దైన్యం, హృదయాంతరాళాల్లో గూడుకట్టుకున్న బాధ అన్నీ కట్ట కట్టుకొని, పాట రూపంలో ప్రశ్నించవచ్చు- వాటిని నిశితంగా పరిశీలించి, ఒక్కో పాటల పల్లవి వెనకాల బతుకు వెతల్ని సమగ్రంగా చిత్రీకరించవచ్చు. అయితే వాటిలోకి తొంగి చూచే వేళ అనుమానం చూపులు వద్దు, అమాయకత్వం అసరాగా ఉండే బతుకులు వారిని, నిజాన్ని నిర్మొహమాటంగా చెప్తారు. మార్మానాల్ని ( మారుమనువులు ) వివరిస్తారు. మోటుసరసాల్ని దాచుకోరు, స్వేచ్ఛగా సాగే కవితా ధారవారిదని గుర్తుంచుకోవాలి.

" ఏటి కేతంబెట్టి ఎయిపుట్లు పండించి
ఎన్నడో మెతుకెరుగరన్నా -
నేను గంజిలో మెతుకెరుగ రన్నా -
కాలు చేతులు కడుక్కొని కట్టమీద కూచుంటే,
కాకి తన్ని పోయేరన్నా, కాకి పిల్ల తన్నీపోయెరన్నా - " ఈ సుప్రసిద్ధ జానపద గేయం శ్రామిక గేయాల్లో కెల్ల తలమానికమైంది - అసలు జానపద గేయాల్లో బతుకు ఎంతగా దాగి ఉందో తెలిపిందే ఈ గీతం, అంతేగాని, తొలిసారి జానపద గేయాల సేకరణలోనే తెలంగాణాలో లభించిన ఈ గేయం, నాటి రైతు దైన్య స్థితికి అక్షర రూపం.

తెలంగాణలో నీటివసతులు తక్కువ ; ఉన్న వసతి కూడా బావులు కుంటలవల్లె సాధ్యపడ్తుంది. ఎంతో లోతుగా ఉన్న నీళ్లను ఏతం పెట్టి, రాటం పెట్టి నాడు సేద్యం చేసేవారు. అందులో పండిన పంటనే జీవనం సాగటానికి, సర్కారు శిస్తులు కట్టడానికి సరిపోయేది, ఈ దైన్యస్థితినే పాటలో జానపదుడు నిక్షిప్తం చేసాడు. నాటి నైజాం పాలనలో కాఠిన్యం కూడా ఇందులో వర్ణించటం కనిపిస్తుంది. పొలంపనుల్లో ధాన్యంరాశి పోసేవరకు, నాటు వేయటం, కలుపుతీయటం, కోతకోయటం వంటి శ్రమ శక్తితో కూడిన పాటలెన్నో కనిపిస్తాయి. ' ధాన్యరాశి ' ని దైవ బలంగా భావిస్తారు. జానపదులు అందుకే మురిసిపోయి.....

" ఓలియె ఓలియో ఒలియో
రావేలు కలవాడా రారపొలిగాడా
రావేలు మీదయ్య రాశి మీదయ్య
పోయెరా పొలిగాడు పొన్నట్టు దాటి
దాగేరా పొలిగాడు దండ కట్టుల్ల
కొడెలు తొక్కంగ కొల్లవై రాశి
ఎద్దులు తొక్కంగ ఎదిగెరా రాశి
దున్నలు తొక్కంగ దిన్నెలైరాశి
పెయ్యలు తొక్కంగ పెరిగేరా రాశి " అంటూ ధాన్యం పనసల్ని వరుసలో పేర్చి ఎద్దులతో, పోతులతో తొక్కిస్తారు. దానినుండి రాలిన గింజల్ని రాశిగాపోసి, దానిచుట్టు ' పొత్తి ' చుట్టడం ఆచారం -

పడవల్ని లాగేటప్పుడూ, రోడ్డు వేసేటప్పుడూ, శ్రమను మరవటానికి ఎన్నో పాటల్ని సృష్టించుకున్నారు జానపదులు. స్త్రీలు శ్రమను మరచే వేళ పాడే పాటలు స్త్రీల పాటల్లో చేరిపోయినప్పటికీ, శ్రమకు స్త్రీ పురుష భేదం లేదు కాబట్టి, 'దంపుళ్ళ' పాటొకటి ఉదహరిస్తాను. ఈపాటలో స్త్రీల ఔన్నత్యం స్పష్టమవుతుంది. ఆమె కోరిక సదా ఏమంటుందో తెలుస్తుంది. నేడు దంపుళ్ళు లేక పోవచ్చు కాని సాటి నారిలోకం స్పందనాభావనలు మనకు అందించిన తీరు ఆనందదాయకం.

| | |
|---|---|
| "గుమ్మడి కాయంటి | నాతోటి వారెల్ల |
| గురువొచ్చినాడు సువ్వి సువ్వన్నా, చంచుమల్లన్నా | నానులడిగిరి |
| సీకాయ పంచెలతో | నేనొక్కటడిగితి |
| శిశు వెళ్లినాడు సువ్వి | ఐదవ తనము |
| కాళ్ళు కడగనైతి | చాలు ఐదవ తనము |
| కాళ్ళు మ్రొక్కనైతి | సంతాన బలము |
| వంగి దండం పెట్టి | కోటి ఐదోతనము |
| వరమడగనైతి | కొమరులా బలము" |

ఇలా సాగుతుంది. పాట సందర్భం ఏదైనా కావచ్చు. జానపద పరిశోధకుడి దృష్టకి, అది అవసరం లేదు. పాటలోని భావం జానపదుని మనోభావకా సారంలోని, సారంశం అదే మనం అందుకోవల్సింది.

**7. పిల్లల పాటలు :** జానపదుల పాటల్లో పిల్లల పాటలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. చాలా పాటలు, ఆటలతో సంబంధం కల్గి ఉంటాయి. ఈ పాటలన్నీ మధ్య తరగతి వర్గానికి చెందిన జానపదుల సృష్టిగానే తోస్తుంది. శ్రామిక కుటుంబాల్లోని పేదపిల్లలకు, ఆటలాడే తీరిక ఉండదు - వాళ్ళు సాధారణంగా తల్లిదండ్రులతో పాటే, చేన్లకు, కూలీపనులకు వెళ్లటమే కారణం - ఏది ఏమైనా పిల్లల పాటల్లో పిల్లల మనస్తత్వం ప్రధానాంశం - వారి మనోభావాలు, సృష్టించిన గేయాలు కొన్ని అయితే, మరికొన్ని వారి కోసం, పెద్ద వాళ్ళు కల్పించిన పాటలు కొన్ని. అందువల్ల పరిశోధకుడు నేర్పుగా పిల్లల పాటల్ని పరిశీలించాలి. నిజానికి పిల్లల సృష్టి అనదగిన పాటల్లోనే, వారి తత్త్వం క్షుణ్ణంగా అర్థం చేసుకోవచ్చు.

పెద్దలు పిల్లలను ఆడించే వేళ సృష్టించిన పాటలు కొన్ని ఉంటాయి.

ఉదా॥ " తారంగం తారంగం

తాండవ కృష్ణ తారంగం " అంటూ పిల్లలను చేతులు తిప్పే విన్యాస్యాన్ని అలవాటు చేయటం కోసం ఆటలాడించే సమయంలో పెద్దలు పాడే పాట ఇది -

అదే విధంగా జంతువుల్ని చూపుతూ -

" ఉడుతా ఉడుతా ఊత్

ఎక్కడికెడతావూత్ " అంటూ పాడటం కన్పిస్తుంది.

అదేవిధంగా -

" కాళ్ళగజ్జె కంకాళమ్మ
వేగుచుక్క వెన్నముద్దా " వంటివి ఉన్నాయి - కాస్త ఎదిగిన పిల్లలు పాడే పాటలు కూడా ప్రాచుర్యం పొందాయి

" చెమ్మ చెక్క చారెడేసి మొగ్గ
అట్లుపోయంగ, అరగించంగ
రత్నాల చెమ్మచెక్క రంగులేయంగా,
ముత్యాల చెమ్మ చెక్క ముగ్గులేయంగా - అంటూ, ఆడపిల్లలు చేతుల్తో తడ్తూ, ఆట ఆడ్తూ, పాడుకుంటారు, ఈ పాటల్లో " అయుర్వేద వైద్య చిట్కాలున్నట్లుగా, పరిశోధకులు గమనించటం విశేషం

ఏడ్చే పిల్లల్ని సముదాయించటానికి తల్లిపాడే పాటలు కూడా, పిల్లల పాటలే -

ఉదా : ఏడవకు ఏడవకు ఎఱ్ఱినాగన్నా
ఏడిస్తే నీకండ్లు నీలాలు కారు,
నీలాలు కారితే నే చూడలేను
పాలైన కారవే బంగారు తండ్రీ - అంటూ అప్యాయత రంగరించి పోతపోసిన ఈ పాట ప్రతి తల్లి నోట రావాల్సిందే ఈ పిల్లలపాట, గ్రామీణ సమాజంలో కనిపిస్తుంది.

" చిట్టి చిట్టి మిరియాలు
చెట్టు కింద పోసి
పుట్టమన్ను తెచ్చి
బొమ్మరిల్లు కట్టి,
నా నెత్తికి చమరు లేదు
అల్లవారింటికి చల్లకని పోతే
అల్లవారి కుక్క భౌ భౌ మనే -
నాకాళ్ల గజ్జెలు ఘల్ ఘల్ మనే " అంటూ, పెద్ద పిల్లలు చిన్న పిల్లల్ని ఆడిస్తూ పాట పాడటం కన్పిస్తుంది

అదేవిధంగా ఆటల పాట -

“ గుడు గుడు గుంజం
గుండెరాగం, పాముపడిగే పట్టే రాగం
చేతులెటు పోయాయి - పెంటకు పోయాయి ”

ఇలా సంవాద రూపంలో పాటలు సాగుతుంటాయి ఇవీన్నీ పిల్లల్లో సృజన తోపాటు వారిలో క్రీడాసక్తి పెంపొందించటానికి, పెద్దలు వేసిన పాటల బాటలు -

**8. శృంగార గేయాలు :** అన్ని రసాల్లో, అగ్రగామి ‘ శృంగారరసం ’ పాటలకు, రసవత్తర సౌభాగ్యం అందించే శక్తి శృంగారినికే ఉంది, హాస్యం, వ్యంగ్యం, అంతర్గత ప్రాణంగా, ప్రేమ, స్నేహం, దాంపత్యం, ఆలంబనగా శృంగార గీతాలు ఎన్నో వెలిసాయి స్త్రీ పురుష సాంగత్యం వరమావధిగా, వివాహవ్యవస్థ ప్రధానాంశంగా ఎన్నో పాటలు, పుట్టాయి- కొన్ని సరదాలు అందిస్తే, మరికొన్ని సందేశాలనందిస్తాయి అయితే ఇక్కడ విజ్ఞాన పరిశోధకుడు పరిశీలించాల్సిన విషయం, పాటల్లో అశ్లీలత, జుగుప్స కల్గించేవి కూడా ఉన్నాయి వాటిని అవసరమున్నంత మేరకు మాత్రమే ఉపయోగించుకోవాలి, నిజానికి, వాటి పరిహరణవల్ల వచ్చే నష్టం కూడా పెద్దగా లేదు - అసభ్య శృంగారమే, శృంగారం కాదుకదా ! మధుర భావనలు, సహజసౌందర్యం సొత్తుగా గల పాటలు వేల సంఖ్యలో ఉన్నవి. వాటిని ఉపయోగించి, జానపద విజ్ఞాన - పరిశోధన సమగ్రం కావించవచ్చు. వలచినవాడు ప్రక్కనుంటే స్వర్గమేకదా - అనుకుంటున్న ఈ సరశృంగార నాదం వినండి -

“ ఆకులమ్మే లచ్చిమీ
సిగురాకులమ్మే లచ్చిమీ
ఆకులమ్మిన రూకలన్నీ
ఏటి సేత్తివే లచ్చిమీ - ॥ ఆ॥

నేను చేసిన పాపమా
ఇదినాకు పట్టిన కరమమా,
సక్కగా నూ పక్కనుంటే
సొరగమే ఇక సావురాదే ॥ ఆ ॥

ఇలా తన మనోభావాన్ని యువకుడు ప్రేమగాథగా పాడాడు. మరో సరదా దంపతులు -

" ఉల్లి పూలపడవ గట్టి, మల్లెరేకుల తెరను దించీ
నాగులేటి వాగులోన మావ తేలి పోదామా
మొగిలిపూల తేరుగట్టి, మొగిలి రేకుల గొడుగు పట్టి
మొగులు మేసే కొండ మీద మామా ముద్దుగానే ఎళ్ళుదామా " -

ఇలా సాగిపోతుంది వారి ప్రణయగాథ -

**9. అద్భుత రస గేయాలు :** ప్రత్యేకంగా ఇవి అని ప్రచారంలో లేకపోయినా వస్తు విభజన రీత్యా అద్భుతరస పోషణ కల్గిన జానపదగేయాలన్నీ ఇందులో చేరిపోయాయి. అయితే అద్భుత ఘట్టాలు పుష్కలంగా గల, కథాకథన చమత్కృతి గల్గిన బాలనాగమ్మ కథ, మాయల మరాఠి కథ, దేశింగు రాజుకథల వంటివి ఎన్నో గేయరూపంలో, అద్భుతరస పోషణతో కనిపిస్తున్న ఈ గేయాల పరిశీలనలో, పరిశోధకుడు, భ్రమకు లోను కావల్సిన పనిలేదు. వాస్తవాలతో పని అంతకంటే లేదు, కథా కథన చమత్కృతి ముఖ్యం. నాటి ప్రధాన ప్రదర్శనా క్షేత్రాలు, ఇవే కాబట్టి, ఉత్కంఠ భరితమైన కల్పనలతో కథ సాగేది - నిజానికి, ఇవి లేకపోతే కథాసారాంశం చాలా పేలవంగా ఉంటుందని పరిశోధకుడు భావించాలి - కథ చిన్నదైనా ఇటువంటి అద్భుత రస ఘట్టాల వల్లే, కథకు పురా వైభవంతోపాటు, జనసామాన్యంలో చిరకాలం నిలిచిపోయేవి - " కథలు కథలుగా " చెప్పుకుంటారు, అనే మాట అద్భుతరస గేయాలకు అక్షరాల సరిపోతాయి, అతీతశక్తులు, అద్భుత సృష్టి, మంత్ర తంత్రాలు, సాహస కార్యాలు, ఇవి అద్భుత రస గేయాల్లో ప్రధానంగా కన్పించే కల్పనలు.

ఉదా ॥ బాలనాగమ్మ అద్భుత రస సన్నివేశాలకు ఆట పట్టు - బాలనాగమ్మను చెరపట్టిన మాయల ఫకీరు ప్రాణం ఎక్కడుంటుందని వర్ణించారో చూడండి :

వాడుతుంటరి, మాయలు మంత్రాలు నేర్చినవాడు అంత సులభంగా చనిపోతే గొప్ప ఏముంది, ఉత్కంఠ ఏముంటుంది, అందుకే, కథానాయకునికి శౌర్య ప్రదర్శనకు వీలుగా, కథా కల్పన తప్పనిసరి అందుకే ఏడు సముద్రాలకావల జీవిగడ్డ, ఆ జీవిగడ్డలో రాతిగోడ, రాతిగోడలో రాతి కోట, నడుమ ఉక్కు కోట ఆ ఉక్కు కోటలో ఏన్నూరు వెలగచెట్లు, మున్నూరు ములగ చెట్లు, నన్నూరు

తాటిచెట్లు, ఏన్నూరు వేప చెట్లు, వీని నడుమ ముంత మామిడి చెట్టు ఆ ముంత మామిడి తొర్రలో ఏడు దొంతరలు, అడుగు దొంతరలో బంగారు పంజరము ఆ బంగారు పంజరంలోని, పంచవన్నెల చిలక కంఠమున మాయల ఫకీరు తన ప్రాణం దాచి పెట్టెను " -

ఇదే కథలో, బాలవద్ధి రాజు ప్రాణములు విడవటం - మళ్ళీ సంజీవి పుల్లతో తిరిగి బతకటం, అద్భుత కల్పన ! బాలవద్ధిరాజు మరణం - ఒక కథానాయకుడైన కష్టాలపాలు అవుతాడు కాని ప్రాణాలుకోల్పోడు నేటి ఆధునిక సినిమా కథల్లోను ఈ విచిత్ర కల్పన గమనించవచ్చు - పరిశోధకుడు దీన్ని వీరారాధన అంశలు క్షుణ్ణంగా గమనించాలి -

అదేవిధంగా, చారిత్రక గేయమైన సర్వాయి పాపని కథలోను చిత్రవిచిత్రాల వర్ణనలకు లోటు లేదు.

" ఆవుల గాచే పాపడు చెట్టు నీడన నిద్రబోవుచుండగా పంద్రెండు శిరసుల నాగు బాము పడగ పట్టెను "

" సర్దారి పాపడు నాగసర్పం వంటి లాంటి మానునుచూచి తన పేరు చెప్పి లొట్టిపెట్టగా చెట్టు వంగి కల్లు పొంగి లొట్టినిండెను "

" పాపని దౌర్జన్యమునకు భయపడి దేవళము విడిచిపోవుచున్న యెల్లమ్మ దేవతను పాపడు జడపట్టుకొని యీడ్చుకు వచ్చెను " -

ఈ విధంగా, మూల కథతో సంబంధం లేని అద్భుత కల్పనలెన్నో జానపదులు చేసారు, వారి ఉద్దేశం ఒక్కటే, సామాన్య జనంలో వీరులంతా అసహాయశూరులని, అపారమైన బలసంపన్నులని వారిని, గౌరవించాలనే చేసిన కల్పనలే అద్భుత సృష్టిగా మారి అద్భుత రస గేయాలుగా రూపొందాయి -

**10. కరుణ రస గేయాలు :** జానపదుల జాలిగుండెల కవితలన్నీ పేరంటాళ్ళు కథల రూపంలో వెలిసాయా అనిపిస్తుంది - ప్రతిచోట, స్త్రీల కథలన్నీ విషాద భరిత రూపాలే, ఆంధ్రప్రాంతంలో లక్ష్మమ్మ కథ అయినా, తెలంగాణాలో బతుకమ్మ కథ అయినా స్త్రీలోకం నాడు పొందిన క్లిష్ట జీవితాల ప్రతీకలే - బంధంలోని ఆనందంకన్నా, కాపురంలోని కలతలే వీళ్ళ ప్రాణాలకు ముప్పులుగా

పరిగణించాయి - అయితే సామాన్య జనం మాత్రం - వీళ్ళ త్యాగనిరతి మరచి పోలేదు, కథలుగా, గేయాలుగా మలచుకున్నారు ప్రతినోట స్మరించుకోవటం జరుగుతుంది, తెలంగాణాలో ఈ విధంగా రూపొందిందే బతుకమ్మ పండుగ -

లక్ష్మమ్మ నీలాప నిందలపాలై, భర్తచేతిలోనే హతమవుతుంది. దానికి సాటి స్త్రీలే కారకులు కావటం నాటి కుటుంబ కలహాలకు ప్రతీక. అత్త వెంకమ్మ, ఆడుబిడ్డ పిచ్చమ్మవల్ల, అమాయకురాలైన లక్ష్మమ్మ బలి అయిపోయింది. ఈమె దీనగాథ, కరుణ రసగేయ రూపంగా వెలిసింది.

చిన్నమ్మ కథ గేయం చిన్నమ్మను ఆమె అత్త పెట్టే హింస కరుణారసానికి పరాకాష్ఠ. చిన్నమ్మ విష్ణు భక్తురాలు కాగా, ఆమె అత్తగారి ఆరాధ్యదైవం శివుడు. విష్ణు భక్తి మానమని అత్త ఎంత బాధించినను చిన్నమ్మ వినదు. ఆమెను అడుగడుగున విష్ణువు బాధల నుండి రక్షించటం జరుగుతుంది. ఇక్కడ గమనించవలసిన విషయం, భక్తిలో నిబద్ధత, హింసాచర్యల రోసి తాను నమ్మిన దైవం నుండి లాభం పొందటమే అయినా ప్రేక్షకులకు చిన్నమ్మ పడే బాధలు ఎంతో విచారం కల్గిస్తాయి. అత్త ఆడుబిడ్డలు, లక్ష్మమ్మతో దాసివానికి సంబంధం అంటకట్టి భర్త చేత ఆమెను చంపించటం. ఆమె చివరకు దేవతామూర్తిగా నిలిచిపోవటం. ఇక్కడ పరిశోధకుడు గమనించవలసిన విషయమేమిటంటే - హత్య చేయబడ్డ వనితలు గాని ఆత్మహత్యలు చేసుకున్న వనితలుగాని, దేవతామూర్తులుగా వెలసి ప్రజల పూజలందుకోవటం, ప్రజలకు వారు గొప్ప త్యాగశీలురు, ప్రాణత్యాగం చేయటం. ఒక పవిత్రకార్యంగా భావించటమే కారణం - సతీసహగమనం కూడా మొదట్లో నాటి సమాజం వీరవనితల చర్యలుగా సమర్థించింది, అది పుణ్యకార్యంగా కూడా భావించుట ఆ ఆచారం చాలాకాలం ప్రజలలో నిలచిపోవటానికి కారణం - జీవకారుణ్యరీత్యానే " మహమ్మదీయులు అత్యాచారములన్న ప్రదేశాల్లోనే సహగమన ఆచారమునకు అతి వ్యాప్తి కలిగెను. ఈ వ్యాప్తి ప్రధానముగా కాశ్మీరము, రాజపుత్ర స్థానము, పంజాబు దేశములలో ప్రబలమయ్యెను. తర్వాత బెంగాలునందు అధికమయ్యెను " అని సురవరం ప్రతాపరెడ్డిగారు తమ " ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి " అనే గ్రంధములో పేర్కొన్నారు. చారిత్రక కారణాలు ఏమైనప్పటికీ రాజకీయ పరిస్థితులు సామాజిక స్థితిగతులు ఎట్లున్నప్పటికి, జనసామాన్య దృష్టి మాత్రం ఆరాధనాభావంతోనే

కరుణే ధ్యేయంగా సాగేదని చెప్పటానికి, ఈ కరుణరస గేయాలు ఉదాహరణగా గమనించాలి - కామమ్మ, మండపేట పావమ్మ కథలు ఇటువంటి కరుణ రస గేయాలే -

**11. హాస్యపు పాటలు :** హస్య రసంలేని సాహిత్యం అంతగా శోభించదు. హాస్యమే ప్రధానరసంగా వర్ణించి సాహితీ ప్రక్రియలన్నీ ప్రజాదరణ పొందాయి. ప్రజలకు వినోదం కల్గించే కథలు, గాధలు, పాటలు మన జానపద సాహిత్యంలో కోకొల్లలు, తెనాలి రామకృష్ణ కథలన్నీ హాస్యగుళికలే కదా - అదే విధంగా పాటల్లో, హాస్యానికి పెద్దపీట వేసిన జానపద మనస్తత్వ రూపాలెన్నో పాటల్లో గమనించవచ్చు వ్యంగ్యం - హాస్యం - రెండూ గీతాల్లో కూడా కన్పిస్తాయి. వినోదం - సరదా, వాటి ప్రయోజనం అయినప్పటికీ, వీటి వెనకాల జానపద విజ్ఞాన పరిశోధకుడు, ప్రత్యేకించి మానవ మనస్తత్వం కూడా పసిగట్టవచ్చు - ఈ కింది పాటలో జానపద స్త్రీమూర్తి గుణం చూడండి -

“ అంతే నాకు చాలు తమ్మలపాకు తొడిమే పదివేలు
అందరివోలె అడిగే దాన్ని కాను, కొందరివోలె కొసరే దాన్ని కాదు
ముక్కుకు ముక్కెరలేక ముక్కు చిన్న బోయినాది
నీ ముగ్గురు బిడ్డలనమ్మి ముక్కుకు ముక్కెర తేరా
చేతులకు చెండీలు లేక చేతులు చిన్న బోయినాయి,
నీ తోడి చెల్లెండ్ల నమ్మి చేతులకు చెండీలు తేరా
కాళ్లకు కడియాలు లేక కాళ్ళు చిన్నబోయినాయి
నీ కన్నతల్లి నమ్ముకొని కాళ్ళకు కడియాలు తేరా ” ఇలా సాగుతుంది పాట, చివరికి ఆ ఓపిక గలపెనిమిటి ఏం చేసాడో మనకు అనవసరం కాని స్త్రీ సహజమైన వాంఛలు, దేన్నీ లెక్కచేయవని చెప్పటమే ఈ పాటలో కనిపిస్తుంది. పైకి హాస్యంగా ఉన్నప్పటికి, ఈ గేయంలో, అంతరార్థం చూస్తే భయం కల్పించక మానదు - మామూలు పాఠకలోకానికి ఇది కేవలం వినోద గీతం మాత్రమే, కాని జానపద విజ్ఞాన పరిశోధకుడికి మాత్రం మానవ మనస్తత్వ పరిశీలనాంశంగా ఉపకరిస్తుందని గమనించాలి.

మరొక ఇంతికి బోధిస్తున్న నీతిరీతి చూడండి -

" పతివ్రతా ధర్మంబు
భక్తితో సలిపి
అతని చెంపమీద
అంటిస్తువుండు "
" అత్త వచ్చి నిన్ను
పనిచేయి మంటే
తలకి పట్టేసుకో
పడకోయ వమ్మా,

- ఇలా సాగుతుంది. ఈ పాటలో హాస్యంకంటే, పని తప్పించుకునే ఎత్తుగడలు ఎలా ఉంటాయో వివరిస్తుంది - అయితే ఏదో వంకతో పనిఎగ్గొట్టే వాళ్ళుండబట్టే కదా, ఇటువంటి పాటలు పుట్టింది, ఈ విషయం జానపద విజ్ఞాన పరిశీలకుడు గమనించాలి. హాస్యం కోసం పాట ఉంది. అయితే హాస్యమే పాటలాగా ఉండకపోవటం, మానవ మనోధర్మాలు ప్రతిబింబించడం జానపదుల పాటల్లోని విశేషం. అమాయకంగా, తమ మనోభావాల్ని స్పష్టంచేసే స్వభావం కూడా ఇది. అదే విధంగా చిన్న పిల్లలు తమాషాకు పాడే పిల్లల పాటల్లో హాస్యం తొంగిచూస్తూ ఉంటుంది.

" అయ్యోరు, అయ్యోరు అంతంత
అయ్యోరు పెండ్లా ముంతంత "
" బోడకాకరకాయ బొట్టు
అయ్యోరు ఎంకయ్య జుట్టు
జుట్టుకు మద్దెల కట్టు

కట్టుకుంటే ఓట్టు పెట్టు " ఇటువంటివి పిల్లలు, సరదా కొరకు సృష్టించినవి, వాటివల్ల సరదాయే తప్ప, మరోరకమైన విశేషం ఏది స్ఫురించదు - అయితే పిల్లలు అయ్యవార్లను ఎలా గమనిస్తుంటారో, తెలుస్తుంది.

" బావా బావా పన్నీరు
బావను పట్టుక తన్నేరు,
వీధి వీధి తిప్పేరు
వీసెడు గంధం పూసేరు
మూలకు మంచం వేసేరు " అంటూ బావమరదళ్ళు సరస సంభాషణ

రూపంలో కవ్వించే పాటలు కూడా హాస్యానికి మచ్చు తునకలే - ఇందులో వరుసైన సరసం, హాస్యం రెండు సహజ రూపాలుగా ఒదిగిపోతాయి - ఈ హాస్యం సుతిమెత్తని కుటుంబ హాస్యంగా ఉండి వినే వారికి, అనేవారికి ఎంతో హాయిగా ఉంటుంది. కాని, కొన్ని జానపద పాటల్లో బూతు చొప్పించిన పాటలు కూడా కొందరు హాస్య పాటలుగా గుర్తించటం శోచనీయం. బూతు హాస్యం కానే కాదు, కాబట్టి సరస శృంగారంలో, హాస్యాన్ని బేరిజు వేసి మాత్రమే, హాస్య పాటలుగా స్వీకరించటం జానపద విజ్ఞాన పరిశోధకులపని, అయితే జానపదుల్లో మోటు శృంగారం ఉండదా ! ఉన్నప్పటికి, వాటిని ఇక్కడ ఉదహరించటం లేదు - కొందరు జానపద సాహిత్య పరిశోధకులు పాటలు ఏవైనా పాటలు శృంగారమైతేనేం, బూతు ఉంటేనేం - హాస్యముంది కదా అని తమ వ్యాస సంపుటిలో ఉదహరించటం జరిగింది కాబట్టి జానపద విజ్ఞాన పరిశోధకుడికి కావాల్సింది, వైజ్ఞానిక దృక్పథం - జానపద మనోభావ స్వీకరణాలక్ష్యం - వాటి అనుగుణంగా సరికొత్త రీతిలో జానపద విజ్ఞాన సంపద వింగడించుకోవటం అవసరం. ఈ విధమైన ప్రయత్నాలు, ముందు ముందు మరింత స్వచ్ఛంగా జరుగుతాయని భావించవచ్చు - పాటలు అన్నీ పాటలైనా వాటిని స్వీకరించి సంకలనం చేయటం మాత్రమే కుదరదని, ఈ పాటలన్నీ పరిశీలించాక తెలుస్తుంది.

# (ఐ) కథా గేయాలు

జానపదం, గేయాలకు వుండే లక్షణాలు కలిగివుండి కథతో కూడుకొని వుండటం వీటి ప్రత్యేకత. ఆంగ్లంలో వీనిని Narrative Poem (వర్ణణాత్మకపద్యం) అని కూడా అంటారు. Ballad పదం Battare అను లాటిన్ శబ్దం నుండి పుట్టింది. మొదట దీనికి నృత్తగీతం (Dancing Song) అనే అర్థం వాడుకలో వుండేది. నేడు కథాగేయం అనే పేరు వ్యాప్తిలో వుంది. ఈ కథాగేయాలు చాలావరకు ప్రదర్శనాత్మక గేయాలు. వీటిని వీరగాధలు అని కూడా అంటారు. వీటిలో చాలావరకు వీరులగాథలు వుండడం కారణం కావచ్చు. కాని మిగతా కథాగేయాలు (ప్రసిద్ధ గాథలు) కూడా లేకపోలేదు. అందువల్ల కథాగేయాలనే పేరు సమంజసంగా ఉన్నది. " వీర రస ప్రధానమగు కథను చెప్పెడు సంచారగాయక భిక్షకుల (Minstrels) చే పాడబడు సరళ కథాగేయమే వీరగాథ"[1] అని డా॥ తంగిరాల సుబ్బారావు గారు " వాగ్రూపమైన సాంప్రదాయము కల్గివుండి తరతరాలుగా అనేక పాఠాంతరాలతో ప్రచారం పొంది సామూహికమైన వికాసం కల్గిన కథాగేయాన్ని జానపద కథాగేయం " అని డా॥ ఆర్.వి.ఎస్. గారు[2] పాశ్చాత్య జానపద పరిశోధకులు Maria Leach " The ballad is a form of Narrative Folk Song. This type of Folk Song varies considerably with time and place, but certain characteristics remain fairly content and seemingly fundamentals " వర్ణణాత్మక, జానపద గీతమే గేయగాధ. ఈ విధమైన జానపద గేయగాధ ఒక కాలానికి, స్థలానికి చెంది ఉంటుంది. కాని కొన్ని ఖచ్చితమైన విలువలు మాత్రము స్వచ్ఛంగా, మార్పులేకుండా నిలిచివుంటాయి. మరియు ప్రాథమికంగా కనిపిస్తాయి. "[3] " చిన్న చిన్న చరణాలు కల్గిన వర్ణణాత్మకమైన ప్రసిద్ధ వీరగాధ " A Simple Spirited Poem in short stanzas narrating some popular story "[4] అని నిఘంటువులో పేర్కొన్నారు.

---

1. జానపద సాహిత్యం - వీరగాధలు - డా॥ టి.వి. సుబ్బారావు
2. జానపద సాహిత్య స్వరూపం - డా॥ ఆర్.వి.ఎస్. సుందరం గారు
3. *Directory of Folklore Mythology and Legend - M. Leach*
4. *Oxford English Dictionary*

గేయ గాథలకు గల లక్షణాలు ఇవి. 1. గేయరూపం, సరళభాష, పాడుట కనువుగా వుండుట, 2. నియమిత పరిమాణం సహజత్వం కల్గి వుండటము 3. జానపద గాయకులు ఆశువుగా చెప్పడం 4. కవి ప్రాధాన్యత అంతగా కనిపించకపోవడం. 5. మౌళిక ప్రచారంలో జీవించడం. 6. గేయాల వలననే భావం, భాష, వర్ణన పునరావృతి కల్గి వుండడము. 7. వీరత్వము నుండి సహజంగా పుడతాయి, పూజల్లో వ్యాపిస్తాయి. 8. వ్యంగ్యం, నీతిబోధ వీటి లక్షణం. 9. అద్భుత విన్యాసాలు, అలౌకిక శక్తులు వీటి చుట్టు ప్రభవిస్తాయి. 10. ధర్మానికి జయం, అన్యాయానికి అపజయం సాటి చెప్తాయి.

ఇక సంభాషణలు కల్గివుండడము, దేశీయమైన భాషా సంస్కృతులు ప్రతి బింబించడం వీటి ఉపలక్షణాలు డా॥ రామరాజు గారు జానపద గేయాలను ( Folk Songs ), కథాగేయాలను ( Ballads ) ఈ విధంగా వివరించారు. " వస్తువును బట్టి గేయాలను, పౌరాణికాలు, చారిత్రకాలు, అస్పష్ట చారిత్రకాలు, మత సంబంధగాధలు, సాంఘీకాలు మొదలైన భేదాలుగా విభజింపవచ్చును. రసానుగుణంగా విభజిస్తే శృంగారగేయాలు, అద్భుతగేయాలు, కరుణరసగేయాలు మొదలైనవి లభిస్తాయి. ఆలంబనాన్ని బట్టి స్త్రీల పాటలు, పురుషుల పాటలు స్త్రీ పురుషుల " ఉభయపాటలు ". [1]

వీరి వర్గీకరణలో జానపద గేయాలకు గల పారమార్థిక, అద్భుత వంటి భేదాల్ని వీరగాథలు వర్గీకరించడంలో కూడా పాటించవచ్చును. విషయాన్ని దృష్టిలో వుంచుకొని జానపద గేయాల్ని 1. అద్భుత కథ 2. పౌరాణిక కథ 3. చారిత్రక కథ 4. సహజ సంఘటన ఆధారంగా పుట్టిన కథ 5. శృంగార కథ అను విధంగా వర్గీకరించవచ్చు. " పాడే సమయాన్ని బట్టి కథాగేయాలు శాస్త్రీయంగా 3 భాగాలు. 1. లఘుకథాగేయాలు ( Ballad lings ) 2. కథాగేయాలు ( Ballads ) 3. గేయకథా చక్రాలు ( Ballad cycles ) అని. " [2]

---

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - డా॥ రామరాజు
2. జానపద సాహిత్య స్వరూపం - డా॥ ఆర్.వి.ఎస్. సుందరం గారు

1. **లఘుకథాగేయాలు :** ఉదా : **గుర్రాల గోపిరెడ్డి**

2 **కథాగేయాలు :** ఉదా : **జంగం కథలు**

3. **వీరకథాచక్రాలు :** ఉదా : **పల్నాటి వీరగాథ, కాటమరాజు కథ**

మొత్తం మీద జానపద గేయాలకు గల లక్షణాలతోపాటు వీరులకథ కల్గివుండడమే వీటి ప్రత్యేకత. ఈ గాధలు జంగాలు గానం చేస్తారు.

*కథాగేయాలకు ఉదాహరణ :*

ఈ కథాగేయాలు 1. బొబ్బిలి వరుసలు 2. పదాలు - జంగం కథలు 3. వీరగాథానికలు లేక లఘువీరగాథలు 4. వీరగాథలు.

**బొబ్బిలి వరుసలు :** ఉదా : కాంభోజరాజుకథ, ఎలనాగిరెడ్డి కథ, కొమిరెల్లి మల్లన్న కథ, ఉయ్యాలవాడ నరసింహరెడ్డికథ, రాజారామేశ్వర్‌రావు కథ, సదాశివరెడ్డి కథ వంటివి.

**పదాలు - జంగం కథలు :** శారదపదాలు, హరిహరపదాలు, పదాలలో రెండు విధాలు. జంగం కథలలో ' రగడ ' ఛందస్సు ప్రధాన కథాభాగములో ఉంటుంది. వీరగాధానికలు : ఒక గంటలోపుగా, చిన్నగా ఉండే గాధలివి. ఉదా॥ బుడ్డా వెంగళరెడ్డి పాట, దేవునిపాట వీరగాథనుకరణములు : ఇందులో బుర్రకథలు, సుద్దుల కథలు, జముకుల కథలు, బతుకమ్మపాటలు, అనునవి. ఈ వీరగాధల్ని చారిత్రక గాధలు (గేయాలు) అంటారు.

కన్పించే పాటలన్నీ వడబోత వేసి కేవలం పాటల ఆధారంగా సమస్త జానపద జీవనం పూర్తిగా ప్రదర్శించే దిశగా జానపద విజ్ఞాన పరిశోధకులు కృషి చేస్తారని ఆశ -

**లఘుకథాగేయం:** ఉదా ॥ గోపిరెడ్డి కథ

గోపిరెడ్డి ధనవంతుడు, కాని అతని నైజం -
" కొండ్యాలపురి గోపిరెడ్డి కలడు మహారాజు
భార్యపేరు రెడ్డిసాని, కొడుకుపేరు మల్లారెడ్డి
ధనమంటే మస్తుగున్నాది
సన్నబియ్యం గర్శల ఉందీ
సాలంగ పదార్థ మున్నదీ
ఇట్లా ఉంటే గోపిరెడ్డి
ఒకరికీయడు తాను దినడుగా -

ఈ గాథలో గోపిరెడ్డి భార్య రెడ్డిసాని, స్త్రీలు పురుషులతోపాటు వ్యవసాయ పనుల్లో పాల్గొనే వారు సాహసికులు.

" కిరకిర గొంత గోసింది రెడ్డిసాని
మూడు దోసిళ్ళు రక్తం దాసింది
పొలిపొలిగా పొలపొలి
భూతల్లికి సాలినంత పొలి
చేనుమీద పొలి సల్లింది రెడ్డిసాని "

ఈ గాథవల్లనాడు 'రెడ్డి' కుటుంబాల్లో గల కృషీవలత్వం తోపాటు పగలు రగిలిపోయే తత్త్వం ఇరువురి సొత్తు అని తెలుస్తుంది. కల్గిన వారైనప్పటికి, కొన్ని పనులు స్వయంగా చేసే వారని జానపద విజ్ఞాన పరిశోధకుడు గమనించాలి-

ఇవేగాక ఇంకా, ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి, బుడ్డావేనలరెడ్డి, ఓబులరెడ్డి పాట ఈడిగ రామన్న పాట, బండోళ్ళ కురుమన్నలపాట, మల్లన్నపాట వంటివి ఎన్నో కలవు - ఇవన్నీ లఘురూపంలో కొద్ది సమయంలోనే పాటగా పాడటానికి వీలైనవి. కాబట్టి, లఘువీరగాథలుగా ప్రచారంలో ఉన్నవి - వీరగాథల్ని పరిశీలించేటప్పుడు - ప్రధానాంశం, వీరగాథ వృత్తాంత కాలానికి చెందినది, ఈ వీరుల జౌన్నత్యానికి పీట వేసిన మూళింకాంశాలు ఏమిటీ ! ఎందుకు వారు, వీరులయ్యి ప్రజలకు ఆరాధనీయులయ్యారు. ఏదో ఒక మంచి కార్యం చేయటంవల్ల మాత్రమే వీరగాథకులుగా గుర్తింపబడతారు. కాబట్టి ఈ వీరుల వ్యక్తిగత శీలము - ప్రజలతో వీరికి గల సాన్నిహిత్యం - ప్రజాహిత కార్యక్రమాలు

బేరీజు వేసుకోవాలి - అంటే జానపద విజ్ఞాన పరిశోధకుడు వాటిని ఏవో పాటలే కదా అనుకోవటంవల్ల ప్రయోజనంలేదు.

**కథాగేయాలు** : కథాగేయాలకు చక్కని ఉదాహరణ జంగం కథలు ; ఈ కథల్లో ఎక్కువగా, పౌరాణిక గాథ సంబంధమైనవే ఎక్కువ, ముఖ్యంగా విరాట పర్వం, వామన విజయము, దేవయాని చరిత్ర వీటిల్లో పేర్కొనదగిన కథలు. వృత్తిరీత్యా జంగాలు గానం చేయటంవల్ల ఇవి జంగం కథలుగా ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఇతివృత్తం కథాకథనం పద్ధతిలో వరుసలు, వాటికి ప్రత్యేక వొరవడి కల్పించి, జంగం కథలుగా గుర్తింపు తెచ్చాయి - మతావేశం, ప్రచారం వీటిలో ప్రాధాన్యత కల్గి ఉంటాయి.

ఉదా ॥ *సిరియాలుని కథ :* ఇది శైవమత ప్రచారంలో ప్రముఖస్థానం అలంకరించింది ; గొప్ప శివభక్తునిగా పేరుపొందిన వాడు సిరియాలుడు - నిజానికి ఇది భక్త్యావేశాల పరాకాష్ఠనొందిన గాథ ఇందులో ప్రదర్శితం -

" చుట్టూర కూరల్లు నడుమనన్నాము
భోంచేతు రండయ్య శివభక్తులారా
నరమాంసము లేంది భోంచేయి మనిరి
ఆడేటి బాలుణ్ణి అటు బిలచినారూ
పాలుబోసి ఒక కత్తి పాకంగనూరి
నెయిబోసి ఒక కత్తి నేటంగనూరి
వచ్చేటి బాలుణ్ణి నడసి నరికినారు " జంగం కథకులు భక్తితో గానం చేసే ఈ గాథ, శివభక్తుల్లో శైవారాధకుల్లో ప్రాచుర్యం పొందింది. ఈ జంగం కథలు ఛందో వైవిధ్యంతో, పాడే విధానాన్ని బట్టి బొబ్బిలి వరుస పాటలు కూడా ఇందులో చేరిపోతాయి. వాటికి చివర ఉన్న పాటలకు " తందనాన " పదాలు పునారావృత్తం కావటం కూడా కన్పిస్తుంది. సదాశివరెడ్డి కథ - చిన్నపురెడ్డి కథ - కాంభోజరాజు కథ, ఇటువంటివే -

ఉదా ॥ *సదాశివరెడ్డి కథ :* ఈ కథాకథన పద్ధతి గమనించండి -

" రాజా ఓ రాజా రజా భోగతి కలిగి
మనది ఈ భూమి
పట్నానికి పడమటి దిక్కు

రగరంగం పేట
ఏలేవాడు రాజారెడ్డి ఉదిమారెడ్డి
ఉదిమారెడ్డి భార్య శివరంగమ్మ
శివరంగమ్మ కన్న కొడుకు
ధాల్ బహద్దూర్ శివారెడ్డి
వేంకటేశ్వర వరాన గలిగినవాడు శివారెడ్డి
అయిదు రేఖలు గలవాడు
పట్నమున భేషైనవాడు - ॥ రాజారాజా ॥

జంగం కథలో - " తందానా తందానా " రామారఘురామా " మేలు మేలు " వంటి దరువులు - యానలతో, ఆసక్తికరంగా కథాకథనం సాగుతుంది. ఈ వీరగాథలన్నీ చంధో వైవిధ్యంరీత్యా వేర్వేరు పేరుతో పిలుస్తున్నారు కాని, మూల కథాంశాలన్నీ గమనించినప్పుడు అన్నీ కూడా వీరగాథలుగానే పరిగణిస్తారు.

**వీరకథాచక్రాలు :** సుదీర్ఘంగా సాగే ఈ కథాచక్రాలు, గంటలు మొదలుకొని, రోజుల పర్యంతం పాడుతూనే ఉంటారు - అయినప్పటికి పాడే విధానం, కథా కథనరీతి ప్రేక్షకులకు మరింత ఆసక్తి కల్గిస్తాయి. పల్నాటి వీరగాథలు, ఇటువంటివే - ఓ గొప్ప చారిత్రక గాథా పరంపర కాబట్టి సుదీర్ఘమైన కథా గేయంగా రూపొందింది -

ఒకవైపు నాగమ్మ, మరోవైపు బ్రహ్మనాయుడు, యోధులుగా నిలచి పోరాడిన చరిత్ర ఇది, స్త్రీ పురుష విభిన్న మనస్తత్వాలకు, ముఖ్యంగా మతాల మధ్య జరిగిన పోరు, ప్రధానాంశంగా సాగిన ఈ గాథ చాలా ప్రాచుర్యం పొందింది. ఈ గాథల్లో, ఒక్క వ్యక్తి ఒక్కొ శక్తిగా నిలచి స్వతంత్ర పోరాటగేయ కథానాయకులుగా వెల్గిపోవటం గొప్ప కథాంశం - " బాలచంద్రుడు " అటువంటి యోధుడే. " కన్నమదాసు " నిమ్నకులస్తుడైన పోరాట యోధుడై కదనరంగంలో రాజకీయ ఎత్తుగడలో, బాలచంద్రునితో సమానమైన ప్రాధాన్యత పొందినవాడు. కథల్లో వాస్తవాలు చారిత్రాకాంశాలు, వివిధ వ్యక్తులవల్ల మారిపోయి ఉండవచ్చును, కాని, విజ్ఞానపరిశోధకుడు గమనించాల్సింది వీరి పోరాట స్ఫూర్తి, నాటి ప్రజల్లో వీరికి గల అనురక్తి, యుద్ధమైనా - సంధి అయినా, అది పాలితులచిత్తరీతి, నీతి అని నమ్మి, ప్రభువుల కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పణం చేసిన నాటి ప్రజల

త్యాగనిరతి, వీటిని గమనించాలి. ఇక భాషారీత్యా, వీరగాధలన్నింట వివిధ ఛందో రీతులు కన్పిస్తుంటాయి - అందువల్లనే ఇవన్నీ వేర్వేరు పేర్లతో ప్రచారంలో ఉన్నాయి. ప్రతి వీరగాథలో అనేకానేక చరిత్రాంశాలు, యోధుల చరిత్రలు ముఖ్యంశాలు. ఈ గాథలు ఏదో ప్రత్యేక కులాలవారు మాత్రమే పాడుతారని చెప్పటానికి బలమైన ఆధారాలు కన్పించవు, అన్ని కులాల్లో, ఈ గాథ ప్రచారంలోకి తెచ్చినవారున్నారు. అయితే, కులమతాల అభిమానంవల్ల కొన్ని కొన్ని చోట్ల వీరగాథలు, అనివార్యంగా వాటి ప్రభావానికి లోనై ఉండవచ్చు. వీటిని జాగ్రత్తగా జానపద విజ్ఞాన పరిశోధకుడు గమనించి, తనదైన ప్రత్యేక దృక్పధాన్ని వెల్లడి చేయాలి - ఈ వీరగాథ చక్రాల్లో ఎల్లమ్మ కథలు, అంకమ్మ కథలు, కాటమరాజు కథలు వంటివి, ప్రసిద్ధి చెందిన గాథాచక్రాలుగా పరిశోధకులు నిర్ధారించారు. వీరగాథ చక్రాలు, కొన్ని నెలల తరబడి, పాడుతుంటారని తెలుస్తుంది. వాటి తరువాత ప్రాచుర్యం కల్గినవి " బొబ్బిలి వరుసలు " ఇవి కూడా దీర్ఘంగా ఉన్నప్పటికీ, ఒకటి రెండు రాత్రుల్లో పాడటానికి, అనువుగా ఉంటాయి. ఇవి జంగం కథలు వంటివే. ఈవిధంగా వీరగాథలన్ని వివిధ రీతుల్లో ప్రచారంలో సాగుతున్నాయి.

# సి) పురా గాధలు

" ప్రాచీన కాలమునకు చెంది జగత్‌సృష్టిని, దేవతలను, వీరులను, సాంస్కృతిక లక్షణములను ఆచార మత సంబంధ విషయములను, నమ్మకములను వివరించు గాధ పురాగాధ. వివిధ ప్రాణుల సృష్టిని గురించి జంతువులు ప్రత్యేక గుణములను, లక్షణములు కల్గివుండుటకు గల కారణములను గూర్చి కర్మకాండలు, ఉత్సవములు ఎందుకు, ఏవిధంగా ఏర్పడినవను అంశములను గురించి పురాగాధ వివరించును. "[1]

పురాగాధల్ని నాలుగు ప్రధాన భాగములుగా వర్గీకరించవచ్చు.

1. సృష్టి పురాగాధలు (Origin Myths) 2. ఆకాశనక్షత్ర సంబంధిత పురాగాధలు ( Myths of stars and the sky land ) 3. స్వర్గలోకము, పితృదేవతా లోకమునకు చెందిన పురాగాధలు 4. వస్తువుల్ని వివరించు పురాగాధలు "[2]

జానపద సాహిత్యములోని గద్యకథనాలు, పురాగాధలు, ఐతిహ్యాలు, కట్టుకథలు అని మూడు వర్గాలుగా విభజింపబడినవి. వీనిలో కథాలక్షణాలు ఎక్కువ. వర్ణన రూపంలో కథనం వుంటుంది. పురాగాధలు మానవాతీత శక్తుల్ని, ప్రపంచం పుట్టుక, మానవజన్మం వంటి విషయాలు, మత సంబంధమైన ధార్మిక విషయాలు వివరిస్తాయి. ఈ పౌరాణిక విలువలు కొన్ని నమ్మకాలుగా కాలంగడిచే కొద్దీ మానవజీవితంపైన ప్రభావం చూపుతాయి. మానవుల ఊహాకల్పనా సృష్టి ఇందులో ప్రతిబింబిస్తుంది. ప్రాథమిక మానవుల ఆలోచనలు, వాళ్ళ యుక్తి చమత్కృతులు, అద్భుత కార్యాలు, అన్ని కథలుగా అల్లుకున్నారు. ఇప్పటికి ' కథలు ' చెప్పండు అని గ్రామాల్లో వాడుతుంటారు. అంటే కల్పనాసృష్టి అని అర్థం.

ఉదా॥ *పురాగాధలు* ( Myths ) :

---

1. *Standard Dictionary of Folklore Mythology and Legends - M. Leach.*
2. *The Encyclopedia American - 19 Volume*

ఈ గాథల్ని 1. సృష్టి సంబంధగాథలు. 2. దేవతా సంబంధగాథలు 3. ఆచార సంబంధగాథలు అనే మూడు వర్గాలుగా కూడా విభజించవచ్చును. ఈ వర్గీకరణ పురాగాథల పరిశోధనలో డా॥ రావి ప్రేమలత గారు చేసిరి .

*సృష్టి గాథలు :* అరుంధతి గురించి గేయంలో ఉంటాయి.

" నీవు పాతిపుత్యమునందు - నిజమగు దారి చూపితిరి
నీధ్యానంబు సేయువారు నీవలె వన్నె కెక్కుదురు
వివాహదినమున నిన్నుదప్పక - వేడుచుందురు ప్రజలు
గగనమందున నక్షత్రములై గాంచుచుందులెల్లరు " [1]

' తందాన ' కథా పద్ధతి ప్రాచుర్యాన్ని పొందటానికి తోడ్పడిన ప్రక్రియా విశేషం - ' వస్తురీత్యా, అన్నీ వీరగాథలే అని గమనించవలసి ఉంటుంది.

**సృష్టి సంబంధ గాథలు :** దీనిలో భగవంతుని సృష్టి, ప్రధానాంశం - ఆకాశానికి మరియు భూమికి చెందిన గాథలుగా విభజించారు - ఇందులో మళ్ళీ రెండు ఉపభాగాలు, సృష్టి గాథలు మరియు సృష్టిలోని వివిధాంశాలకు చెందిన స్వరూప స్వభావ గాథలుగా డా॥ రాని ప్రేమలత పురాగాథ సిద్ధాంత వ్యాసంలో వివరించారు.

ఈ గాథలన్నీ పాడే విధానాలు ఏవైనప్పటికి అందులోని, వివిధాంశాల మూలంగా విభజన చేయవలసి ఉంటుంది. ఉదా ॥ " ద్రౌపది దేవి చీరలు " ఈ గేయం " ఉయ్యాలో ' దరువులో సాగుతుంది - ఇందులో అంశం ' చీరెల' సృష్టి - దాని ఆధారంగా ఇది సృష్టి సంబంధమైన పురాగాథగా నిర్ణయిస్తారు.

" ధర్మన్న పెండ్లము ఉయ్యాలో
ద్రౌపది దేవి ఉయ్యాలో
ద్రౌపది దేవిని ఉయ్యాలో
దుర్యోదనుడు ఉయ్యాలో
పాపకర్ముడు ఉయ్యాలో
పట్టి మానభంగము చేసే ఉయ్యాలో
అరిచేతుల చీరెలు ఉయ్యాలో
కావించె కృష్ణుడు ఉయ్యాలో
తూర్పున కొన్నెన ఉయ్యాలో
ఇసిరెసె సీరెలు ఉయ్యాలో " ఈ విధంగా సాగుతుంది.

---

1. డా॥ రావి ప్రేమలత – పురాగాథలు

దైవాంశంతో కూడిన ఈ సృష్టి ద్రౌపది మానసంరక్షణ వేళ కృష్ణభగవానుడు చేసింది. దైవ సృష్టి సంబంధ గాధగా, దానిని చూడటం అందువల్ల ఈ విధంగా పురాగాధాలన్నీ ఆయా అంశాల ఆధారంగా వింగడించుకొని పరిశీలించవచ్చు. జానపద విజ్ఞాన పరిశోధకుడికి చేతి నిండాపని కల్పించే పరిశోధన పురాగాధల్లో పుష్కలంగా లభిస్తుంది.

దైవ సృష్టి గల గాధలేకాకుండా భౌతిక సృష్టి కూడా గాధల్లో ప్రభావితంగా ఉంటుంది. వీటిని భౌతిక సృష్టి స్వరూప స్వభావ గాధలుగా వివరించవచ్చు. ఉదా ॥ *ఎల్లమ్మ శాపము* - ఈ గాధలో తాటిచెట్టు నిలువుగా ఎందుకుంటుందో గాధా కథనం ద్వారా చెప్పారు గమనించండి.

" పరశురాముని బారినుండి తప్పించుకొనుటను ఎల్లమ్మ, గౌండ్ల వారిని ఆశ్రయమియ్యమని అర్థించెను. వారు నిరాకరించగా వారి జీవితాధారమైన తాటి చెట్లు నిటారుగా నిలబడుననియ వీటిని గీచిననే కల్లువచ్చువనియ శాపమొసంగెను - ఈ గాధ ఈ విధంగా ఉంటుంది.

" అనాటి వారికమ్మ ఉయ్యాలో
అమొదు తాటి వనమే ఉయ్యాలో
వంగి లేచునమ్మ ఉయ్యాలో
కల్లు ఒడిసేటప్పుడు ఉయ్యాలో
కిందికి వంగునూ ఉయ్యాలో
కల్లును ఒడిసినంక ఉయ్యాలో
పైకి లేసునమ్మ ఉయ్యాలో
అట్లాటి తాడుకు ఉయ్యాలో
యెల్లమ్మ శాపం పెట్టి ఉయ్యాలో
వంగుని లేవకుండ ఉయ్యాలో
ఉక్కునూ, స్తంభమై ఉయ్యాలో
నిలుబని వృక్షమై ఉయ్యాలో " -

అదేవిధంగా, బ్రాహ్మణులకు అస్తులెందుకు ఉండవు - ఇది కూడా ఎల్లమ్మ శాపమట నిజానికి, ఈ కులస్తులంతా ఇదేవిధంగా ఉంటారని కాకపోయినా గాధలు మాత్రం ప్రతి విషయానికి ఏదో ఆసక్తికర కారణాల్ని చూసి, సమర్థించటం కూడా ఒక సామాజిక సమర్థనీయ అంశంగానే గాధల్ని పరిశీలించేటప్పుడు గమనించాలి.

కొన్ని వృత్తుల, లోటుపాట్లు ఎట్లున్న వారి జీవన విధాన నిర్మాత మాత్రం దైవమే అన్న భావన దీనికి కారణం - అది విధివశాత్తూ కావచ్చు, శాపవశాత్తు కావచ్చు. అయినా సామాజిక వృత్తి విధానాలు, భావనారీతులు మారి ఉంటాయని, ఈ గాధలు సమర్ధిస్తుంటాయి.

" స్నానానికి మడిబట్ట,
తర్వాత పొడిబట్ట
రాగిచెంబు చిన్నపంచె - ముద్ద పప్పు, చద్దన్నము
మీ భార్యలేమో ఇస్తరాకులు కుట్టి
అమ్మి బతుకుదురు, అంతే మీ బతుకులు " -

నిజానికి ఈ రోజున ఈ వృత్తులు ఇలా ఉండటం లేదు. ఇదో గాధా కల్పనా చమత్కృతిగానే భావించాలి.

**దేవతా సంబంధ గాధలు :** ప్రాచీన మానవులకు, సృష్టి సంబంధమైన నమ్మకం భగవంతుని లీలగా గోచరించింది. ఆ దేవతల ప్రమేయంతోనే తను జీవితంలోని ప్రతి అంశం ప్రేరేపితమవుతుంది ? వివిధ విభిన్న మనస్తత్వం గల్గిన జానపదులు, తమకు తోచిన రీతిలో ఆయా విషయాలపై దేవతల చుట్టు గాధల్ని సృష్టించుకున్నారు. అవి గ్రామదేవతల రూపంలో కావచ్చు - పౌరాణిక దేవతా రూపంలో కూడా ఉండవచ్చు. మొత్తంమీద ఇవన్నీ తమ తమ దేవతల గాధలే - ఈ పురాణాల్ని పఠించేటప్పుడు, పరిశీలించేటప్పుడు, జానపద విజ్ఞాన పరిశోధకుడు ముఖ్యంగా ఆదిమ మానవుని చరిత్ర. వారి జీవన విధానాలు పురా మానవుని భావనను, నృశాస్త్ర చరిత్ర వంటి విషయాలపై అవగాహన పెంచుకోవటం అవసరం, ఎందుకంటే, మిగతా జానపద ప్రక్రియల కంటె పురాభావనలు ఆదిమ సమాజ జీవన స్థితిగతులకు దగ్గరి సంబంధం కల్గినవి. గ్రామదేవతల అంశమే చాలు. పురామానవుని ప్రాథమిక మతజ్ఞానం గురించి వివరించటానికి, ' టోటమిక్ ' అంశాల ప్రాముఖ్యత గల్గి మానవ నాగరికత వికాస క్రమంలో తొలిదశలో మతం ఏవిధంగా ఉండేదో పరిణామ క్రమంలో ఏవిధంగా వ్యాప్తి చెందిందో ఈ గాధల పరిశీలనవల్ల వైజ్ఞానిక విషయాలు తెలిసే వీలు ఉంటుంది. సామాజిక శాస్త్ర అధ్యయనం వల్ల ఈ పురాగాధల పరిశీలన మరింత సులభం అవుతుందని గమనించాలి.

*గ్రామదేవతల గురించి* - పోచమ్మ పుట్టుక

" కడుపుల్ల వున్నబాల రామరామ
ఏమంటున్నది రామరామ
ఆ యొక్క నల్లపోశి రామరామ
ఏ మని మాటలాడే రామరామ
ఏడవకు మాతల్లి రామరామ
నేనున్నాను తల్లి నీకు రామరామ
కష్టమంతానేమో రామరామ
కాలికూలినాది రామరామ
అగ్గిని పారిపోయే రామరామ
బూడిద రేగిపోయే రామరామ
అప్పుడు పార్వతీ రామరామ
తలవెంటుక కాలలేదు రామరామ
వొంటి మీద వస్త్రకంబు రామరామ
ఇంత కూడా కాలలేదు రామరామ
యెట్లున్న పార్వతీ రామరామ
అట్లనే ఉన్నదమ్మ రామరామ
కాట్లనే పుట్టవట్టే రామరామ
కన్నతల్లి పోశమ్మ రామరామ "

పోచమ్మ పుట్టుక గురించి ఈ గేయాలలో పోచమ్మ కాటిలోనే పుట్టిందని, ఆమె పార్వతీ అంశవల్ల జన్మించిందని చెప్పటం ఈ గాథ. అతీత శక్తులు తమ ఆరాధ్య దేవతలకు అంటగట్టడం తనకు హాని చేసే ప్రాకృతిక శక్తులు దైవాంశ కలవారిని ఏమి చేయలేకపోవటం పురామానవునిలో ఆసక్తి కలిగించే మతాంశాలుగా గుర్తించాలి -

పోచమ్మతోపాటు కుమ్మరింట బాండము, ఏడు నాగబండ్లు (బోనాల బండ్లు), బూనోళ్ళు (కుంకుమ చేసేవాళ్ళు బుక్కోళ్ళు కావచ్చు ) బుక్కా, గులాలు, కుంకుమ, ఏడు నల్లగాజులు, నాలుగు నల్లమట్టెలు, ఏడు త్రాచుపాములు ఉద్భవించినవి. అంతేగాక, శివుడు ఆమెను తన సంతానంగా అంగీకరించి - ' కాట్లో బుట్టినావు కర్రెగా ఉన్నావు నీ పేరు కర్రెపోశి ' అని బిడ్డను ముద్దాడినట్లు ఈ గాథ చెప్తుంది-

ఈ గాధవల్ల పరిశోధకుడు గమనించాల్సిన విషయం - మతప్రాతిపదికను ఇలా - ఆర్యద్రావిడ మత వృత్తాంతం - ఒకవైపు, శివునికి కూతురుగా, పార్వతి గర్భాన, ' పోచమ్మ ' ఉద్భవించింది. ఇవి గ్రామ దేవతల ఆవిర్భావం వైదిక దేవతల అంశంవల్లే జరిగిందనే భావన కల్గించింది. మతపరంగా, జానపద జీవనంలో సామరస్యం నెలకొల్పి, దేవతలంతా ఒకే కుటంబీకులే అన్న భావనకు ప్రాచుర్యం కల్గించటంగా గమనించవచ్చు పోచమ్మ ఆరాధనలో ఉపయోగించే వస్తువులు, అలంకరణాలు కూడా అన్నీ పవిత్రమైనవన్న భావనతోటే అన్నీ పోచమ్మతోపాటు ఉద్భవించాయని చెప్పటం ప్రత్యేకత.

పేరంటాండ్ర కథల్లో - తెలంగాణలో ప్రసిద్ధమైన ' బతుకమ్మ ' గాధ - గమనించాలి. కుటుంబ కలహాలవల్ల బలి అయిపోయిన బతుకమ్మ ఒక రాజుకూతురిగా వర్ణితమైన గాధ ఒకటైతే, గ్రామీణ సమాజంలో కాపువనితగా జన్మించిన బతుకమ్మ మరుదలి ఈర్ష్యా ద్వేషాలకు బలి అయిపోయి తంగేడు చెట్టుగా మారిపోయినట్లు చెప్పే గాధ మరొకటి. ఈ బతుకమ్మ పేరనే తెలంగాణాలో, ప్రతిఏట బతుకమ్మ పండుగగా జరుపుకుంటారు. ఇది బతుకమ్మ కోరికగా చెప్తారు. బతుకమ్మను తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తారు. గౌరీదేవతతో సమానంగా గౌరవిస్తారు, పూజిస్తారు. ఈ విధంగా వివిధ కారణాలవల్ల బలవన్మరణం పాలైనవారు, భర్తతో సహగమనం చేసినవారు కూడా వీరవనితలుగా మహిమలు కల స్త్రీలుగా పూజలందుకుంటున్న వాళ్ళు ఎందరో ఉన్నారు. పురుషుల దౌర్జన్యాలకు బలైన సవారమ్మ, బయ్యమ్మ లాంటి వాళ్ల గాధలెన్నో ప్రచారంలో ఉన్నాయి. అంతెందుకు, బెజవాడ కనకదుర్గమ్మ కూడా శీలం శంకింపబడి ఆత్మత్యాగం చేసుకున్న స్త్రీగా చెప్పిన గాధకూడా ఉంది. నాగమ్మ, లక్ష్మమ్మ, రాములమ్మ వంటి స్త్రీలెందరో పేరంటాండ్రుగా పూజలందుకున్నారు. ఈ పేరంటాండ్ర కథల ఇతివృత్తం అంతా సాధారణంగా ఒకే రీతిన కన్పించడం జానపద విజ్ఞాన పరిశోధకుడు పరిశీలించాలి. ఈ కథలోని సాధారణాంశం ఏమిటంటే స్త్రీలపై పురుషుల దౌర్జన్యం, స్త్రీల మానసిక బలహీనత ప్రధాన కారణం. అయితే వీరంతా శక్తిస్వరూపిణులుగా, వీరవనితలుగా ఎందుకు ఆరాధించబడినారు - దీనికి కారణం ఒకవైపు బలమైన సానుభూతి, రెండవది బలవంతంగా చనిపోయినవారు తమకుగాని తమకుటుంబాలకుగానీ హాని కల్గచేస్తారనే భీతి, కారణాలుగా భావించవచ్చు. వీరి ఆరాధనవల్ల కల్గే మానసిక తృప్తి మూడవ కారణంగా ఊహించవచ్చు. మొత్తం మీద ఈ పురాగాధలన్నీ వివిధ అంశాలచుట్టు పరిభ్రమించినప్పటికీ ప్రధానాంశం మాత్రం, ప్రాథమిక

మానవుని చిత్త వృత్తిలోని వివిధ రీతులనే గమనించవచ్చు.

**ఆచార సంబంధ గాథలు :** పురామానవుని కర్మకాండలవల్ల ఉద్భవించినవే పురాగాథలు (Myths) అనే భావంతో చూసినట్లయితే కర్మ సంబంధమైన ఆచారవ్యవహారాలెన్నో దేవతల సృష్టి చుట్టు అల్లుకొని కనిపిస్తవి - వాటి ఆధారంగా ఏర్పడిన గాథలు - రెండు రకాలుగా కన్పిస్తాయి.

1. పౌరాణిక గాథలు.
2. గ్రామదేవతలు

బతుకమ్మ కథలో పౌరాణిక ఇతివృత్తం కూడా కనిపిస్తుంది.

బతుకమ్మ - ధర్మాంగదుడు, సత్యవతి అనే రాజదంపతుల సంతానంగా లక్ష్మి అంశగా జన్మించినట్లుగా గాథ - ఈమెను సంపద ప్రదాతగా పూజించటం తెలంగాణలో సంప్రదాయం - ఆమె ఆరాధన ఎంత గొప్పదో ఈ గేయగాథలో వర్ణించారు. -

" శశిదేవి ఈ వ్రతము - సల్పింద్రా భార్య అయ్యే
వినత ఈ నోమున, విష్ణు వాహన గనియె
కుంతి ఈ నోములో, కొడుకులైదుగురిగనె
దమయంతి ఈ నోము, తనునోమి ముదమందె " -

ప్రముఖ దేవతాంశా సంభూతులై వారు కూడా బతకమ్మ ఆరాధించే రీతి. ఆమె మహిమ నోములో వివరించటమే ఈ గాథ ఉద్దేశ్యం. ఈ నోములు, వ్రతాలు, ఆచరించే విధానాలుగాని, వాటి విశిష్టతలుగాని చాటి చేప్పే గాథలెన్నో పురాగాథల రూపంలో కన్పిస్తాయి. ఈ వ్రతాల నోముల పరమ ఉద్దేశ్యం - ప్రాచీన మానవుని నుండి ఇప్పటివరకు ఒకే ఒక ప్రధానాంశం చుట్టు తిరుగుతుంది. అది మానవక్షేమం ; ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యం ప్రధానాంశాలుగా ఉండాలనే బలమైన కాంక్ష - వాటివల్లే నేటికి, ఇవి ప్రాచీన జన జీవన సంప్రదాయంలో, ఇంకా బలంగా నిలచి ఉండిపోవటానికి కారణం - ఫలితాల గురించి ఆలోచించటం కంటే, మనిషికి ప్రయత్న సాధనే ముఖ్యం కదా మరి -

ఈ గాథలన్నీ మానవ జీవిత విన్యాసాలు, మానవుని ఈర్ష ద్వేషాలు, పౌరుష పరాక్రమాలు, మూఢ విశ్వాసాలు, దైవ భావన ధార్మిక విజయాలు, వివరిస్తాయని గమనించవచ్చు -

గ్రీమ్ సోదరులు " ఆర్యుల పురాణాలే ముక్కలై కథలకు మూలమయ్యాయని ప్రతిపాదించారు " జానపద విజ్ఞాన పరిశీలకులు జాగ్రత్తగా పరిశీలిస్తే మరికొన్ని కొత్త విషయాలు తెలుస్తాయి.

# డి) ఐతిహ్యాలు

పూర్వం ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక స్థలంలో జరిగిన కథా విశేషాలు, ఐతిహ్యాలు. వీటిలో చారిత్రక దృష్టి కనిపిస్తుంది. అభూత కల్పనల కంటె జరిగిన కథలరూపమే ఐతిహ్యాలు. ఐతిహాసిక కథలే ఐతిహ్యాలకు మూలకథలు - ఇందు మానవులు పాత్రలుగా కనిపిస్తారు. దేవతలు, మానవాతీత విషయాలు తక్కువ. చారిత్రక సంఘటనలు ఎక్కువ. ఈ కథలన్నీ వస్తు ప్రాధాన్యత బట్టి, చారిత్రక సంఘటనలు, పశుపక్ష్యాదుల ప్రాధాన్యత, అమానుష విషయాలు అద్భుత సంఘటనలు ఆధారంగా వర్గీకరించవచ్చు.

" Legends are the orally transmitted long as more often secular. Prose Narratives Supposed by bases on historical facts relates to persons, events our Localities "

అని విలియమ్ బాస్కమ్ ( William Bascon ) [1]

జానపద కథలకు చెందిన " ఐతిహ్యాలు " జానపద కథాలక్షణాలన్నీ కలిగి ఉంటాయి. " ఐతిహ్యాలు స్థల ఐతిహ్యాలు, వృత్తి ఐతిహ్యాలు, కార్యా కారణకథలు, కిన్నెర కథలు, సంఘటన ఐతిహ్యాలు వుంటాయి. ఇందులో ప్రధానంగా సత్య ప్రతిపాదన కన్పిస్తుంది "

జానపద విజ్ఞాన పరిశోధకుడు తన పరిశోధనలో భాగంగా, జానపద విజ్ఞాన విభాగానికి చెందిన మరే ప్రతి పాదనకైన స్వతంత్రంగా గుర్తించవచ్చు. కేవలం మనకంటే ముందు జానపద విజ్ఞాన పరిశోధకులు, వివరించిన నిర్వచనాలకు తృప్తి పడవలసిన పనిలేదు. ఉదా॥ ఐతిహ్యాలకు మరేవైనా లక్షణాలు పరిశీలనలో గుర్తించగల్గితే వాటిని పేర్కొనవచ్చు - మరొక విస్తృతమైన జానపద విజ్ఞాన క్షేత్రంలో, విభాగాలు ఒక దానితో మరొకటి లక్షణ రీత్యా ఒక్కటిగా కనిపించవచ్చు. అయితే, ప్రత్యేక లక్షణాలు మాత్రం దేనికవి విడిగా ఉండాయని గుర్తించవచ్చు -

1. *Encyclopedia Britanica Volume - 9*

ఇక్కడ ఐతిహ్యాలు కథ, పురాణకథలు, పురాగాధలు, వంటి లక్షణాలతో గద్య కథనాల్లో భాగంగా ఉంటాయి - కారణం, కథల్లోని కథాకథనం, పురాణాల్లోని వీరకథాంశం కూడా ప్రధానంగా కనిపించటం సాధారణంగా కనిపించే లక్షణం - ప్రత్యేకించి జానపద సాహిత్యంలో, గద్యం ( Prose ) ప్రధానంగా కల సాహిత్యం కూడా ఉందని వివరించటానికే, గద్య కథనాలు ( Prose Narratives) అనే పేర ఐతిహ్యాలు, పురాగాధలు, కథలు - ప్రత్యేకంగా గుర్తించటం జరిగింది - కథలే, ఇటువైపు సంఘటనల చుట్టు, చారిత్రక స్థలాల చుట్టూ తిరుగుతూ, కొన్ని వాస్తవ పరిస్థితుల్ని వివరించేటప్పుడు ఐతిహ్యాలుగా ప్రాచుర్యం పొందుతాయి. ఇవే కథలు, మానవ కాల్పనిక ప్రపంచంలో, అతీతశక్తుల అలంబనలో, దైవాంశసంభూతులై అద్భుత సృష్టితో పెనవేసుకొని పురాగాధలవుతాయి అని భావించటం సముచితం - ఐతిహ్యాల్లో కల్పనలు ఉండవచ్చు - అయితే అవి, చారిత్రక సంఘటనలు, స్థలాల చుట్టు తిరగటం, జన ప్రచారంలో అవి వాస్తవం అనేంతగా కలసి పోవటం గమనించవచ్చు - కొన్ని స్థల మహాత్యాలు వాటి చుట్టు అల్లుకున్న కథనాలు కూడా ఐతిహ్యాలు అవుతాయి. ఎందుకంటే, జానపద విజ్ఞానక్షేత్రల్లో ఊళ్లపేర్లు, చారిత్రికకోణంలో పరిశీలిస్తే, అనేకానేక కొత్త విషయాలు చారిత్రక ఆధారాలు తెలుస్తాయి. అంతేగాదు కొన్ని ఐతిహ్యాలవల్ల పరిశోధన ముందుకు సాగి, అక్కడ ఏదో ఒక చారిత్రక వాస్తవ విశేషాలు అరుదుగానైన బయట పడే అవకాశం ఉంది, అంటే ఐతిహ్యాలు పూర్తిగా అవాస్తవాలు అని కొట్టి పడవేసే గాథలు మాత్రం కాదు. అంటే ఒక విధంగా చారిత్రక పరిశోధనకు ఉపయుక్తమయ్యే సాధనాలుగా గుర్తించవచ్చు. ఐతిహ్యాలు, నాలుగు ప్రధాన విభాగాలుగా విజ్ఞాన పరిశోధకులు గుర్తించారు. అవి 1) వివరణాత్మక ఐతిహ్యాలు 2) చారిత్రక ఐతిహ్యాలు 3) అలౌకిక శక్తులని వివరించేవి 4) మత సంబంధ విషయాలు. అయితే, ఈ విభజనే కాకుండా, ' ఐతిహ్యాలు ' ప్రత్యేక విషయంగా పరిశీలిస్తే మరికొన్ని ఉపవిభాలుగా కూడా గుర్తించవచ్చని జానపద విజ్ఞాన పరిశీలకులు గమనించాలి- పాశ్చాత్య విద్వాంసుల విభజన ఆధారంగా మన పరిశోధకులు ముందుకు సాగి, స్వతంత్ర ప్రవృత్తితో జానపద విజ్ఞాన పరిశోధనలో కొత్త మార్పుల్ని అన్వేషించవల్సిన అవసరం ఉంది. విచిత్రమైన విషయమేమిటంటే, జనశ్రుతులుగా చెప్పుకునే సామెతల్లో చాల విషయాలు, ఐతిహ్యాలుగా గుర్తించవచ్చు. అయాస్థల విశేషాలు,

గ్రంథాలయ
A C. No. 88028

వ్యక్తుల, సంఘటనల చారిత్రక ఆధారాలు కూడా వాటిల్లో లభించటం కారణం. అప్పుడప్పుడు, కొన్ని పుకార్లు వదంతులు కూడా, ఐతిహ్యాల పుట్టుకకు కారణమవుతాయి, అవి స్థిరపడి ఒక తరం నుండి మరో తరానికి ప్రాకి ప్రాచుర్యం పొందుతాయి - అందువల్లనే ఐతిహ్యాలు రెండు వర్గాలుగా గుర్తించవచ్చు. స్థిరమైన ఐతిహ్యాలు, ప్రచార సంబంధాల ఐతిహ్యాలుగా విభజించవచ్చు - స్థిరమైన ఐతిహ్యాలు - గత కాలం నుండి అనుశ్రుతంగా వచ్చి ఏదో ఒక చారిత్రక విశేషాలను వివరిస్తుంటుంది. అదే ప్రచార సంబంధమైన ఐతిహ్యం - ఆయా ప్రాంతాల గురించి, వివిధ రకాల విషయాలతో ప్రచారంలో సాగుతుంటుంది - ఒక్క విషయమే పలు విధాలుగా వివరిస్తారు. ఎవరికి తోచిన విధంగా వారు వ్యాఖ్యానిస్తారు. ఇవి ముఖ్యంగా ఆయా ప్రాంతాల స్థలనామాల విషయాల్లో, క్షేత్రమహాత్మ్యాల, విషయంలో జరుగుతుంది -

ఉదా॥ సారంగధరుని వృత్తాంతానికి చెంది, తెలుగు ప్రాంతాల్లో వివిధ చోట్ల సారంగధరుని మెట్ట గుట్టలు ఉన్నాయి - తెలంగాణా, రాయలసీమ, కొన్ని ఆంధ్రలోను, ఈ కథలు చెప్తూ, ఆ గుట్టలపై సారంగధరుని ఆనవాళ్ళు చూపుతారు. అదేవిధంగా, రాముని పాదుకల గుర్తులు గల గుట్టల్ని చూపించి, రాముడు ఆ ప్రాంతాల్లో వనవాసం చేసారని, సీతాదేవి స్నానమాడిన చోట్లు " పవిత్ర గుండాలని " చెప్తుంటారు. ఇవన్నీ జనం, తమ ప్రాంతాల్లో ప్రాచుర్యంలోకి తెచ్చిన ఐతిహ్యాలే, కాకపోతే ఇవన్నీ ప్రచార సంబంధ ఐతిహ్యాలుగా గుర్తించవచ్చు- మరింత పరిశోధనలు ఐతిహ్యాలపై జరగవలసి ఉంది. సేకరణ పూర్తి అయిన పక్షంలోనే జానపద విజ్ఞాన క్షేత్రంలో విస్మృత పరిశోధకులు జరిగే వీలుంటుంది - ఇదో విశాలమైన విషయం, సామెతలు అటువంటివే - ఈ రెండు పరిశోధన క్షేత్రాలు, ఒక సమగ్ర ప్రాజెక్టు రూపంలో ముందుకు సాగితే తప్ప, ఒక జాతి పూర్తి సమాచారం, మనస్తత్వం, పూర్తిగా తెలుసుకోవటం సాధ్యంకాదు ; అప్పటివరకు, ఈ విధంగా పుస్తక పరిజ్ఞానంతో కుంటుతూ సాగవలసిందే - భావి పరిశోధకులు, ఈ కొరతల్ని నివారిస్తారనే ఆశ - ఐతిహ్యాలు, ఉదహరించటం, ఈ చిన్న వ్యాసరూపంలో సంపుటిలో అసాధ్యం. పైగా ఈ వ్యాససంపుటి సంక్షిప్త పరిచయ ప్రణాళిక కాబట్టి, ఐతిహ్యాలు - కథలు - గాథలవంటివి ఉదహరించటం సాధ్యపడదు - రేఖా మాత్రంగా వాటిని పరిచయం చేసాను.

# ఇ) జానపద కథలు

'కథలు ' చెప్పటం, " కట్టు కథలు " " కథకు కాళ్ళులేవు ముంతకు చెవులు లేవు " ఇటువంటివన్నీ కథల స్వరూప స్వభావాలన్నీ కొంతవరకు, తెలుపుతాయి- ' కథ ' అంటేనే, కల్పన - ఇందులో, చారిత్రక అంశాలుగాని, వాస్తవ సంఘటనలు కాని వెతకటంవల్ల ప్రయోజనం లేదు - అయితే, నాటి నుండి నేటి వరకు, సామాజిక ధర్మంగా, సాహిత్యంలో ' నీతి ' అంటూ ఒకటుందని రచయితలు, కల్పనాకారులు సైతం నమ్మేవారు కాబట్టి, భారతీయ ధార్మిక నీతికి అనుగుణంగా, నీతి, ధర్మం, న్యాయంవంటి మంచి లక్షణాల్ని కథల్లో చెప్పేవారు వీటివల్ల సమాజంలో, కథలు కూడా ఎంతో పరివర్తన తెచ్చిన సంఘటనలున్నాయి - ' పంచతంత్ర కథలు ' అటువంటివి మంచి కథ కల్పనా చమత్కృతి కల్గినవని మనందరికి తెలుసు - మనిషి తాను కోరుకునే దేమిటో - కథల్లో స్పష్ట పరుస్తాడు కల్పనలోనైన కలల్లోనైన తన భావాన్ని ఎలా మలచుకుంటాడు, వీటిని కథల్లో చిత్రీకరిస్తాడు అందువల్లే కథలు, జనప్రియంగా మారి, తక్కువ సమయంలో, ఎక్కువ వ్యాప్తిని పొందుతాయి

జానపద కథల ప్రధానలక్షణం - కథాకథన పద్ధతి, ఆసక్తికరంగా ఉండటం - ఇందులో పాత్రలు, మనుషులేకానవసరం లేదు, జంతువులు, దేవతలు, దయ్యాలు వంటివి ఉండవచ్చు - చివరికి నీతి గెలుస్తుంది ధర్మం నిలుస్తుంది కథలో ప్రధాన పాత్రధారి జయిస్తాడు ప్రతినాయకుడు విధిగా ఘోరంగా దెబ్బతింటాడు - ఇదే అనుశ్రుతంగా కథల్లో కన్పించే విషయం అయితే జానపదకథకు మరొక్క ప్రత్యేక లక్షణం కల్పనా చమత్కృతి ఇదే కథను ఆసక్తికరంగా తీర్చిదిద్దుతుంది - ఇందులో మళ్లీ అమాయకత్వం, మృదుత్వం ఉండటం ఉపలక్షణాలుగా భావించవచ్చు - పాశ్చాత్య విద్వాంసులు కథలకు కొన్ని లక్షణాలు వివరించారు -

1) కథలు ముఖ్యమైన క్రియతో ప్రారంభంకావు ఉన్నట్టుండి ముగిసి పోవు
2) పునారావృత్తి సామాన్యంగా అన్నిచోట్ల కన్పిస్తుంది
3) ఒక్కోసారి ఇద్దరు వ్యక్తులు ఒక దృశ్యంలో కన్పిస్తారు - ఎక్కువ మంది

ఉన్నా ఇద్దరికే ప్రాధాన్యత ఉంటుంది.

4) విభిన్న పాత్రలు కలిసి ఉంటాయి - నాయకుడు, ప్రతి నాయకుడు.

5) ఒకే రకమైన పాత్రలు రెండు ఉంటే, వీళ్లు చిన్నవాళ్లుగా అశక్తులుగా చిత్రించబడుతారు

6) దుర్బలులైనవారు మంచి వాళ్లుగా ఉంటారు. సోదరుల్లో చిన్నవాళ్లు మామూలుగా విజయం సాధిస్తారు.

7) పాత్ర చిత్రణ సరళంగా ఉంటుంది, కథకు నేరుగా సంబంధించిన పాత్రలు, సంఘటనలు మాత్రమే విచిత్రమవుతాయి.

8) కథా వస్తువు సరళంగా ఉంటుంది. ఏకకాలంలో కథ వివరింపబడు తుంటుంది. రెండుగాని, అంతకంటే ఎక్కువగాని కథలు ఏకకాలంలో చెప్పవలసివస్తే అప్పుడది సాహిత్య సంబంధమైన కథను పోలుతుంది -

9) కథలోని విషయాలు సరళంగా ఉంటాయి. వైవిధ్యమయంగా తీర్చే ప్రయత్నం కనిపించదు.

ఈ లక్షణాలు మాత్రమే కథల్లో కన్పిస్తాయని భావించటానికి వీలులేదు. స్థానికంగా లభ్యమయ్యే కథల్ని పరిశీలించి జానపద విజ్ఞాన పరిశోధకుడు స్వయంగా మరిన్ని స్వతంత్రమైన లక్షణాల్ని గుర్తించవచ్చు.

ముఖ్యంగా, ఏ ప్రాంతంకథలో ఆ ప్రాంత పరిసరాల చిత్రీకరణ, ఆచార వ్యవహారాలు, నైతిక వర్తనలు, సామాజిక ధర్మాలు, ప్రతిబింబిస్తుంటాయన్ని గమనించాలి, ఒకే మూసలో ప్రపంచ కథలన్నీ ఉంటాయనుకోవటం భావ్యంకాదు. కథల్లో మరొక ప్రత్యేకాంశం కథలో అంతర్లీనంగా పాత్రల్ని పరిశీలిస్తే మనకు స్పష్టంగా, మనస్తత్వ స్వరూపం కనిపిస్తుంటుంది. ఇది ఏ కథలోనైన బలమైన అంశంగా పరిగణించాలి.

మరొక విధానంలో, కథల్ని సరళత, కాల్పనినత, కల్గిన వినోద సాధనాలుగా వివరించారు. అంతేగాదు వీటిని వినోద కథలు ( Merrytales ) అద్భుత కథలు ( Fairy tales ) ప్రాణికథలు ( Animal tales ) సమస్యాత్మక కథలు ( Riddle Stories ) గా వర్గీకరించారు. అయితే, అన్నింటిలాగానే ఇదొక్కటే, సమగ్ర వర్గీకరణకాదు - మరికొన్ని అంశాల్ని దృష్టిలో పెట్టుకొని, జానపద విజ్ఞాన పరిశోధకులు వివిధ కోణాల్లో కథల్ని వర్గీకరించుకొని, పరిశీలించవచ్చు -

**వినోద కథలు** :- ఈ కథలు, తాతయ్యలు, అమ్మమ్మలు, కేవలం వినోదం కోసం పిల్లలకు వినిపించేవి, తెనాలి రామలింగని కథలన్నీ, అత్తా అల్లుళ్ళు కథలన్నీ వినోదం కల్గించేవే . ఈ కథలు పూర్తిగా హాస్యంతో కూడి ఉంటాయి. వింతచేష్టలు, చమత్కారాలు, ఈ కథల్లో ముఖ్యాంశాలు. తెలివి తక్కువ తనంతో హాస్యం చిత్రించటం ఉంటుంది. పరమానందయ్య శిష్యుల చేష్టలు అటువంటివే. తెలివితో కూడిన కథలుంటాయి. మర్యాదరామన్న కథలిటువంటివే అనూహ్యాసంఘటనలు, విచిత్ర సన్నివేశాలు, కథలో అక్కడక్కడ ముందుకు సాగటానికి తోడ్పడుతుంటాయి. మానవ చర్యలు, వాటి ఫలితాలు, ఈ కథల్లో ఎక్కువగా కన్పిస్తుంటాయి. చర్యకు ప్రతిచర్యలుండటం - చక్కని గుణపాఠాలుండటం కూడా ఈ కథల్లో కనిపిస్తాయి.

**ఉదా**:- తెనాలిరామలింగని, పిల్లిపాల కథ, కృష్ణరాయల తల్లి వాతల కథ గాని అటువంటివే, ఉదాత్తమైన, చింతనకు మారుపేరుగా ప్రవర్తిల్లే రాజు పక్కదారి పట్టకుండా ఉండటం కోసం, రామకృష్ణుడు తను తెలివితేటలతో చేసిన చమత్కారాలే ఈ కథలు, ఈ కథలు నేడు వినోదసాధనం అయితే నాడు మాత్రం చరిత్రగతిలో, ఉత్తమ నీతిని నిర్ధేశించిన నీతి సూత్రాలుగా భావించాలి. అంటే, వినోదం ప్రధానాంశం అయినప్పటికీ, నీతి, ఆదర్శం ఆయువు పట్టుగా ఉండటం, తెలుగు కథల సొత్తని, గర్వించవచ్చేమో, భావి పరిశోధనలు గుర్తించవల్సి ఉంది.

**అద్భుత కథలు** :- ఇందులో వాస్తవ పరిస్థితుల కన్న, అద్భుతసృష్టికి, మంత్రాలకు, మహిమలకే ప్రాధాన్యత అధికం. మానవాతీత ప్రదర్శనలు, ప్రాణాలు పోయినా తిరిగి రావటం - పరకాయ ప్రవేశాలు, సంజీవిని విద్యలు అన్నీ ఈ కథల్లో కన్పిస్తాయి. ఇందులో కూడ చివరకు ధర్మం జయిస్తుంది, చెడు నశిస్తుంది, కథ మాత్రం అద్భుత సృష్టితో సాగుతుంది. పాత్రల్లోనే కొందరు మానవాతీత శక్తులు ప్రదర్శిస్తారు. లేదా కథానాయుకుడికి ఏ మునీశ్వరుడో లేదా, దైవం తోడ్పడుతూనో, అతీంద్రియ శక్తులు అలవడి, వీటితో కథానాయుకుడు దుష్టుల ఆటలు కట్టిస్తాడు, రాజుల కథలు, ఎక్కువగా, అద్భుత కథలకు ఉదాహరణగా నిలుస్తాయి. సాహసంతో కూడిన కథలు ఎక్కువ.

**ప్రాణికథలు** :- మానవుడి ఊహాకల్పనకు, చక్కని సాక్ష్యాలు, ప్రాణికథలు- ప్రాణులకే గనుక మాటలు వస్తే, వాటి ఆలోచనా పరిధిలో, మానవులకంటే ప్రాముఖ్యం కల్గి, సమస్యల్ని పరిష్కరించుకొని, ఐక్యతతో ఉత్తమ విలువల సమాజం

సృష్టించుకుంటాయనే మానవతాపత్రయమే, ఈ ప్రాణి కథలకు మూలం. ప్రపంచమంతటా, ప్రాణికథలు, ప్రాచుర్యంలో ఉన్నాయి. అయితే, తెలుగులో, ఈ ప్రక్రియ, పరిపుష్టి పొందింది, పంచతంత్రకథలవల్లే మానవులకు, సన్నిహితంగా, పశుపక్ష్యాదులు మెసలటం, వాటి సహాయంతో మనిషి విజయం సాధించటంవంటి కథలు కూడా లేకపోలేదు. ఇవి విడిగా లేకపోయినప్పటికి, ఆయా గాథల్లో, కనిపించటం మామూలే. అయితే పూర్తిగా, పశుపక్ష్యాదుల ఇతివృత్తంతో సాగిన కథలు, ప్రాచుర్యం పొందాయి. కొందరు జానపద విజ్ఞాన పరిశోధకులు నీతికథలు అంటూ ప్రత్యేక వర్గీకరణ చేసారు కాని, దాదాపు ప్రతికథలోను నీతి ప్రస్తావన ఉండి ఉంటుంది. కాబట్టి ప్రత్యేక వర్గీకరణ అవసర లేదని భావించాను.

**సమస్యాత్మక కథలు** :- మానవ జీవతంలో, యుక్తికి, శక్తికి ఉన్న సంబంధం శక్తికంటే, మేధాశక్తి అనదగిన యుక్తికే పెద్దపీట వేసారు. మన సంప్రదాయం కూడా ఈ యుక్తి చమత్కృతి పెంచటానికి కథల్ని పొడుపు కథల వలే తీర్చిదిద్దుతున్నట్లుగా భావించవచ్చు. పొడుపు కథలు, ఒకటి రెండు వాక్యాలకో, పదాలకో పరిమితమై ఉంటాయి, కానీ సమస్యల్ని వివరించి పరిశీలించే కథలు మాత్రం చిత్రవిచిత్ర రీతిలో సాగుతూ, వివిధ సమస్యల్ని తమ చమత్కార, యుక్తిత్తో, పరిష్కరించమంటూ, కథను కొనసాగించటం, సమస్యాత్మక కథల ఇతివృత్తం. ఈ కథల్లో, 'సమస్యల్ని' పరిశీలించటం లేదా, చిక్కుముడుల ప్రశ్నల్ని విప్పటం అనేది, ఆయా పాత్రల ద్వారా జరుగుతుంటుంది, ఓ రాజకుమార్తె, తనకు కాబోయే వరునిలో కేవలం భౌతికశక్తి మాత్రమే కాక, అతని మేధోస్ఫూర్తి అంచనా వేయటం కోసం,చిక్కు ప్రశ్నల్ని వేయటం - దాన్ని తన తెలివితేటల్లో పరిష్కరించటం, రాజకుమారుడి వంతు. అందులో జయిస్తే ఆ రాజకుమారి, అతడి స్వంతం అవుతుంది, మరో కథలో మాంత్రికుల చర్యల్ని, ప్రశ్నల్ని, వివరించి, సమాధానపరచి, అతన్ని జయించటం రాజకుమారుడి వంతవుతుంది, ఏ విధంగా చూచినా మానవునిలోని, 'మేధాశక్తికి' పరీక్షలు అవసరమే అన్న సిద్ధాంతానికే తార్కాణంగా నిలుస్తాయి ఈ కథలు. ఈ కథల వల్ల మనిషిలో తార్కిక బుద్ధి, వైజ్ఞానిక ప్రతిభ వ్యాప్తి చెందే వీలుందని, పరిశోధకులు గుర్తించాలి. మొత్తం మీద ప్రపంచవ్యాప్తిగా కథలన్నీ, మానవ మనస్తత్వ రీత్యా చూచినప్పుడు,

ఒకే మూలాంశానికి చెందినట్లు అనిపించినా - విడిగా పరిశీలించినట్లైతే, అనేకమైన విషయాలు తెలుస్తాయి. మానవకోటి ఆలోచనా సరళి ఒకటే అయినా ఆయాప్రాంతాల సామాజిక ధర్మాల ప్రభావం సాహిత్యంపైన తప్పక ఉంటుంది. అది లిఖిత సాహిత్యమే కానవసరం లేదని కథ జానపద మౌఖిక సాహిత్యం చెప్తుంది. కథల్ని సామాజిక వర్గీకరణ నేపథ్యంలో పరిశీలిస్తే మరెన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. ఇంతవరకు లోతైన అధ్యయనం వివిధ ప్రాంతాల్లో జరిగినప్పటికి మన తెలుగు కథలంటే లిఖిత కథానిక సాహిత్యంగానే నిలిచిపోయింది. ఇది వర్తమాన చరిత్రకు దోహదపడుతుంది. కాని, ఆదిమ మానవుడి నుండి నేటివరకు మానవ మహాప్రస్థానంలో సాగిన వివిధ ఆలోచనలు, సమస్యల పరిష్కారాలు అన్నీ మనకు జానపద విజ్ఞాన అధ్యయనంలోనే పూర్తిగా తెలిసే వీలుంటుందని జానపద విజ్ఞాన పరిశోధకులు గుర్తించి, ప్రాచుర్యం కల్గించాలి.



# ఎఫ్) సామెతలు

'సామ్యం' అంటే పోలిక. పోలిక ప్రధాన లక్షణంగా కలది 'సామెత'. సామెత 'సమతాశబ్దభావమని' ( బ్రౌణ్య / నిఘంటువు )

అచార్య బి. రామరాజుగారు సామెతల్లో ప్రతిబింబించే మానవజీవితాన్ని గమనించి " సామెత, జీవితానుభవం యొక్కసూత్రప్రాయనగ్న స్వరూపం" అన్నారు. డా॥ చిలుకూరు నారాయణరావుగారు "సామెత కవితాకళకు పతాకస్థాయి- కవిత్వానికి అరంభదశ" అన్నారు.

" Proverbs are the daugters of daily life". సామెతలు నిత్య జీవితానుభవ పుత్రికలు - Proverbs are the wisdom of the ages, సామెతలు, తరతరాల విజ్ఞానం, అనే నిర్వచనాలు సామెతల విలక్షణత వివరిస్తాయి.

సరళత, సంక్షిప్తత, సమగ్రజీవన విన్యాసం, సామెతల స్వరూపంగా వివరించవచ్చు. ఎవరో ఒక వ్యక్తి- తన అనుభవాన్ని ఒక వాక్యంలో వెలువరించిన ఉత్తమ భావనే, ప్రాచుర్యం పొంది, నలుగురిలో నలిగిపోయి వ్యాప్తిలో ఉంటేనే, అది సామెతగా నిలుస్తుంది, అంటే - కేవలం ఒక అందమైన మాటో, అనుభవమో, వాక్యమో, సామెతకాదు. ప్రజాప్రాచుర్య లక్షణం సామెత స్థిరీకరణకు తోడ్పడుతుంది. అయితే సామెతల సృష్టికర్తలెవరు ? ఎప్పుడు? అనే ప్రశ్నలకు సరియైన సమాధానం దొరకదు. అయితే " మౌలికమైన ప్రతిభాశక్తి, కల్పనాశక్తి ఉన్న అతి ప్రాచీన మానవుడే సామెతల్ని సృష్టించాడనడంలో సందేహం లేదు". అని డా॥ ఆర్వీ.యస్. సుందరం గారు పేర్కొన్నారు.

సామెతలు సమగ్ర జీవిత స్వరూపానికి భద్రపేటికలు, అవి ఒక నాటి నుండి నేటి వరకు, జీవితాన్ని సంస్కృతిని తనలో ఇముడ్చుకొని బతుకుతున్న సాహితీసంపద. ఈ వ్యాసకర్త తెలుగు సామెతలు, ప్రధానాంశంగా ఎన్నుకొని, సామెతల్లో నిక్షిప్తమైన జానపద సంస్కృతిని వివరించి పరిశోధనా పట్టం స్వీకరించాడు. అయితే, అది ఒక్కటే సరిపోదు, సామెతల్లో ఒక్కో అంశంపై విపులమైన, పరిశోధనలు జరగటం అవసరం, విదేశాల్లోను . స్వదేశంలోని

' కేరళ ' రాష్ట్రంలోను, సామెతలపైన సమగ్రమైన పరిశోధన, నిఘంటువు నిర్మించటం వంటివి చూచినప్పుడు, సామెతల అధ్యయనంలో మనమెంత వెనుకబడి ఉన్నామో తెలుస్తుంది. నేల తెలుగు సామెతలకు, సమగ్ర నిఘంటువు తేవాలనీ ప్రయత్నించి, ఆర్థిక భారం పెద్దదై, ఓ సంస్థ చేయవలసిన భారంగా భావించాను. అయితే, ఈ బృహత్ ప్రయత్నం మాత్రం విరమించలేదు. ఇది జీవితాశయంగా ముందుకు సాగాలన్నదే ఆరాటం.

సామెతలు వివిధ రకాలుగా వర్గీకరించారు. కొందరు ఆకారాదిగా , మరికొందరు సామెతల్లో ప్రస్తావించిన విషయ పరిజ్ఞానం ఆధారంగా వర్గీకరించారు. అయితే, నవీన పద్ధతిలో, శాస్త్రీయ దృక్పథంతో వర్గీకరణ చేయటం సామెతల్లో పేర్కొన్న విషయాన్ని బట్టి వివరించటంలోనే కుదురుతుంది.

నేను నా" తెలుగు సామెతలు - జానపద సంస్కృతి" అనే సిద్ధాంతగ్రంథంలో- సామెతలను 1) సామాజిక సామెతలు, 2) మతపరమైన సామెతలు, 3) శాస్త్రపరమైన సామెతలు, 4) ఆర్థికరాజకీయపరమైన సామెతలుగా ప్రధాన విభాగాలుగా వర్గీకరించుకొని, అందులో వస్తుపరంగా, వివిధ కోణాల్లో సామెతలను పరిశీలించటం జరిగింది.

**సామాజిక సామెతలు** :- ఈ వర్గీకరణలో, వ్యక్తి, సమాజం, కుటుంబం - అనుబంధాలు, వంటి సామెతలు స్వీకరించటం జరిగింది.

" లోకంతో లొట లొట, నల్గురితో నారాయణ" ఈ సామెతలు మనిషి సంఘజీవి అనే వాస్తవాన్ని వివరిస్తాయి. సమాజంలో మనిషి తాను వ్యక్తిగా జీవిస్తున్నా, సామాజిక కట్టుబాట్లు, అచరించాల్సి ఉంటుంది లేని పక్షంలో సంఘం వారిని కొన్ని విషయాల్లో తప్పుపట్టి వెలివేసే సంఘటనలు కూడా ఉంటాయి. మానవుడు సమాజ భాగస్వామి, అయినప్పటికి, కుటుంబ వ్యవహారాల్లో మాత్రం కుటుంబసభ్యులందరి ప్రవర్తనా పద్ధతులే, ఆ కుటుంబం యొక్క మంచి చెడ్డల్ని నిర్ణయిస్తాయి. అయితే సంప్రదాయం కూడా, వ్యక్తులకు కొన్ని లక్షణాలు, అధికారాలు వారసత్వపరంగా అందచేయడం కన్పిస్తుంది. దాని పరిధిలో ఇమిడిపోయి, ఆయా వ్యక్తుల ప్రవర్తన కూడా ఉంటుందనటానికి, ఈ కుటుంబ సామెతల్లోని కొన్ని సామెతలు ఉదాహరణ.

' అత్త కత్తి వంటిది ' మంచి అత్తగారు ఉండదని కాదు, కాని అధికారం, అవలక్షణం అయితే, జరిగే పరిణామం ఈ సామెత చెప్తుంది. అత్తకోడళ్ళ మధ్య స్పర్ధలు, కుటుంబ ఆధిపత్యానికి పోరాటం, జరుగుతూనే ఉంటాయి. వాటిని ఈ " అత్తలేని కోడలు ఉత్తమురాలు, కోడలు లేని అత్త గుణవంతురాలు" సామెత వివరిస్తుంది. అదే విధంగా కుటుంబంలో, కోడలి పాత్ర ఎంత ముఖ్యమైందో 'ఆడబిడ్డ' పాత్ర అంతే ముఖ్యమైంది, అందుకే " ఆడబిడ్డ అర్ధమొగడు " సామెత పుట్టింది. అల్లుళ్ళ ప్రాధాన్యత, వారికి అత్తవారింట గల గౌరవ మర్యాదలు ఈ " అల్లుడి చూస్తే వంకరతాడు నిలుచుంటుంది " సామెత వర్ణిస్తుంది. మొత్తం మీద (కుటుంబం) కాపురానికి గల లక్షణాలన్ని కూడా, వివరించి సామెతల ద్వారా చక్కదిద్దటం ఉంది, " కొంచెమంత కాపురం కొండేలతో చెడుతుంది" అని " మంది మాటలు పట్టుకొని మార్యానం పోతే మల్లొచ్చేసరికి ఇల్లు కాలిపోయ్యే" సామెతలు, కుటుంబంలో ఇతరుల జోక్యానికి అవకాశం కల్గిస్తే పరిణామం ఏ విధంగా ఉంటుందో వివరిస్తాయి. అందుకే కుటుంబ సభ్యులంతా ఒక్కతాటిపై ఒకరి మాటపై నిలబడాలనీ ఈ " కలసి ఉంటే కలదు సుఖం" సామెత చెప్తుంది, ఈ సామెత ఉమ్మడి కుటుంబ వ్యవస్థను బలపరుస్తుంది కూడా. కుటుంబ జీవనంలో తల్లితో పాధాన్యత " ఏనుగంత తండ్రి పోయినా ఏకులగుల్లంత తల్లుండాలి" సామెత పుట్టింది. తల్లి స్వభావం, " తల్లి కడుపు చూస్తది పెండ్లాం జేబు చూస్తది " సామెత చెప్తుంది. తండ్రి గురించి - ' తండ్రి పోతే తరంపొయ్యే" సామెత వివరిస్తుంది. ఆలుమొగల సరసాలు, ఎంతో, జగడాలు అంతే అని భావిస్తుంది. జానపద సమాజం నేటి నాగరికుల్లా బంధాన్ని తెగలాగే పద్ధతి లేదు, ఓర్పు నేర్పు కాపురానికి ముఖ్యమని, " ఆలుమొగల జగడం అద్దం మీద ఆవగింజలు" అంటారు. ఇంటికి ఇల్లాలు ముఖ్యమైన కళ అని " ఆడది లేని ఇల్లు అడివితో సమానం" అనే సామెత చెప్తుంది, కుటుంబ జీవనంలో, అందం ఆనందం సంతానం వల్లనే, ' పిల్లలు లేని ఇల్లు పీరీల కొట్టం' సామెత గుర్తు చేస్తుంది, ఈ విధంగా కొన్ని వేల సామెతలు, ఒక్క కుటుంబ జీవనంపై కన్పించటం సామెతల మీద సమగ్ర పరిశోధన అవసరమనే సత్యాన్ని గుర్తుచేస్తుంది. విషయ విస్తరణ భీతి చేత సంక్షిప్తంగానే ముందుకు సాగుతున్నానని మనవి.

**మత పరమైన సామెతలు** :- ' మతం' నేడు ఉన్నరీతిలో నాడు లేదు. ఆదిమమానవుడి ఊహల్లో పుట్టిన భీతి, రీతి, మతం యొక్క పూర్వ స్వరూపం. దాని ఆధారంగానే వారి దేవతల సృష్టి జరిగింది. అవే ఆరాధనలు. అవే నమ్మకాలు, జానపదులకు వారసత్వపరంగా సంక్రమించాయి. అందువల్లే జానపదుల మతంలో పురామానవుడి భావనలకే, పెద్దపీట, ఇవి వాస్తవమైన నమ్మకాలా, కావా! వాటివల్ల సామాజిక పరిస్థితులకు కల్గేలాభమేమిటీ ? వంటి ప్రశ్నలతో జానపద విజ్ఞాన పరిశోధకుడికి అవసరం లేదు. పరిశోధకుడి ఆలోచన ధ్యేయం, విధానం జానపదుడి మనస్తత్వ పరిశీలన గమనించటం. వాటిని యధారూపంలో, బయటి ప్రపంచానికి తెల్పటమే. జానపదుడి సాహిత్య సంపదలో, దాగి ఉన్న మౌలిక మత అంశాలే, సామెతల్లో కూడా కన్పిస్తాయి. అవి ప్రాచీన మానవుడి ఆలోచనల నుండి సంక్రమించినవే అని తెలుస్తుంది. ఆదిమ మానవుడి మాతృదేవతారాధన మొదలుకొని, ఆధునిక జీవన నాగరికతలోని మత సంఘర్షణ వరకు, అన్ని అంశాలు, సామెతల్లో కనిపిస్తాయి. ఇవి ఒక విధంగా మతపరిణామ చరిత్రకు సాక్ష్యాలుగా కూడా నిలుస్తాయి.

శైవవైష్ణవ సంఘర్షణకు, మతమార్పిడిల కాలాన్ని గుర్తుచేస్తున్న సామెత " జంగాలా ! దాసరులా! ముందూరుబట్టి " ఒకనాటి చారిత్రక సామాజిక పరిస్థితులకు అద్దం పడుతుంది. శైవ, వైష్ణవాల మధ్య స్పర్థలు ఏర్పడినప్పుడు - వాటి ఉధృతికి, పోరాటాలకు సామాన్య జనం తల్లడిల్లేవారు. వారు, నేర్పుతో తమ మత సిద్ధాంతాన్ని కప్పిపుచ్చి జీవించే అవసరాలు కూడా ఏర్పడేవని, పై సామెత స్పష్టం చేస్తుంది. ఇక బలవంతంగా, మతమార్పిడి జరిగేదని ఈ " బలిమీటికి లింగం కడ్తే భక్తుడు కాడు" "నడుమంత్రం వైష్ణవానికి నామాలు మెండు" సామెతలు వివరిస్తాయి. మరో వైపు గ్రామదేవతల ఆరాధనలు, కొలువులు, గ్రామీణ సమాజాన్ని, ముంచెత్తేవి. నాటి గ్రామీణ వ్యవస్థ మొత్తం, గ్రామదేవతలు - మంత్రతంత్రాలు, వంటి వాటి చుట్టూ తిరిగేది, అదే జానపదుల మతం వీటి ప్రభావం. నాటి విద్య, వైద్యం పరిపాలనా వంటి రంగంపై ప్రభావం చూపేదంటే అర్థం చేసుకోవచ్చు, నాడు మత ప్రమేయం లేని వేడుకలు, పండుగలు, ఆచారాలు, ఉండేవి కావని తెలుస్తుంది. ఒక విధంగా గ్రామీణ వ్యవస్థలో పూజారి, మాంత్రికుడు, లేదా పురోహితుడు, రాజు తర్వాత, లేదా

పాలకుల తరువాత పాలకులవలె వ్యవహరించేవారు, ఇక్కడ జానపద విజ్ఞాన పరిశోధకుడు జాగ్రత్తగా పరిశీలిస్తే, నాటి గ్రామీణ సామాజిక చరిత్ర పూర్తిగా అర్ధం చేసుకోవచ్చు. గ్రామీణ సమాజంలో మతం అన్నా ఆరాధన అన్నా తల్లి దేవతలే, వారే గ్రామదేవతలు, పోచమ్మ, మైసమ్మ, పోలేరమ్మ వంటి దేవతలు. వారు పురజనులను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. అయితే ఈ దేవతల ఆగ్రహానికి మాత్రం దూరంగా ఉండాలి. అందుకే కొలువులు, జాతరలు, ఊరేగింపులు, ఊరడి పండుగలు - రోగాలు వచ్చినా, వివాహం కాకపోయినా, మరో రకమైన కష్టము దరిచేరినా, ముందుగా చేయాల్సింది, గ్రామ దేవతారాధన. ఈ ఆరాధన కూడా వ్యక్తిగతంగా నిరాడంబరమైంది, సామూహికంగా మాత్రం ఊరు ఉమ్మడి జనం కొలువుల పేర ఎంతో వైభవంగా నిర్వహిస్తారు, వాటివల్ల గ్రామదేవతలు ఊరు ఉమ్మడి సమస్యలైన, కరువు కాటకాలు, గత్తర(కలరా) వంటి వ్యాధుల నివారణ, పశువుల రోగాల నుండి విముక్తి వంటి వాటిని తొలగిస్తారని గ్రామీణ సమాజం నమ్మకం. జానపద మతం, వివిధ రూపంలో నుండి ఏర్పడిన భయమే ప్రాతిపదికగా ఏర్పడింది. అందుకే, చనిపోయిన వారి ఆత్మలు, బతికివున్నవారి చుట్టు పరిభ్రమిస్తుంటాయని, వాటిని నిర్లక్ష్యం చేస్తే అవి, అందరికి రోగాల రూపంలో, కరువు కాటకాల రూపంలో నష్టం కల్గచేస్తాయని నమ్మేవారు. అందుకై చనిపోయిన వారిని ప్రతిచోట స్మరించుకోవాలనే లక్ష్యంతో పితృదేవతల ఆరాధన రూపంలో భాగంగా, మాసికాలు, తద్దినాలు, పెద్దలకు బియ్యం ఇవ్వటం వంటి ఆచారక్రియలు ఏర్పడ్డాయి. ఇవన్నీ సామెతల్లో వ్యక్తీకరించటం కనిపిస్తుంది, మత పరిణామం ఈ క్రింది విధంగా సామెతల్లో వివరించాను.

**(A) ఆత్మారాధన** (Aninisam) ఇందులో

**1 జీవాత్మవాదం** (Aninisam)

**2 పిశాచారాధన** ( Demon cult )

**3 పితృదేవతారాధన** ( Ancestors worship )

వాటిని ఈ సామెతలు ఉదహరించవచ్చు.

" దెబ్బకు దయ్యం వదుల్తది" ( ఆత్మారాధన)
" చుట్టు చుట్టుకు కడుపు పట్టి చూచుకుంది ".

(రావిచెట్టు చుట్టు స్త్రీలు సంతాన కాంక్షకై ప్రదక్షిణాలు చేయటం ఆచారం వెనుక జీవాత్మ వాదం - చెట్టు పవిత్రం అనే భావన ఉంది. ) " ఆడబోయిన తీర్థం ఎదురైనట్లు" ( నీరు పవిత్రం - పుణ్యతీర్థాల్లో, గుండాల్లో, నదుల్లో స్నానం చేయాలనే నమ్మకం ఇందులో కనిపిస్తుంది. ఇది కూడా జీవాత్మ వాదమే మరి.

" దాగవోయిన చోట దయ్యాలు పట్టుకున్నట్లు "
"చుట్టమైవచ్చి దయ్యమై పట్టిండు" ఈ సామెతలు ఒక వైపు సంఘటనలు, వ్యక్తి స్వభావాలు, వివరిస్తూనే మరోవైపు అంతర్గతంగా సామాజిక మానవుల ఆచార వ్యవహారాలు వెలువరించటం ఎంత గొప్ప సృష్టో తెలుస్తుంది. జానపద విజ్ఞాన పరిశోధకుడు, మిగతా జానపద విజ్ఞాన ప్రక్రియల వలె గాక 'సామెతలు' అధ్యయనం చేసేటప్పుడు, విశ్లేషించేటప్పుడు, సామాజిక శాస్త్రాల అవగాహన, మానవపురా - భావనల చరిత్ర క్షుణ్ణంగా తెలుసుకోగలగి ఉండాలి. పై సామెతలు పిశాచారాధన ( Demon cult ) ఆచారాన్ని వర్ణిస్తాయి. అదే విధంగా అపరకర్మలు, శ్రాద్ధం, మాసికం, పిండాలు పెట్టడంవంటి ఆచార వ్యవహారాలు, పితృదేవతారాధన ( Ancestors worship ) చెందినవి. వీటిని ఈ క్రింది సామెతలు గుర్తుచేస్తాయి.

"తల్లినన్న చూపెట్టు తద్దినమన్నా పెట్టు"
" తన కూటికి దారి లేదు, తనవారికి తద్దినాలు" ( వాటి ప్రాముఖ్యత తెలుపుతుంది)

"పెడితే పెండ్లి లేకుంటే పిండాకుడు "
మందుకు వెళ్ళిన వాడు మాసికానికొచ్చినట్లు" ఒకవైపు మానవనైజం మరోవైపు సాంఘీకాచారం నింపుకున్న సామెతలు, సామాజిక దర్పణాలు అనటానికి చక్కని ఉదాహరణ. ఇక మాంత్రిక చర్య ( Magic cult ) వివరించే సామెతలు - గ్రామీణ సమాజంలో వాటి ప్రాముఖ్యత గుర్తుచేస్తాయి.

" దేవుడికి ముడుపు దయ్యానికి మంత్రం" అని సామెత వివరిస్తే మరోవైపు మరో సామెత. " మంత్రాలకు చింతకాయలు రాలవు " అని విమర్శిస్తుంది. ఏమైనప్పటికి, మంత్రాలపై విశ్వాసం మాత్రం సామాన్యజనంలో ఎక్కువే అని

సామెతలు వివరిస్తాయి. తాంత్రిక చర్య అటువంటిదే కొందరు ఈ చర్యల వల్ల గ్రామీణ జీవనంలో అధికార దర్పంతో వెల్లిపోయేవారు " మంత్రం రాకపోయిన తంత్రానికి కొదువ లేదు " మంత్ర తంత్రాలు రెండు ముఖ్యమైనవే, అయినప్పటికి, బతుకుదెరువు ఆధారంగా ఉన్నప్పుడు దేంతోనైన జీవించేవారు ఈ మతవిశ్వాసాల్లోని భాగమే. చిన్న పిల్లలకు వ్యాధులు వస్తే, బాధలు తొలిగిపోవాలంటే, 'రక్షరేకులు' కట్టె సంప్రదాయం దాన్ని ఈ " రక్షలు పోతే మచ్చలు పోతాయా " సామెత వర్ణిస్తుంది. అదే విధంగా శకునాలు, గోత్రాలు, వంటి అంశాలతో కొన్ని సామెతలు కులదేవతారాధన ( Tolemism ) చెందిన ప్రాచీన మతసంప్రదాయాన్ని వర్ణిస్తాయి

శకునాల్లో ' పిల్లి' శకునం చెడ్డదని భావన

" పిల్లిని చంకన పెట్టుకుని పెండ్లికి పోయినట్లు" సామెత, పిల్లి అపశకునం అనే భావన వివరిస్తుంది.

బల్లి గురించి అందరికి తెల్సిందే ' శకునం చెప్పే బల్లి కుడితిలో పడ్డట్టు" వంటి సామెతలు, బల్లి పలుకు నిజం అవుతుందని, జనం నమ్మేవాళ్ళు గోత్రాలు కూడా జానపద మతంలో, ఒక అంశం. వీటిని ప్రసక్తి సామెతల్లో కన్పిస్తుంది " గోత్ర మెరిగి పెండ్లి, పాత్ర మెరిగి దానం" ఇందులో పెండ్లికి, గోత్రాలు చూడటం ముఖ్యమైన భావన ఉంది, ఒకే గోత్రం కల్గినవాళ్ళు ఒకే రక్తసంబంధీకులు కాబట్టి, వారంతా, 'అన్నా చెల్లండ్ల' వరుస వారి వివాహం నిషేధించారు దాన్ని అంతర్గతంగా వివరిస్తుందా సామెత

**మాతృ ఆరాధన :** ( Mother worship ) ఈ అరాధన ప్రక్రియ, తల్లిదేవతల ఆవిర్భావంతో మొదలైంది. గ్రామదేవతలన్నీ తల్లిదేవతలే, ఈ దేవతల ఉనికిని, అరాధనను వివరించే సామెతలెన్నో కన్పిస్తాయి పోచమ్మ, మైసమ్మ, పోలేరమ్మ, బాలమ్మ, వంటి తల్లిదేవతలను గ్రామీణ సమాజం పూజించేది పోచమ్మ, మశూచి దేవతగా భావించేవారు, పోచమ్మ ఆరాధన వల్ల వ్యాధులు తొలిగిపోతాయని అమెకు 'కల్లు' అంటే ప్రీతి అని గ్రామీణ సమాజం ఈదుల్లో, తాటివనంలో ఆమెకు గుడి నిర్మించేవారు దాన్ని ఈ " అగడుమాలిన పోచమ్మ ఈదుల్లో గుడిసేసింది " సామెత వివరిస్తుంది - ' మైసమ్మ' పశులకాపాడే దేవత ' మహిషమ్మ ' అందువల్ల

ఈమె ఆరాధన పశువుల వ్యాధులు ప్రబలకుండా నిర్వహిస్తారు. మాయలు మంత్రాలు ఎక్కువ అందుకే, " పోచమ్మ కూడవెత్తే, మైసమ్మ మాయంచేసే " సామెత పుట్టింది. అంతేగాకుండా ఆయా వ్యక్తుల స్వాభావిక లక్షణాలు వర్ణించటం ఈ సామెత ప్రత్యేకత. ఈ దేవతలంతా, ఇంటి దేవర్లుగా గౌరవాన్ని పొందగా, పొలం దేవర్లుగా గ్రామదేవతలు పూజలందేవారు ఈ " ఇంటిదేవర ఈగి చస్తే, పొలం దేవతకు గంపజాతర" సామెత వివరిస్తుంది. పైగా, ఇంటి దేవరల కంటే, పొలం దేవతల పూజాపునస్కారాలే ప్రాముఖ్యత వహించేవని ఈ సామెత వివరిస్తుంది. జానపద మతారాధనలో, మరొక అంశం - బలులు, దేవతల నైవేద్యం, మానవుని అభిరుచులకు అనుగుణంగానే ఉంటుంది, జానపదులు తాము మక్కువ చూపే, మాంసాహారం, కల్లు, సారా, వంటి వాటినే వారి దేవతలకు నైవేద్యంగా సమర్పిస్తారు. అవే దేవతలకు ప్రీతికల్గచేసి తమకు వరాలు ఇస్తారని భావిస్తారు. అందుకే, 'బలి' సంప్రదాయం పుట్టింది. " తెగేదాకా బలిస్తడు" అనే సామెత, విచిత్రంగా రెండు విషయాల్ని వివరిస్తుంది, ఒక సామెత, అనేకార్థాలు, విశేషాలతో కూడుకొని ఉంటుందని జానపద విజ్ఞాన పరిశోధకుడు గుర్తుంచుకోవాలి, ఈ సుప్రసిద్ధ సామెతలో ఒక వైపు సాంప్రదాయ సిద్ధమైన 'బలి' ఆచారం మరోవైపు తాడు గట్టిగా బిగుసుకోవటాన్ని తెలంగాణాలో ' బలి ఇచ్చుడు ' అంటారు. తాడు గట్టిగా బిగిస్తే, తెగిపోతుంది కదా, వ్యవసాయ పనుల్లో ' తాళ్ళు' బిగుసుకోవటాన్ని ఈ ' బలి ' పదం ద్వారా సూచించటం వెనక సంప్రదాయం. నుడికారం రెండు కల్సిపోయి కన్పిస్తాయి. ఇటువంటి సామెతలు సామాజిక ధర్మాల్ని ప్రతిబింబించాయి.

గ్రామదేవతల, ఆరాధనలో ఎన్నో అంశాలు ఉన్నాయని, సామెతలు చెప్తాయి. సామెతలు, జనజీవన వాహికలు, అనటానికి ఇవి ఉదాహరణలు మాత్రమే. శివశక్తుల, ప్రమేయం శివారాధనలోనే కాదు, గ్రామదేవతల ఊరేగింపుల్లో జాతర్లలో, కొలువుల్లో తప్పనిసరి, ఇదో రకమైన భక్త్యావేశానికి చెందిన మానసిక స్థితి, ఈ స్థితిలో వ్యక్తికి, దైవం పూనుతాడని, దాన్ని ' పూనకం ' అంటారు. ఈ శక్తి గల్గినవారినే శివశక్తులు, శివసత్తులు, శిగమూగేవాండ్లు - శివాలవాండ్లు అనే పేర వ్యవహరిస్తారు. వీరు వీరావేశంతో దైవారాధనలో మునిగిపోతారు. ' అర్ధరాత్రి వేళ అంకమ్మ శివాలు ' సామెత గ్రామదేవతారాధనలో శివమెత్తే సంప్రదాయం

చెప్తుంది. ఒక్క మతానికి చెందిన సామెతలు సమగ్రంగా శోధిస్తేచాలు. పురా మానవుని భావనలు ఆర్యదేవతలూ మతమార్పిడులు, మతావేశపూరిత ఉద్యమాలు, పుణ్యక్షేత్రాలు, ఆరాధనా విధానంలో, పవిత్ర పస్తువులు, పాపపుణ్యాలు, స్వర్గనరకాలు, వంటి అనేకానేక విషయాలు తెలుస్తాయి. వీటిని ' తెలుగు సామెతలు - జానపద సంస్కృతి ' నా సిద్ధాంతవ్యాసంలో సమగ్రంగా చర్చించటం జరిగింది.

కొన్ని సామెతలు మానవునిలో మూఢనమ్మకాల్ని ఎలా వివరిస్తాయో చూడండి. " కాలు తొక్కిన వేళ,కంకణం కట్టిన వేళ' వివాహానికి చెందిన నమ్మకం. ' రామేశ్వరం పోయినా శనేశ్వరం తప్పదు ' గ్రహగతులు వర్ణించే నమ్మకం. ' అష్టమినాడు కష్టాలు తప్పవు ' తిథులకు చెందిన నమ్మకం, ' బుధవారం పులి కూడా పయనం చేయదు" వారాలకు చెందిన నమ్మకం. ఈ విధంగా, ఎన్నో విషయాలు వివరించవచ్చు. సామెతలు మరోవైపు మన సంప్రదాయంలోని అనేకానేక పౌరాణిక గాథల్ని కూడా తమలో ఇముడ్చుకొని, తరతరాలకు, భారతీయ ఐతిహాసిక ప్రచార కర్తవ్యం కూడా నిర్వహిస్తున్నాయి. అతి సంక్షిప్త పద జాలంతో అపూర్వమైన విషయాన్ని వివరించటం సామెతల ప్రముఖ లక్షణం అని గుర్తించాలి. దానికి ఉదాహరణ - రామాయణాన్ని "కట్టె కొట్టె - తెచ్చె" అనే మూడు పదాల్లో వివరించే సామర్థ్యం, జానపద పదగుంఫన శైలి అందామా ! అదే విధంగా ఒకే సామెత, ఒకవైపు రామాయణం, మరోవైపు భారత ఇతిహాస, సారాంశం స్పష్టపరచటంలోనే సామెతల సృష్టి, తెలివికి చెందిన భాషా ప్రక్రియ ఉందని గుర్తించవచ్చు. " రామాయణం రంకు భారతం బొంకు " సామెత అటువంటిదే.

ఇక శాస్త్ర సాంకేతిక విషయాలకు సామెతల్లో కొదువలేదు. వాతావరణం, వ్యవసాయం, పశువైద్యవిషయాలు, చదువు-సంధ్యలు - వైద్యం, ఒకటేమిటీ అన్నీ సామెతల్లో కనిపిస్తాయి.

వ్యవసాయం గురించి, కష్టపడితేనే ఉత్తమ ఫలితం అనే సూక్ష్మ ధర్మం ఈ " ఏడ్వనేరిస్తేనే వ్యవసాయం " సామెత వివరిస్తుంది. అదను మీద వ్యవసాయం అవసరమని " ఆషాడ మాసాన అటు ఇటు తిరిగి కార్తీక మాసాన కంటికి నీరు తెచ్చుకున్నదట" సామెత వర్ణిస్తుంది - కార్తులు, ఋతువులు - చాల జాగ్రత్తగా

పరిశీలించి వ్యవసాయం కొనసాగించాలని " భరణి కురిస్తే ధరణి పండుతుంది" సామెత " తొలకరి వానలు మొలకలకు తల్లి" సామెత వర్షానికి గల ప్రాముఖ్యత వర్ణిస్తాయి. " చేనుకు చేయవల్సిన పనులు, విధిగా చేయాలని," " కలుపుతీయని మడి పూజలేని మడి " అన్నారు. వ్యవసాయానికి, పంటమార్పు రైతులకు కలిమి అనే దృక్పథం అనుభవం ద్వారా రైతు సాధించిందే మరి " పైరు మార్చిన పంట పెంపు" సామెత చెప్తుంది. రకరకాల వ్యవసాయ దినుసులు, ఎప్పుడు ఎలా పండించాలో సామెతల్లో సమగ్రంగా వివరించారు. అదే వారి వ్యవసాయానికి మూలాధారంగా నిలిచే పశువులకు, వారు సంపదగానే భావించారు, పూజించారు, అందుకే గ్రామీణ ప్రాంతంలో పశువుల గురించి ఏకంగా 'కనుము' పండుగ సంక్రాంతి తర్వాత ప్రత్యేకంగా ఏర్పాటుచేసి, పశువుల ఆరాధన భావంతో చూచారు - " పశువుంటేనే కసువు", " ఎద్దు లేని సేద్యం చద్దిలేని పయనం" వంటి సామెతలు పశువుల విశిష్టతలను చెప్తాయి. పశువుల వ్యాధులు, చికిత్సలు కూడా గ్రామీణ జనానికి పూర్తిగా తెలుసు. " దొమ్మరోగానికి కొర్రగంజి " వంటి సామెతలు, ఈ విషయాన్ని వివరిస్తాయి. " అజీర్తికి ఆవకాయ మందు" "ఆముదాల బేరం కామెర్ల రోగం " నమ్మదగనివని అంటారు. " పడిశం పది రోగాల పెట్టు " అని హెచ్చరిస్తారు. మనోవ్యాధులు మంచివి కావని, వీటికి మందు లేదని భావించేవారు, ఆధునిక వైద్య శాస్త్రం ఎట్లున్నప్పటికి, గ్రామీణ సమాజం మాత్రం " మనోవ్యాధికి మందులేదని" భావించింది. అయితే వ్యాధులకు చిన్న చిన్న చిట్కా వైద్యాలు పాటించేవారు. ' కరక్కాయ కన్న తల్లి" అని చాలా రోగాల్లో ' కరక్కాయ ' ప్రాముఖ్యత వర్ణించారు. ఆహారంలో ఉల్లి ప్రాధాన్యతను " ఉల్లితల్లి లాంటిది " సామెత చెప్తుంది. ఎన్ని వ్యాధులు, బాధలున్నా తమ పరిధిలోనే పరిష్కరించే సహనం జానపదులది, చివరికి, ' ఉపవాసం' ఉత్తమ చికిత్సగా చెప్తారు. భోజన విధానం సరిగా ఉండాలనే ఈ " తిననేర్చిన వాడికి రోగం రాదు " అని స్పష్టంగా వివరించారు. ఇక సాధ్యం కాదనుకున్నప్పుడు, వ్యాధి ఇబ్బందులు పెత్తే " ఉపవాసం రోగానికి ఉపశమనం" గా భావించారు. ఇక మనస్తత్వ విషయాలు జంతువులు, పశుపక్ష్యాదులు వంటివెన్నో సామెతల్లో మనకు కనిపిస్తాయి, మౌఖిక సాహిత్యం, జానపద సాహిత్యంలో శిష్టసాహిత్యం తీసిపోదని ఈ సుదీర్ఘమైన ఉదాహరణలు ఇవ్వటం. ఇక హితవులు, సూక్తులు, విద్యావ్యాప్తికి అనుసరించిన

మార్పులు ఎన్నో సామెతల సొత్తు, పెద్దల మాట పాటించాలనే ఈ సామెత అందరికి తెల్సిందే. " పెద్దల మాట చద్దిమూట " జీవితంలో ఓర్పు ఎంతో అవసరమని ఈ "తొందరపడితే బొందల పడ్తవు " సామెత ముందు జాగ్రత్తగా హెచ్చరిస్తుంది. అప్పులు చేయరాదని " అప్పులేని కూడు దొప్పెడైనా చాలు " సామెత వర్ణిస్తుంది. ఉపాయంతో జీవితంలో ముందుకు సాగాలని " ఉపాయం లేనోడు ఉపాసముంటడు " సామెత ద్వారా వివరించారు. ఆడంబర జీవితం మంచిదికాదని" గొప్పలకు పోతే తిప్పలు తప్పవు" సామెత వర్ణిస్తుంది. సామెతలు, ఆర్థిక సామాజిక నీతి సూత్రాలెన్నో ఉదహరిస్తాయి. జానపదుల జీవిత దర్పణాలు. ఈ సామెతలు "పొద్దటిది పొట్టకు మాపటిది బట్టకు", " కూటి కోసం కోటి విద్యలు". జానపదుల రాజకీయ జీవన విన్యాసాలు, సామెతల్లో ఎన్నో చోట్ల ప్రస్తావించటం గమనించవచ్చు. జానపదులు, పాలకులు అంటే రాజులనే అనుకుంటారు కలిమి ఉన్నవాళ్ళను కూడా " వాళ్ళకేం మారాజులు " అని పోలిక చెప్పటం కనిపిస్తుంది. అందువల్ల రాజులు అంటే కేవలం రాజ్యాలు పరిపాలించిన వాళ్ళే కానవసరం లేదు. ఈ అధునాతన భావనకు దగ్గరగా ఉన్న సామెత గమనించండి. " రాజు రాకడలేదు తొవ్వ నూకుడు లేదు" నేడు కూడా ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులు పర్యటించేటప్పుడు ఏర్పాట్లు గమనించండి. ఈ సామెత ఎంత నిత్యనూ "ఎద్దుకు ఎగేస్తడు, బర్రెకు సగేస్తడు" సామెతలో స్పష్ట పర్చారు. మరో పాలకుని నీతి " సాలుచెప్పు దొర అంటే దుడ్డె బర్రె నాదన్నడు " సామెతన వివరించారు.

సామెతల్లో అసంఖ్యాకమైన విషయ వివరణలు గమనించినప్పుడు, వీటిని మరెన్నో ఉపవిభాగాలుగా వింగడించి పరిశోధించవచ్చని తెల్సింది. భావి విజ్ఞాన పరిశోధకులు ఈ పనిపూర్తి చేస్తారని ఆశ. భాషాపరంగా, సామెతలు, వర్గీకరించడం కనిపిస్తుంది.

1) పూర్తి వాక్యాలు

2) విద్యావంతుల నాగరిక వాక్యాలు

3) అనుప్రాసలు

4) అసంపూర్ణ వాక్యాలు

5) క్రియలతో కూడినవి, క్రియలులేనివి

6) ఉపమలు

7) ఉపమాన వాక్యాలు

8) ఆధునిక హాస్యాలు

ప్రపంచమంతటా, సామెతల మీద విజ్ఞానదాయకమైన సమగ్రమైన పరిశోధనలు జరిగాయి. మనదేశంలో కర్నాటక, కేరళ రాష్ట్రాల్లో వాటి గురించి ప్రయోగాత్మక పరిశీలన జరిగింది. తెలుగు భాషలో మాత్రం అంతగా కృషి జరుగలేదు. పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసాలు వచ్చినంత మాత్రాన అది పరిపూర్ణ పరిశోధనకాదు అందువల్ల, ఒక సంస్థ చేయదగ్గ పని, సామెతలకు 'సంపూర్ణ విజ్ఞాన కోశం' సిద్ధం చేయటం. సామెతలకు సమగ్ర నిఘంటువు రూపంలో, విజ్ఞానకోశం నిర్మించటం వల్ల, మన జాతి చరిత్ర, సంస్కృతి, ముందు తరాల వారికి పదునైన సంక్షిప్త వాక్యాల ద్వారా చెప్పగలుగుతామని భావించవచ్చు.



# జి) పొడుపు కథలు

జానపదుల్లోని హాస్యచతురత, వివేకం పొడుపుకథల్లో ప్రతిబింబిస్తాయి. వచనరూపంలో 'చాపచుట్టలేం, చంక బెట్టలేం" ( ఆకాశం)

'జొన్నచొప్పలో చుప్పనాతి ' ( తేలు) వంటివి.

**గేయరూపంలో :** ' చెక్కని స్థంభం చేతికందదు ' (కవ్వం)

"చెయ్యని కుండ పొయ్యని నీళ్ళు వెయ్యని సున్నం తియ్యగనుండు" (కొబ్బరికాయ) వంటివి కన్పిస్తాయి. కొన్ని పొడుపు కథలు సామెతలవలె కూడ కన్పిస్తాయి. 'కట్టె, కొట్టే తెచ్చె' దీనికి అన్నట్లు అనే పదంచేరిస్తే సామెత కూడా అవుతుంది. అలాగే కొన్ని పొడుపుకథలు, సామెతల రూపాన్ని పోలివుంటాయి.

'పొట్టోనికి పుట్టెడంగీలు ( ఉల్లి )' పొట్టోనికి పుట్టెడు బుద్ధులు' ( సామెత ) ఏలపాటల్లో, కోలాటపాటల్లో, సామెతల్లో ఎన్నో పొడుపుకథలు కనిపిస్తాయి. భారతంలోని యక్ష ప్రశ్నలు, కథలు పొడుపుకథల వంటివే. చిత్ర కవిత్వంలో కూడా పొడుపు కథల ఛాయల్ని గమనించవచ్చు. సామెతలవలెనే పొడుపు కథలు కూడా ఆదిమమానవుల వివేక చమత్కారానికి ప్రతీకలు. అయితే సరళత దృష్టితో చూసినా, సామాజిక దృష్టితో చూసినా, గేయం, సామెత వంటివి పొడుపు కథలకంటే ముందు పుట్టాయని చెప్పవచ్చు. అందువల్ల ఆదిమమానవుని ఆలోచనా క్రమంలోని వికాసమే పొడుపుకథల పుట్టువు అని ఊహించవచ్చు. సహజత్వం, సరళత్వం ప్రాంతీయభాషా దృష్టి వీటి ప్రాతిపదికగా సామెతల వలననే పొడుపు కథల్ని కూడ శిష్టులవి, జానపదులవి అని వర్గీకరించవచ్చు.

పొడువుకథల్లోని విషయప్రాధాన్యతను బట్టి ఈ క్రిందివిధంగా వర్గీకరించవచ్చు.

1. వస్తువులు : ' అడవిలో అంబోతు రంకె వేసింది ' ( గొడ్డలి )
2. ప్రకృతి : ' చాపచుట్టలేం చంకబెట్టలేం' ( ఆకాశం )
   ' ఊరంతా ఒక్కటే దుప్పటి ' ( ఆకాశం )

3. శరీరం : ' అన్నకందవు అమ్మకందుతాయి ' (పెదవులు)
' కిట కిట తలుపులు కిటారు తలుపులు ఎంత మూసినా చప్పుడుకావు
(కనురెప్పలు)

4. జంతువులు : ' నడిచిపోయే నల్లరాతికి నాలుగే లింగాలు' (గేదె)

పొడుపు కథల్లోని విషయ ప్రాధాన్యత బట్టి - వివిధ వర్గీకరణలు కనిపిస్తాయి... అయితే, వస్తు వైవిధ్యాన్ని బట్టి వర్గీకరించటమే శాస్త్రీయ పద్ధతిగా తోస్తుంది. అటువంటి వర్గీకరణ ఈ విధంగా చేయవచ్చు.

1) వస్తు విశేషాలు 2) ప్రాకృతిక విశేషాలు 3)మానవ శరీరావయవాలు

4) జంతు విశేషాలు 5) మానవ మనస్తత్వ విశేషాలు 6) వైద్య విశేషాలు

డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి గారు తమ పొడుపు కథలు ఒక పరిశీలన వ్యాససంపుటిలో పొడుపు కథల్ని ఈ క్రింది విధంగా వర్గీకరించారు. వారు పొడుపుకథల్ని ప్రహేళికలనే పేర్కొన్నారు.

1) గృహ జీవన ప్రహేళికలు 2) శ్రామిక జీవన ప్రహేళికలు
3) ప్రకృతి సంబంధి ప్రహేళికలు 4) తిర్యక సంబంధి ప్రహేళికలు
5) క్రీడావినోద ప్రహేళికలు 6) తాత్విక ప్రహేళికలు
7) అస్పష్ట ప్రహేళికలు 8) ఆత్మాశ్రయ ప్రహేళికలు
9) శాస్త్ర విజ్ఞాన ప్రహేళికలు

వీటితోపాటు పిల్లల పొడుపు కథల్ని ప్రత్యేకంగా వివరించారు. పొడుపు కథలు - సామెతలతో దగ్గరి సంబంధం కలిగి ఉంటుంది, ఉండాలి. మౌలికంగా రెండూ జానపద భాషాసంబంధ విషయాలే. అంతేగాకుండా యుక్తి చమత్కృతికి సంక్షిప్తతకు కూడా ఈ రెండు పోలిక కలిగి ఉంటాయి. అయితే ' ప్రశ్న' లక్షణం, పొడుపుకథల సొంతం. ప్రశ్న - జవాబు రెండూ, సామెతలో కనిపించే ప్రముఖ లక్షణం. అంతే గాక కొన్ని 'పొడుపు సామెతలు' ఉన్నవని కూడా డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి గారు పేర్కొన్నారు, వాటిలో, సామెతలు - పొడుపుకథలు, కలసిపోయి కన్పించటం విశేషం. 'చక్కనమ్మ చిక్కినా అందమే' ఒకవైపు సామెతగా కన్పించినా మరోవైపు ( సబ్బు ) అర్థాన్నిచ్చే పొడుపు కథగా ఉదహరించారు, ఇటువంటి

ఉదాహరణలు, మనకు ఇటు సామెతల్లో అటు పొడుపు కథల్లో కన్పించి, వాటి మధ్యగల 'చుట్టరికాన్ని' గుర్తుచేస్తాయి. అంతెందుకు, కొన్ని సామెతలు పొడుపు కథల్లో కూడా కనిపిస్తాయి. " తాతాచార్య ముద్ర భుజం తప్పినా వీపు తప్పదు " ఇందులోని శ్లేష, చారిత్రకంగా, గొప్ప విషయాన్ని, ఒకనాటి వైష్ణవ ఆధిక్యాన్ని వివరిస్తుంది, ఇందులోని విశేషమే దాన్ని సామెతతో పాటు పొడుపుకథల్లో కూడా ఉదహరించటానికి కారణమయిందని ఊహించవచ్చు.

పొడుపుకథల్లోని విషయ వివరణను బట్టి కొన్ని ఉదాహరణలు గమనించవచ్చు. వాటిల్లో ప్రశ్నలో కాకుండా సమాధానంలోని విషయాన్ని బట్టి వర్గీకరించవచ్చు.

1) **వస్తు విశేషాలు** :- మనం జీవితంలో వాడుకునే వస్తు విశేషాలు ఇందులో వివరించవచ్చు. "అడవిలో అంబోతు రంకె వేసింది" ( గొడ్డలి)

నున్నటి బండమీద - నూగులు ఎండబోసే

నాలుకలేని పాము -నాక్కొని పోయే - (మంగలి కత్తి)

2) **ప్రాకృతిక విశేషాలు** :- మన చుట్టూ గల ప్రకృతి, పర్యావరణం, వాతావరణం, వంటి విశేషాలు వివరించవచ్చు.

"ఊరంతా ఒకటే దుప్పటి " ( ఆకాశం)

" అడవిలో అక్కమ్మ పసుపు గుడ్డలు ఆరేసుకున్నది " (తంగేడుపూలు)

" రేపు మాపు మందు తాగాలి " (గాలి)

3) **శరీర అవయవాలు** :- మానవునిలోని శారీరక లోపాలు, అవయవ విశేషాలు ఇందులో వివరించవచ్చు.

" అన్న కందవు అమ్మకందుతాయి" (పెదవులు)

" కిటకిట తలుపులు కిటారు తలుపులు ఎప్పుడు తీసినా చప్పుడుకావు"

(కంటిరెప్పలు)

4) **జంతు విశేషాలు** :- ఇందులో జంతువులకు చెందిన విషయాలు వివరించవచ్చు.

" నడిచి పోయే నల్లరాతికి నాలుగే లింగాలు " (గేదె)

" ఉద్యోగం సద్యోగం లేదు ఊరంతా వ్యాపకమే " ( కుక్క)

**5) మానవ మనస్తత్వ విశేషాలు :-** ఇందు మనిషి స్వభావం, విభిన్న తత్వాంశాలు వివరించవచ్చు.

" చచ్చేదాక చావనిది " ( మనిషిలోని ఆశ )

" వెంట రావద్దంటే ఎత్తుకొమ్మని ఏడ్చాడట " ( చిన్నపిల్లల స్వభావం)

**6) వైద్య విశేషాలు :-** జానపద జీవితంలోని వివిధ అంశాలు, అన్ని ప్రక్రియల్లో ప్రస్తావించినట్లుగానే, పొడుపు కథల్లో సైతం కనిపిస్తుంది, కాకపోతే పొడుపు కథలు చిక్కు ప్రశ్నల్లాంటివి కాబట్టి కొంత ఇబ్బందిగా ఉన్నా, విప్పేవారుంటే, పొడుపు కథలు తేలికే.

" వంకర టంకర 'శొ' (శొంటి) వాడి తమ్ముడు 'అ' (అల్లం)

నల్ల గుండ్ల 'మి' (మిరియాలు) నాకే మిస్తవు 'తే' (తేనే)

ఈ వస్తువులు ఆయుర్వేద వైద్యంలో ' చిట్కాలుగా' ఉపయోగిస్తారు. వైద్య సంబంధమైన విషయాల్ని పొడుపు కథల్లో పొందుపర్చారని చెప్పటానికి ఇది చక్కటి ఉదాహరణ.

పొడుపు కథల ప్రయోజనం - ఎదుటి వ్యక్తి తెలివితేటల్ని పరిశీలించటం వాటికి సమాధానాలు తెలియచెప్పటం, ఈ విధంగా భాషాజ్ఞానం పెంపొందించుకోవటం. మానవ మేధస్సుకు మరింత పదును పెట్టేలా తీర్చిదిద్దటం.



# హెచ్) జానపద భాష

తెలుగు జానపదాల్లో నిఘంటువుల ముఖం చూడని మారుమూల పదాలు కొల్లలు. జానపదులు అలవోకగా, ఆశువుగా సృష్టించుకున్న పదాలు చూస్తుంటే, కొన్ని పరభాషా పదాలకు వారు చేసిన తెలుగు రూపకల్పన గమనిస్తే వారి స్ఫూర్తి ఎంతటిదో తెలుస్తుంది. కరీంనగర్ జిల్లాలో, ' స్కైలాబ్ ' శాస్త్రీయ నామానికి, ' ఇనపుగోల ' అని పేరు పెట్టారు. అంతటి భయంలో తట్టిన ఈ పద స్వరూపంలో, అదెంత వినాశం కల్గిస్తుందో వివరించారు. అదే విధంగా విమానానికి, ' గాలిమోటార్ అని, సైకిలుమోటరుకు, ' టుక్ టుక్ మోటార్ ' వంటి పదాలు, వారు సృష్టించుకున్నవే, ఇటువంటి పదాలు ఇంకా నిఘంటువులలోకి ఎక్కలేదు. ఇవే కాదు, సామెతలు, జాతీయాలు, అర్థవివరణకు నోచుకోకుండా జనపదాల గూళ్ళల్లో, జానపదుల నోళ్ళల్లో నక్కి ఉన్నాయి. ఇవి తెలుగు భాషకు సమగ్ర నిఘంటువు ఏర్పడే అవసరాన్ని, ముఖ్యంగా, 'జానపద పదనిఘంటువు' ఆవశ్యకతను గుర్తు చేస్తున్నాయి. ఈ విషయంలో ' మాండలిక వృత్తి పదకోశాలు' కొంత శ్రమించినా, వాటికి దొరకని ఎన్నో పదాలు జనపదాల్లో ఉన్నాయి. వాటన్నింటిని ప్రత్యేక దృష్టితో పరిశోధనా దృక్పథంతో సేకరించుకోవాల్సిన అవసరం ఉంది.

తెలంగాణా సీమలో నడిబొడ్డు ప్రాంతం కరీంనగర్ జిల్లా. ఈ జిల్లాలో నైసర్గికంగా ఇతర రాష్ట్రాల ఎల్లలు అంటని ప్రాంతం. ఒక వైపు ఆదిలాబాదు, మరోవైపు నిజామాబాద్, వరంగల్, మెదక్‌జిల్లాలు సరిహద్దులు కలిగిఉంది. ఉర్దూ పదాల సందడి మిగతా తెలంగాణా యాసలో కనిపించినా, మరాఠి, కన్నడ, తమిళ, భాషాపదాలు, కోస్తా, రాయలసీమ యాస అంటనట్టిది. అందువల్ల ఒకింతగా స్వచ్ఛమైన తెలంగాణా భాషకు ప్రతీకగా భావించవచ్చు. భాషా పరిశోధకులు, మాండలిక వృత్తిపదకోశాల విషయమై ఈ ప్రాంతాల్ని సంప్రదించటం జరిగింది. మొత్తం మీద జానపదుల జీవన వ్యాపారంలోనికి లోతుగా తొంగిచూస్తే ఎన్నో పదాలు సేకరించవచ్చు. ప్రత్యేకంగా నేను కరీంనగర్ జిల్లా గ్రామాల్లో సేకరించుకున్న భాషాసంపదనుండి కొంత పదజలాన్ని ఉదాహరిస్తాను. ఇవి

భాషా పరిశోధకులకు తప్పక ఉపకరిస్తాయి. అందుకే భాషావిశేషాల లోతుకు వెళ్ళకుండా పదాల స్వరూపాలను మాత్రం వివరిస్తాను. జానపద పదాలను కొన్ని ప్రధాన వర్గీకరణ వేసుకొని పరిశీలించాను.

ఇవి 1) వ్యవసాయ పదాలు ( పశువులు, పంటలు, మొ॥ పదాలు )
2) ఇల్లుకట్టడాలు, వస్తువులు వంటివి
3) ఆభరణాలు, అలంకరణలు
4) వృత్తి పదాలు
5) శరీర వర్ణనలు
6) పిల్లల పదాలు

1. **వ్యవసాయ పదాలు:** రైతులు వ్యవసాయ పనుల్లో సృష్టించుకున్న పదాలు, వారి వృత్తిని వివరించేవి, వారి వృత్తులకు ఉపకరించేవి అని రెండు విధాలు.

**(ఎ) వ్యవసాయ పనులు :**

1. మండెకట్టుట - వడ్లను నానపోసి గడ్డికప్పి పెట్టుట
2. అలుకుట - మొలకెత్తిన ధాన్యాన్ని పొలంలో చల్లి చేతితో అలుకుట
3. దున్నుట - నాగలితో భూమిని చదునుచేయటం
4. రొప్పుట - గొర్రుతో చదునుచేయటం
5. ఒడ్డుఒరం - మడిచేసిన భూమి అంచుకు ప్రతిఏట ఒడ్డు పెట్టుట
6. సాయ - చదునువేసిన భూమిలో నీరు పక్కలకు పోకుండా చిన్న అంచుపెట్టుట
7. పొతం - నేలను సాగుకు సిద్ధం చేయటం
8. ఇరువాలు - భూమిని రెండవసారి దున్నుట

**(బి) వ్యవసాయ పనిముట్లు :**

1. కర్రు - నాగలి దున్నటానికి ఏర్పాటు చేసిన ఇనుప పరికరం
2. కోల - నాగలి [redacted] పొడుగాటికర్ర.
3. దుంప - కర్రు తగిలించే చోటు
4. కాణి - కాడి

5. గొర్రు - భూమిని చదును చేసేది
6. లిక్కి - చిన్న కొడవలి
7. మోట - నీళ్ళు తోడే సాధనం
8. దండెడ - మోట బొక్కెనకు ఉపయోగించే తాడు

**(సి) పశువులు - వాటికి చెందిన పదాలు :**

1. బర్రె - గేదె
2. పెయ్య - ఆడుది
3. లాగె - లేగదూడ
4. కోడ్లాగే - కోడేదూడ
5. దొడ్డి - పశువులు కట్టివేసే చోటు
6. కొట్టం - పశువులు కట్టివేసే చోటు
7. తలుగు - పలుపుతాడు
8. చొప్ప - మొక్కజొన్న కర్రలకట్ట

**2. ఇల్లు - వస్తువులు :**

**ఎ) ఇంటికి చెందిన వస్తువులు :**

1. బరంతి - పునాదిలో నింపిన మట్టి
2. పెద్దదరువాజ - పెద్ద ద్వారం ( సింహద్వారం )
3. కిస్తీలు - తలుపు చెక్కలుపెట్టుటకు చేసే ఫ్రేములు
4. ఎనుగర్ర - పై కప్పు భాగంలో వాసాలు వంచటానికి పొడవుగా ఉండే కర్ర
5. పిల్లదూలం - దూలం పై భాగంలో, మధ్య ఏర్పరిచిన చిన్న దూలం
6. వాసాలు - దూలాలపై కప్పు భాగంలోఎనుగర్రకు ఇరుప్రక్కల ఉండే కర్రలు
7. మూలవాసం - ఇది పిల్లదూలంపై మూలకు అమర్చిన పెద్ద పొడవైన కర్ర
8. పరాట - గూన కింద పరిచే చిన్న చెక్కలు
9. మొగురం - స్తంభం
10. అర్ర - గది

**బి) వస్తువులు - పనిముట్లు :**

1. మడుత మాను - జాడి
2. ఇసుర్రవుతు - విసుర్రాయి
3. గిలాస - గ్లాసు
4. తెడ్డు - కర్ర గరిట
5. గంటె - గరిట
6. రాచిప్ప - రాతిచిప్ప ( పచ్చళ్ళు ఉంచుకునేది)
7. సురాయి - కూజ
8. తల్లె - కంచం
9. సిబ్బి - చిన్నమూత (ప్లేటు వంటిది) కంకబద్దలతో కూడా చేస్తారు
10. తపుకు - చిన్న మూత ఇత్తడిది
11. కోపు - కప్పు
12. బుడ్డి - కొలపాత్ర, బిందె ఆకారం ఇనుపది
13. కుంచం - కొలపాత్ర బిందె ఆకారంలో ఉంటుంది. రెండు కుంచాలదే ఒక బుడ్డి మట్టిది
14. తవ్వ - చెక్క కొలపాత్ర - లేదా ఇనుపది
15. సోల - చెక్క కొల పాత్ర రెండు సోలాలు అయితే ఒక తవ్వ
16. అడ్డ - నాలుగు తవ్వలు పట్టే పాత్ర

**సి) తినుబండారాలు :**

1. అప్పడాలు - పిండి పదార్థం
2. మవుడూలు - శనిగపిండితో చేసినవి, పుల్లలు
3. పాలకాయలు - పాలతో, మైదాతో చేసేవి
4. గవ్వలు - మైదాతో గవ్వల ఆకారంలో ఉంటాయి
5. కరిజలు - గోధుమ పింగితో చేసి, చక్కెర, నువ్వుల పిండి, కొబ్బరి నింపుతారు.
6. బిళ్ళలు - వరిపిండితో చేసి గోలిస్తారు ( వేయించటం)
7. చేగోడిలు - వరిపిండితో చేసి గోలిస్తారు. గుండ్రంగా చుట్టల్లా ఉంటాయి
8. బచ్చాలు - భక్ష్యాలు, మరోపేరు, (గోధుమ పిండి, చెక్కరతో, పప్పులతో చేస్తారు.)

### 3. ఆభరణాలు :

ఏడువారాల నగలు - పూర్వం సంపన్న వర్గాల్లోని స్త్రీలు, ఒక్కోరోజు ఒక్కోరకం నగ ధరించే వారట. వాటిని ఏడువారాల నగలు అంటారు.

1. పుస్తెలు - తాళి
2. మట్టెలు - కాలికి వేళ్ళకు ధరించే వెండి ఆభరణాలు
3. పిల్లేండ్లు - కాలి చిటికెన వేళ్ళకు పెట్టే ఆభరణాలు
4. సాలం కడియాలు- కాలికి ధరించే వెండి ఆభరణాలు
5. పట్టా గొలుసులు - కాళ్ళకు పెట్టుకునేవి
6. వడ్డాణం - స్త్రీలు నడుముకు ధరించేది, బంగారం లేదా వెండితో చేస్తారు
7. దండకడియం - దండచేతులకు పెట్టుకునేది, బంగారం లేదా వెండితో చేస్తారు.
8. కాసు - మెడలో ధరించే బంగారు ఆభరణం
9. పట్టెడ - పట్టలాంటిది, బంగారు ఆభరణం
10. కంటె - గుండ్రంగా మెడచుట్టూ వేసుకునే ఆభరణం
11. చంద్రహారం - గుండ్రంగా మెడచుట్టూ వేసుకునే గొలుసు
12. గుండ్లు - గుండ్రంగా మెడచుట్టూ బంగారు గుండ్లు
13. నల్లపూసలు - తాళి అంతముఖ్యమైనవి, ముత్తైయిదువులు మెడలో ధరిస్తారు.
14. ముక్కెర - ముక్కుకు ధరించేది ( ముక్కు పోగు అంటారు)
15. బులాకి - ముక్కుకు ధరించేది
16. ముక్కుపుల్ల - ముక్కుకు ధరించేది

### 4. వృత్తి - పనిముట్లు :

1. వడ్రంగం - ఉలి, రంపం, బాడ్సె, దూగోడ, పెద్దడబ్బా, బర్మా,
2. కమ్మరి - కొలిమి, సుత్తె, తిత్తి, సరచుట, (పదునుపెట్టుట) పట్టుకారు, నల్లిచేయుట ( రంధ్రం చేయుట )
3. కుమ్మరి - సారె, వాము, కుండలు, కంచుడు ( మట్టిమూత) ప్రమిదె, గురిగి, కడుముంత,

4. కంసాలి - అవుసుల వారిని వ్యవహరిస్తారు.
   త్రాసు, గురిజె, ఒర, చిమ్మెట, మూస, గొట్టం.
5. చాకలి - చవుడు, గోళెం, చాకిరి
6. మంగలి - కలుప, కత్తి, సాన
7. సుతారి - తాపె, వడంబం,గుండుదారం

**5. శరీర స్వభావ పదాలు :**

1. పెయ్యి - శరీరం
2. పుర్రచెయ్యి, తొంటచెయ్యి - ఎడమచెయ్యి
3. కొయ్యోడు - పొడువైన వాడు
4. గూనోడు - గూనికల వాడు
7. కొంగమెడలోడు - పొడువు మెడకలవాడు
8. పొట్టోడు - పొట్టివాడు
9. మెంటోడు - మెల్లకన్నువాడు
10. బుడ్డోడు - చిన్నవాడని అర్థం
11. సంటోడు - చంటివాడు

**6. మానసిక స్వభావ పదాలు :**


1. బిత్తిరోడు - వెర్రివాడు
2. నల్లికుంట్లోడు - నల్లిలాంటివాడు(ఎక్కువ మాట్లాడని వాడు)
3. పీసిడోడు - పిసినారి
4. మెత్తనోడు - మెతక స్వభావం కలవాడు
5. ఎడ్డోడు - ఏమి తెలియని వాడు
6. తిర్రోడు - తిక్క పెట్టేవాడు

**7. పిల్లల పదాలు :**

చిన్న పిల్లల ఉచ్చారణ సౌలభ్యం కోసం సృష్టించుకున్న పదాలు. చిన్న పిల్లలకు అర్థం కావటం కోసం పెద్దలు సృష్టించిన పదజాలం.

1. అంబా - గోవు, ఎద్దు
2. అం - అన్నం
3. దాయి - దావే
4. బాబ - బాపు
5. బువ్వ - అన్నం
6. పాయి - పాలు
7. గగ్గ - నీళ్ళు
8. పప్పి - పప్పు
9. బిచ్చి - బిస్కత్తు
10. లాల - నీళ్ళు
11. కాం - కారం
12. దద్దె - పెరుగు

ఈ విధమైన పదజాలం, వేలసంఖ్యలో జనపదాల్లో దాగి ఉంది, ఓర్పు నేర్పు ఉన్న పరిశోధకులు, పూనుకుంటే, తెలుగు భాషకు, అపురూపమైన 'జానపద పదనిఘంటువు' తప్పక రూపొందుతుంది, ఈ ఆశయం, మొగ్గగా ఉన్నా భవిష్యత్తులో ఫలిస్తుందన్న ఆశతో స్థలా భావంచేత, రేఖామాత్రంగా వివరించాను. ఈ పదాల మధ్య ధ్వనుల మార్పు ధ్వని పరిణామ స్వరూపాల వంటివి కూడా భాషా పరిశోధకులు నిరూపించవచ్చు. జానపద భాష ఒక్కో ప్రాంతాల్లో ఒక్కో విధంగా ఉంటుంది. కాబట్టి, నేను నా పరిధిలో ' జానపద భాష' పరిచయం చేసాను.



## మూడవ అధ్యాయం

# జానపద సాంఘికాచారాలు
# (Social Folk Customs)

జానపద జీవితమే నాగరిక జీవితానికి ప్రాతిపదిక తొలినాళ్ళలోని జనపదాలే ఈనాటి నగరాలు. జనపదుల సాంఘికాచారాల వెనుక ప్రాచీన మానవుని ఊహ, మనస్తత్వం, జీవిత విధానం వున్నాయి. ఈ విషయ విశ్లేషణకు మనస్తత్వశాస్త్ర పరిచయం, జానపద విజ్ఞాన పరిశోధకునికి అవసరం. జానపదుల సాంఘికాచారాల్ని మొత్తంగా పరిశీలించి - 'జానపద సంస్కృతి చరిత్ర' ప్రత్యేకంగా రచించవచ్చు. జానపదుల సాంఘికాచారాలు 12 విభాగాలుగా వర్గీకరించవచ్చు.

అవి ఇవి

1. పుట్టుక, 2. వివాహం, 3. కుటుంబం, 4. బంధుత్వం, 5. పండుగలు, 6. వినోదం, 7. ఆటలు, 8. వైద్యం, 9. మతం, 10. నమ్మకాలు,11. మృత్యువు, 12. కర్మకాండ.

**1. పుట్టుక :** మానవుని పుట్టుక గురించిన వివిధ ఆచారవ్యవహారాలు.

ఉదా:- బారసాల(పురుడు), చెవులు కుట్టడం, పుట్టువెంట్రుకలు,( కేశఖండనం) ఇటువంటి విషయాల్ని వివరించాలి. మానవుల పుట్టుక నుంచి వివాహ పర్యంతరము జానపదులు కల్పించుకొన్న ఆచార వ్యవహారాన్ని వివరించాలి.

**2. వివాహం :** జానపదుల వివాహ పద్ధతుల్లోగల వైవిధ్యాన్ని కన్యాశుల్కం (వోలి), పునర్వివాహం (మార్మానం) వంటి వివాహ పద్ధతుల్ని వివరించాలి. పెండ్లిండ్ల విషయంలో జానపదులకు గల పట్టింపులు, ఆచారాలు వివరించాలి. పెండిల్లల్లో పాటించు వివిధ ఆచారాల ప్రాముఖ్యత ఉదా:- మంగళ సూత్రం, పసుపు, బట్టలు, ఐరేనికుండలు, ఎదురుకోలు,అక్షింతలు, (తలంబ్రాలు) తలువాలు, బాషింగాలు, నాగవల్లి, అప్పగింతలు వంటి కార్యక్రమాలు వాటి ప్రత్యేకతలు మున్నగునవి వివరించాలి.

**3. కుటుంబం :** ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, జానపద జీవితానికి ప్రాణం, దీని ప్రాధాన్యత ఈ కుటుంబాల్లోని వ్యక్తుల మధ్య సంబంధాలు, పాలిపగలు, కుటుంబంలోని వ్యక్తుల విలువలు బాధ్యతలు, విధులు వివరించాలి. కుటుంబసభ్యుల మధ్యగల ఈర్ష్యాద్వేషాలు, ఉదా:- (ఆడుబిడ్డ, యారాలు) అత్తా కోడళ్ళ సంబంధం. కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయతలు సరసాలు, సరదాలు అన్నీ వివరించాలి.

**4. బంధువులు :** చుట్టాల మధ్య వైవిధ్యాలు, వారి ప్రత్యేకతలు, మేనమామలు వారి ప్రాధాన్యత ఉదా :- కేశఖండనం వంటి విషయాల్లో మేనమామలు,మేనత్తలు, మేనబావలు, వారి ప్రత్యేకతలు, వారి సాన్నిహిత్యాన్ని వివరించాలి.

**5. పండుగలు :-** లౌకిక విశ్వాసం కోసం ఏర్పడిన పండుగలు, ఆచార విశేషంచేత ఏర్పడిన పండుగలు అని రెండు రకాలుగా పరిశీలించవచ్చు. జానపదులు తమ కృషీవల జీవితంలో భాగంగా పంటదేవతలను ఆరాధించడము, ప్రత్యేకంగా కొత్త ధాన్యాన్ని వండే రోజు ‘ కొత్త ’ అనే పండుగ జరుపుతారు. అదే విధంగా పశువులపై తమ అభిమానాన్ని చాటుట కొరకు ‘ కనుమ ’ పండుగ జరుపుతారు. తమ కార్యక్రమాల్లో విఘ్నాలు కలుగచేయకుండా ‘గణపతి’ పూజ జరుపుతారు (వినాయకచవితి)

ప్రాథమిక మానవులు తమకు కల్గిన భయానక అనుభవాలవల్ల ‘సర్పపూజ’ జరిపేవారు. ( నాగులచవితి పేర గ్రామాలలో ఇప్పటికి ఈ పండుగ కనిపిస్తుంది).

ఇవిగాక పౌరాణిక ప్రాధాన్యతతో జరిపే దైవసంబంధమైన పండుగలెన్నో జానపదుల్లో కనిపిస్తాయి. దీపావళి, సంక్రాంతి, దసరా, శివరాత్రి వంటివి. ఇక జానపదులకు గల మతాతీత దృష్టికి స్పష్టమైన ఉదాహరణ. వారి కోరికలు తీర్చే దైవం ఏ మతానికి చెందినదైన పూజించే పద్ధతికి సరియైన ఉదాహరణ జానపదులందరు కల్పిచేసుకునే ‘ పీరీల’ పండుగ (మొహర్రం) వంటి వాటిని గురించి వివరించాలి. జానపదుల ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ పండుగ.

**6. వినోదం :** జానపదులు తమ శారీరక శ్రమ మరవటం కోసం అయా సందర్భాలలో తమకు వినోదంగా ఉండడం కోసం కోలాటంవంటి ఆటలు ఇందులో వివరించాలి. జానపదుల వినోద ప్రదర్శనలు (కనికట్టు)విప్ర వినోదులు.

**7. ఆటలు :** జానపదులు సృష్టించుకొన్న ఆటలు చెడుగుడు (కబడ్డీ), కోతికొమ్మచ్చి, ఓమనగుంటలు, కచ్చకాయలు, గుజ్జన గూళ్ళు, టొక్కా, పులిజూదం (పుంజీతం), అట్టచెమ్మ, చిర్రగోనె వంటి ఆటలను వివరించాలి.

**8. వైద్యం :** జానపదులు సృష్టించుకున్న వైద్య విశేషాలు, వైద్య నమ్మకాలు.

ఉదా :- రక్షలు, ముడుపులు, పచ్చబొట్లు, విభూతులు మూలికావైద్యం ఇటువంటి జానపద వైద్య ప్రత్యేకతల్ని ఇందులో వివరించాలి.

ఉదా :- కీళ్ళ జబ్బుకు మణికట్టుకు ఎర్రదారం కట్టడం, కోరింత దగ్గు సోకిన పిల్లలను గాడిదపొట్టకిందుగా దాటించటం వైద్య నమ్మకాలే.

**9. మతం :** జానపదుల మతస్వరూపమంతా పురామానవుడి భావనల నుండి పుట్టి విస్తరించిందే. మాతృదేవతారాధన, వృక్షారాధన, జంతు ఆరాధన, మృతినొందిన వారి ఆత్మల అరాధన మొదలైనవి, జానపదమతంలోని ప్రత్యేకతలు. జంతుబలులు, జాతరలు, సిగాలు, ఉత్సవాలు, ఊరేగింపులు, క్షుద్రశక్తులు, తాంత్రిక విషయాలవంటివి జానపద మతారాధనలోని అంశాలు. వీటిని వివరించాలి.

**10. నమ్మకాలు :** జానపదులు తమ జీవితంలో ఏర్పరచుకొన్న నమ్మకాలు ఇందులో వివరించాలి. ' మంగళవారం మండేయరాదు', ' దక్షిణం తలచేసి పండొద్దు', ' తలవైపు దీపం పెట్టొద్దు', 'మూడు గోత్రాలవాళ్ళు ఒకే మంచంలో కూచోవద్దు', 'గోళ్ళు కొరకవద్దు' ఇటువంటివే కాక జానపదులకు వివాహసమయాల్లో, ప్రయాణాల్లో ఏర్పడిన నమ్మకాలు, స్వప్నాలు, జ్యోతిష్యం, భగవంతునిపైన ఏర్పడిన నమ్మకాలు ఇందులో వివరించాలి.

**11. మృత్యువు :-** మృత్యువు పునర్జన్మపై నమ్మకం, ఆయుష్షు, ఆత్మలు, మొదలైన వాటిని గురించిన విషయాలు వివరించాలి.

**12. కర్మకాండ :-** మృతినొందిన వారు పరలోకం చేరుకుంటారనే నమ్మకంతో ఆత్మలకు పునర్జన్మ ఉంటుందనే నమ్మకంతో ఆచరించే అపరక్రియలు, తద్దినాలు, తిలోదకాలు మొదలైనవి వివరించాలి.

## నాలుగవ అధ్యాయం

# జానపద వస్తు విజ్ఞానం

**1. చిత్రకళ :** జానపదుల చిత్రకళకు మూలం ప్రాచీన మానవుని కళాభావనలే. తమ ఊహల్లోని రూపకల్పన, అతీతశక్తుల చిత్రీకరణ, పురామానవుని మొదటి చిత్రకళ. ఇదే జానపద మానవునికి సంతరించింది. ఇందులో జానపదులు గోడలపై చిత్రించిన బొమ్మలు, వస్త్రాలపై అద్దకంవంటివి వివరించవచ్చు.

**2. శిల్పం :** జానపదుని శిల్ప నిర్మాణాలు, గుళ్ళు, గోపురాలు వంటి కట్టడాలు, వారి ఊహ బలంతో నిర్మించిన విగ్రహాలు మొదలైన వాటిని ఇందులో చేర్చాలి.

**3. వాస్తు నిర్మాణం :** గృహాలు, కట్టడాల విషయంలో జానపదులకు గల పరిజ్ఞానం, కొలతల ప్రకారం నిర్మించే దక్షత, గవాక్షాలు, తలుపులు, దూలాలు, అమర్చే విషయంలో నమ్మకాలు, పడమటి గది పడమటి గాలి ధారళంగా వస్తుంది. తూర్పు వాకిలి సూర్యకాంతి చక్కగా ప్రసరిస్తుంది. ఇటువంటి విషయాల్లో గృహనిర్మాణ పరిజ్ఞానం వివరించాలి.

**4. గృహాపరికరాలు :** జానపదులు గృహ నిర్వహణలో ఉపయోగించే పరికరాలు, బొక్కెన, చేదబొక్కెన, చాట, గుల్ల, జల్లెడ, కుందెన, కుదురు మొదలైన వస్తువులు.

**5. దుస్తులు :** జానపదులు వాడే దుస్తులు, రుమాండ్లు, కండువాలు, కుడ్తాలు, అంగీలు, వివిధ చీరలు ఆయా సందర్భాల్లో ధరించే వివిధ వస్త్రాలు.

**6. ఆభరణాలు :** జానపదులు అలంకరించుకునే ఆభరణాలు, బులాకీ,నాను, పట్టెడ, తుస్సె, సరిగె, కంటె, వెండి బంగారు ఆభరణాలు.

**7. ఆహారం :** జానపదులు స్వీకరించే ఆహారపదార్థాలు. అంబలి, గట్క, రొట్టె, తొక్కులు, అరిసెలు, బూరెలు వంటి పిండి పదార్థాలు మొదలైనవి.


**8. పానీయాలు :-** జానపదులు ఉపయోగించే చల్ల, పాలు, షర్బతు, కల్లు.

**9. ప్రతిమలు :** జానపదులు తమ భక్తితో సృష్టించుకున్న మూర్తులు, విగ్రహాలు వంటివి. వీనిలో జానపదుల సహజమైన ఊహాబలం, తాత్వికచింతన, భక్తి ప్రస్ఫుటంగా కన్పిస్తాయి.

**10. పూజా పరికరాలు :** తమ ఇష్టదైవాన్ని పూజించుకోవటానికి జానపదులు ఉపయోగించు పరికరాలు. ప్రమిద, చెమ్మ, కుండ, కంచుడు వంటివి. సత్యనారాయణ వ్రతపీట, గ్రామదేవతల్లో బాలమ్మకు చేయించే తొట్లే ఇటువంటివే.

**11. వ్యవసాయం, వేట పరికరాలు :** జానపదుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ప్రాచీన కాలంనుండి, తరతరాల నుండి సంక్రమించిన వ్యవసాయ అనుభవంతో సృష్టించుకొన్న వ్యవసాయ పరికరాలు, నాగలి, గొర్రు, ఏతం, మోట, పరికరాలు, పార, చెక్కపార, కొడవలి, గొడ్డలి, లిక్కి, కాణి, జోళ్ళు, కణాలు వంటివి. వేట ప్రధాన వృత్తిగా కల్గిన వారి పరికరాలు. ఉదా:- మత్స్యకారుల వల, బుట్టి, దాగర వంటివి.

ఈ జానపద వస్తు విజ్ఞాన సేకరణతో పాటు, వాటి స్వరూప స్వభావాలు, వ్రాత పూర్వకంగా భద్రపరచాలి. జానపద వస్తు విజ్ఞానాన్ని సేకరించడం ఒక ఎత్తు. దానిని భద్రపరిచడం ఒక ఎత్తు. ఈ విషయంలో జానపద విజ్ఞానం తెల్సిన, జానపద జీవితంతో సన్నిహితం కలిగిన పరిశోధకుల సహకారంతో ఆయాప్రాంత జానపద వస్తు విజ్ఞాన ప్రదర్శనశాల స్థాపించడం, జానపద విజ్ఞాన సమగ్ర పరిశోధనకు అనువుగా వుంటుంది. పాశ్చాత్య దేశాల్లో ఈ శతాబ్ది ప్రారంభానికి ముందే ఇటువంటి కృషి జరిగింది. మనదేశంలో బెంగాల్, కర్నాటక, ఈ విషయంలో ముందున్నాయి.



## అయిదవ అధ్యాయం

# ప్రదర్శనాత్మక కళలు

**1. గాత్ర సంగీతం :** ఇందులో జానపదుల సంగీత విన్యాసాలు, వారికి గల సంగీత పరిజ్ఞానం, క్షుణ్ణంగా వివరించాలి. దానిలో కవుల గాత్ర సంగీతానికి, జానపదుల గాత్ర సంగీతాన్ని తులనాత్మకంగా పరిశీలించే సామర్థ్యం కలిగిన సంగీత పరిశోధకులు, జానపద సంగీతాన్ని ( Folk Music ) వివరించాలి.

**2. వాద్య సంగీతం :** జానపదులు తమకు గల ప్రదర్శనవేళలో ఉపయోగించే వివిధ వాద్యవిశేషాలు, వాటి సంగీత సృష్టి వివరించాలి. ఉదా :- డప్పు, డోలు, సన్నాయి,జముకుల పాటలకుపయోగించే ' డమరుకం '

**3. తోలుబొమ్మలు :** అనాది కాలం నుండి జానపదుల ప్రత్యేక ప్రదర్శనాత్మక కళ ఇది. పౌరాణిక గాథల్ని అద్భుతంగా ప్రదర్శించే ఈ కళానైపుణ్యంలో ప్రదర్శకుల ప్రాధాన్యత, సజీవపాత్ర నటన, మన కళ్ళముందు ప్రదర్శించే వారి కృషి ఈ కళలో ప్రత్యేకంగా కనిపిస్తాయి. వాటి పుట్టుక ప్రదర్శనా పద్ధతులు, ప్రత్యేకతలు. బొమ్మల నిర్మాణం, సూత్రధారుల పాత్ర, అతని ప్రతిభ గమనించి వివరించాలి.

**4. నృత్యం :** జానపదులు తమ సంతోషాన్ని, భక్తి అవేశాన్ని ప్రదర్శించువేళల్లో జరిపే నృత్య విశేషాలు. ఉదా : మతపరమైన గరగనృత్యం, ఉత్సాహపరమైన ' కోలాట నృత్యం ' వంటి వానిని వివరించాలి.

**5. నాటకం :** ఇందులో జానపదుల వీధి భాగోతాలు, పగటివేషాలు, చిందు భాగోతాలు వంటి కళారూపాలు క్షుణ్ణంగా వివరించాలి. వీటి కాలపరిమితి వివిధ వేషాలు తెలుగు జానపదులలోని ఒక్క పగటివేషాల్లో దాదాపు 28 (ఆహార్యాలు) వేషధారణలున్నట్లు డా॥ మొదలి నాగభూషణం గారు వివరించారు.

జానపదుల నాటకకళపై ప్రత్యేకంగా పరిశోధన జరిగినచో ఐదు విభాగాల సమగ్ర పరిశోధనల గ్రంథం వెలువడవలసిన విశేషాలు, జానపదులకథా జీవితాల్లో ఉన్నాయి.

1. Fragmentation and Functionalism in Folk Forms. - *M.N. Sharma.*

## ఆరవ అధ్యాయం

# పరిశోధన

**1. పరిశోధన :** ఒక విషయాన్ని అత్యంత శ్రద్ధాసక్తులతో పరిశీలించి, విశ్లేషించి, సరియైన పద్ధతుల్లో నూతన విషయాలు వివరించుట అని నిర్వచించవచ్చు. పరిశోధన అంటే నైఘంటికార్థం వెతకటం, లేదా కొత్త దాన్ని కనిపెట్టడం, కొత్త రీతిలో నిర్వచించటం.

**పరిశోధన స్వరూపం :** మూడు విధాలుగా కనిపిస్తుంది.

1) విషయసేకరణ, 2) విశ్లేషణ, 3) స్వతంత్రభావ వ్యక్తీకరణ గా వివరించవచ్చు, అంతర్గతంగా పరిశోధనలో ఈ మూడు అంశాలు చేరిపోయి ఉంటాయి.

**జానపద విజ్ఞాన పరిశోధన :**

ఈ పరిశోధనలో, మరిన్ని ఆసక్తికరమైన పద్ధతులున్నాయి. అన్నింటికంటే ముఖ్యమైంది, పరిశోధకుడు ఆయా ప్రాంతాలు తిరిగి, వ్యక్తుల ముఖతః విషయసేకరణ జరిపే వినూత్నపద్ధతి ఇది జానపద విజ్ఞాన పరిరక్షణలో కూడ ప్రాముఖ్యత కలిగి ఉంటుంది. ఈ పరిశోధన పద్ధతుల్లో అనుసంధాన పరిశోధన (Applied Research) కు దగ్గరగా ఉంటుంది. ఈ విజ్ఞాన పరిశోధన ఇతర పరిశోధనా పద్ధతులవలెనే, పరిశోధన అంశం నిర్ణయించుకోవటం, విషయసేకరణ, వస్తు విశ్లేషణ, విషయ వివరణ, వ్యాసరూపం, క్రమంగా అనుసరించే విషయాలు. అయితే జానపద విజ్ఞాన పరిశోధనలో తప్పక గుర్తించుకోవలసిన విషయం. జానపద వస్తు సంస్కృతిని సంరక్షించుకోవటం, అదే విధంగా మౌఖికంగా జీవిస్తున్న విషయపరిజ్ఞానం సాధ్యమైనంత త్వరగా సేకరించుకోవటం.

మొత్తం మీద జానపద విజ్ఞాన పరిశోధనలో అయిదు ప్రధాన విభాగాలు గుర్తించవచ్చు.

1. అవగాహన, 2. అన్వేషణ, 3. సేకరణ, 4. విశ్లేషణ, 5. సంరక్షణ.

**1. అవగాహన :** జానపద విజ్ఞాన పరిశోధనలో పరిశోధకుడికి జానపద సంస్కృతి పట్ల ఆదరణీయ దృక్పథం జానపద జీవితంతో సంబంధం, అవగాహన కల్గి ఉండటం, అత్యంత ముఖ్యమైంది. పట్టణాలలో పత్రికల్లో చదివిన జానపద జీవిత చిత్రణపై పరిశోధనకు సాహసిస్తే, అది అర్థవంతమైన పరిశోధన కానేరదని నా అభిప్రాయం.

జానపద విజ్ఞానం పరిశోధకుడికి జానపద జీవితం ( Folk Life ) అంటే ఏమిటి ? జానపదుల మనస్తత్వ స్వరూపం ఎటువంటిది అనే స్పష్టమైన అవగాహన అవసరం. దీనితోపాటు తమకంటే ముందు వివరణలు గమనించాలి.

ఉదా : జానపద జీవితంపై ఈ నిర్వచనం గమనించండి.

"Folk life not only verbal arts of folk song, folk lore, Riffle but also agriculture, aggrentian history, settlement patterns dialetology of folk speach. Folk Religion, Folk magician, folk recreation folk architecture, folk crockery. Folk year, folk arts and craft it is existing totally of the verbal spiritual and material aspects of a culture that mean by turm folk life ".[1]

" జానపద జీవితం అంటే కేవలం విశ్వాసాలకు చెందిన జానపద జీవితం,జానపద కథ, పొడుపుకథ మాత్రమే కాదు. జానపదుల వ్యవసాయ చరిత్ర, నివాస పద్ధతులు, మాండలిక జానపద భాష, జానపద మతం, వైద్యం, జానపదుల మానసిక ఉల్లాసం ( వినోదాలు ) జానపద శిల్పకళ ( నిర్మాణాలు ), జానపద పాకశాస్త్రం, దుస్తులు, కాలపరిస్థితులు, కళలు, చేతివృత్తులు వీటిని ప్రతిబింబించే మౌఖిక, మానసిక, భౌతిక రూపాలయొక్క సంస్కృతి జానపద జీవితం అంటారు" అని వివరించారు.

ఈ విధంగా జానపద జీవిత సాన్నిహిత్యం ఒకవైపు, జానపద జీవితంపై పరిశోధనా దృక్పథం మరోవైపు కలిగివున్న అవగాహన పరిశోధకుడికి ముఖ్యం.

**2. అన్వేషణ :** జానపద విజ్ఞాన పరిశోధకుడు జానపద జీవితంపై తనకు కలిగిన అవగాహనతో తన పరిశోధనకు జానపద జీవితాన్ని పూర్తిగా కలిగివుండి, నాగరిక వాసనలు సోకని గ్రామాల గురించి అన్వేషణ సాగించాలి. ఈ అన్వేషణలో

1. American Folklore & Flok lif - Donyoser

పరిశోధకుడు మౌఖిక విషయసేకరణకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలి. జానపదుల వ్యక్తి గత అనుభవాలు, వారి గ్రామీణ జీవితం, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు. వీటన్నింటినీ జాగ్రత్తగా గమనించి తన అన్వేషణా ఫలితాల్ని విశ్లేషించి చూసుకోవాలి. పరిశోధకుడు ఇటువంటి కొన్ని జనపదాల్ని పర్యటించిన పిదప ఆయా గ్రామాల మధ్యగల వ్యక్తిగత నమ్మకాలు, ఆచారాలు, ఆర్థిక, రాజకీయ సమస్యలు, వాటి వైరుధ్యాలు, సారూప్యాలు సులభంగా గమనింపవచ్చు. జానపద విజ్ఞాన పరిశోధకుడికి తన అన్వేషణలో గమనించి భద్రపరుచుకొన్న ప్రతి విషయం అమూల్యమైనదే.

**3. సేకరణ :** జానపద పరిశోధకుడు తన అన్వేషణలో ఆయాగ్రామాల పరిస్థితుల్ని, భౌతికవనరుల్ని, జీవిత వైరుధ్యాల్ని క్షుణ్ణంగా వివరాలతోపాటు సేకరించుకోవాలి. తమతో ముఖాముఖీ సంభాషించిన వయస్సు, జీవితానుభవం, కులం, మతం వంటి విషయాలు తప్పనిసరిగా భద్రపరుచుకోవాలి. సేకరణ విషయంలో జానపద పరిశోధకుడు గుర్తుంచుకోవల్సిన విషయాల్ని జానపద విజ్ఞాన పరిశోధకులు శాస్త్రీయంగా వివరించారు. " 1. సేకరణ తేది, 2. కాల వివరణ, 3. సమాచారమందించే వ్యక్తిపేరు, 4. వయస్సు, 5. స్త్రీ లేదా పురుషుడు, 6. వివాహితులా లేదా అవివాహితులా, 7. పూర్తి చిరునామా, 8. జన్మస్థలం, 9. మాతృభాష - తెలిసిన ఇతరభాషలు, 10. మతం, 11. విద్య, 12. కులం, 13. వృత్తి, 14. జీవిత చరిత్ర, 15. ఇతర విశేషాలు[1]."

**4. విశ్లేషణ :** జానపద విజ్ఞాన విశ్లేషణలో పరిశోధకులు చాల జాగ్రత్తగా వ్యవహరించవల్సి వుంటుంది. పరిశోధకుడు సేకరించుకున్న విషయానికి తన స్వంత ఆలోచనలతో, అనుమానాలతో కొత్త స్వరూపం ఇవ్వక పోవడం మంచిది.

ఉదా : మాటల మార్పు, పదాల మార్పు వంటివి.

ఒకవేళ పరిశోధకునికి జానపదులు అందించిన పదాలతో తప్పు కనిపించినపుడు ఆ పదాన్ని యధాతథంగా ఉంచి తన అభిప్రాయాన్ని విడిగా పేర్కోవాలి. ఎందువల్ల అంటే ఆయా వ్యక్తుల కంఠంలో లయలు, వత్తి పలుకుటలో భాషా విషయంలో కొన్ని మార్పులు గోచరించవచ్చు. వాటిని జాగ్రత్తగా పరిశీలించాలి.

Methodology field work and Reaserch in folk lore - Dr. R.V.S. Sundaram.

జానపద విజ్ఞానాన్ని అందించే వ్యక్తులకు ప్రాధాన్యతనిచ్చి, వారు చెప్పిన విధంగా రాసుకోవాలి. దానిలో పాఠాన్ని ( Text ) దాని సందర్భాన్ని ( context ) జాగ్రత్తగా గుర్తించాలి. జానపద విజ్ఞాన పరిశోధనలో Text మరియు Context విషయంలో పాశ్చాత్యులు చాలా ప్రాముఖ్యతనిచ్చారు. డండ్స్ జానపద విజ్ఞాన పరిశోధకుడికి ఈ విషయంలో పరిజ్ఞానం అవసరమని పేర్కొన్నాడు.

" Text, tenture, and context are the three factors, which are be analised by a folk lorists. While studying any genrenoitem of' Folk lore can be difined on the bases of just one of these [1]

అదే విధంగా జానపద విజ్ఞాన పరిశోధనలో Motifs (మూలాంశాలు) యొక్క ప్రాధాన్యత ఎంతగానో వుంది. జానపద విజ్ఞానంలో ఏ అంశాన్నైనా వింగడించడానికి మూలాంశాల్ని ఉపయోగిస్తారు. ఈ Motifs యొక్క ప్రాధాన్యత గుర్తించడం వల్ల జానపద విజ్ఞాన పరిశోధనలో వివిధ ప్రాంతాల జానపద విజ్ఞానంలోని మూలాంశాల అధ్యయనం తేలికవుతుంది. ఆయాప్రాంతాల జానపద మూలాంశాల సామ్యత గుర్తించడం, భిన్నత్వంలోని ఏకత్వం, జానపద జీవిత సహజ లక్షణం. ప్రపంచమంతటా ఇంచుమించు ఒకటేనని గమనించ వీలవుతుంది. ఉదా : ( Sun God ) సూర్యుడు, ( Moon God ) చంద్రుడు, ( Wind God ) వాయుదేవుడు, వంటి దేవతల్ని ప్రపంచాన్ని అంతటినీ ఒకే దేవుడు సృష్టించాడనే నమ్మకం పాశ్చాత్య దేశాల్లో వుంది. అటువంటి భావనే మన హిందూ పురాగాథల్లో కూడ కనిపిస్తాయి. Motifs ( మూలాంశం ) మూల వస్తువుల గురించి వివరిస్తుంది. రాక్షసులు, గంధర్వులు, యక్షులు, అతీతశక్తి స్వరూపులు, దేవతలు మొదలైన పాత్రలు. అద్భుతశక్తులనిచ్చే పరికరాలు, హఠాత్తుగా జరిగే సంఘటనలు వంటివి. జానపదుల గద్యకథనాలు, కథాగేయాలు, కథలు వంటి వాటిలో కోకొల్లలు. వీటి వింగడింపులో Motifs ఎంతో సహకరిస్తాయి. ఈ విధంగా విశ్లేషించడం శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించడం అవుతుంది.

---

1. Easy in Folklorsitics - Alan Dunds

**5. సంరక్షణ :** జానపద విజ్ఞాన పరిశోధనలో ప్రాధాన్యత వహించే మరో అంశం, పరిశోధకుడు తాను సేకరించుకొన్న ప్రతి విషయాన్ని, విశేషాల్ని, భద్రపర్చుకోవడం సాధారణంగా జానపద విజ్ఞానాన్ని సంరక్షించుకోవడంలో నాలుగు ప్రధాన సాధనాల సహకారం అవసరం.

1. కంప్యూటర్, 2. టేప్‌రికార్డర్, 3. కెమెరా, 4. మ్యూజియం.

## సంరక్షణ

జానపద విజ్ఞాన పరిశోధనలో సరికొత్త పద్ధతుల ద్వారా సంప్రదాయ విజ్ఞానాన్ని పరిరక్షించుకునే అవకాశాలు నేడు ఏర్పడ్డాయి. ముఖ్యంగా, కంప్యూటర్,' ఫ్లాపీ ' వల్ల, సమగ్రంగా, భద్రత సాధ్యం. విశ్వవిద్యాలయం పరిధిలో, కొంతవరకు, ఈ పరిరక్షణ సులభం చేస్తున్నారు. ' కంప్యూటర్ ' సాధనంగా, ముందు ముందు, సమగ్ర సంరక్షణ సాధ్యం అవుతుంది కాబట్టి, పరిశోధన కూడా కొత్త పుంతలు తొక్కే వీలవుతుంది. ఎన్ని కంప్యూటర్లు, వీడియోలు ఉన్నా, భద్రపరచటం వరకే, వాటిపని. కొత్త కొత్త విషయాలు స్మరించటం, వాటిని కొత్త కోణంలో పరిశీలించటం వంటివి పరిశోధకులు చేయాల్సిన పని. అందువల్ల పరిశోధనలు నిరంతరం కొనసాగేలా ముందుకు సాగాలి. విషయసేకరణ సరిగా సాగాలంటే, ఆధునిక సాంకేతిక సాధనాలైన కంప్యూటర్, వీడియోలతో పాటు, టేపురికార్డర్, కెమెరా, వంటి వాటిని కూడా ఉపయోగించుకోవాలి. పరిశోధకుడు దేన్ని తేలిగ్గా తీసుకోరాదు. ఏ వనరులు, వస్తువులు, తమ అన్వేషణలో పరిశోధనలో అవసరమో, వాటన్నింటిని ఉపయోగించుకోవాలి. ముఖ్యంగా యంత్రసాధన పరికరాలు ఎంత ముఖ్యమో ఆయా, విషయాల అనుభవాల్ని, అనుభూతుల్ని వివరించే, వ్యక్తుల ప్రమేయం, గ్రామీణ జన సహకారం ఎంతో అవసరం. జానపద విజ్ఞాన పరిశోధనలో మరో ముఖ్యాంశం. తాను సేకరించాలనుకున్న ప్రతి విషయాన్ని ముందే నిర్ణయించుకోవాలి. చివర వరుస క్రమంలో విశ్లేషించుకొని, విషయ వివరణ చేయాలి.

**కంప్యూటర్ :** జానపదవిజ్ఞాన పరిశోధనలో, దీని ప్రాముఖ్యత ఎంతో ఉంది. అయితే జానపద విజ్ఞాన పరిశోధకుడికి విషయ సేకరణ రంగం పూర్తి అయిన తరువాతే, కంప్యూటర్ సహకరిస్తుంది. రాబోయే తరాలకు, విజ్ఞాన సంపద యధా

రూపంలో అందించే శక్తి కంప్యూటర్‌కు ఉంది కాబట్టి, దానికి మొదట ప్రాధాన్యం ఇవ్వటం జరిగింది.

**పరిశోధనా కేంద్రం :** సేకరించుకున్న విషయాన్ని, విశ్లేషించి ఒక వరుసలో ఉంచటానికి, ఒక్కో విభాగంలో అనేకానేక అంశాలు, వర్గీకరించటానికి, ముగ్గురు నలుగురు జానపద విజ్ఞాన పరిశోధకులతో ఒక సమగ్ర పరిశోధన కేంద్రం ఏర్పాటు అవసరం. దాని ద్వారా వారు నిరంతరం, అన్వేషణ, సేకరణ, విశ్లేషణ, సంరక్షణ, వివరణ వంటి ముఖ్యమైన పరిశోధన పనుల్లో ముందుకు సాగకలుగుతారు. ఈ కేంద్రం - స్వతంత్ర ప్రతి పత్తితో ఏర్పాటు కావట్మం మరీ మంచిది. నిధులు, ప్రతినిధులు లేని పనుల్లో జాప్యం ఎక్కువే అన్న సంగతి, ఈ రంగానికి కూడా వర్తిస్తుంది.

**1. టేప్ రికార్డర్ :** దీని సహకారం వల్ల జానపద విజ్ఞాన పరిశోధనలోని మౌఖికాంశాలు.

ఉదా : గేయాలు, కథాగేయాలు వంటి వాటిని వినిపించే జానపదుల నుండే స్పష్టంగా రికార్డు చేసుకోవచ్చు. జానపదుల భాషా విషయకమైన పరిశోధనలో ఉదా : మాండలికశైలి, నుడికారం, వంటి విషయాల్ని భద్రపరుచుకొనవచ్చును. సామెతల విషయంలో మాత్రం టేప్‌రికార్డర్‌కంటే జానపదులు సామెతల్ని ఉపయోగించినపుడు రాసుకోవడం తప్ప. గేయాల్లో ఎప్పుడుపడితే అప్పుడు రికార్డు చేయడం కుదురదు. టేప్‌రికార్డు విషయంలో పరిశోధకుడు కొన్ని విషయాల్ని గమనించాలి. టేప్‌రికార్డర్ పరిశోధకుడికి భారంగా పరిగణించకూడదు. అదే విధంగా అందులో యాంత్రికలోపాల్ని తరచు గమనిస్తూవుండాలి. అందువల్ల జానపదుల ఉత్సాహానికి టేప్‌రికార్డర్ సహకరించగల్గుతుంది. టేప్ రికార్డర్ బ్యాటరీతో పనిచేసేది కావాలి, ఎందుకంటే జాపపదులు ఒకచోట స్థిరంగా ఉండలేరు. శ్రామికజీవులు, అందువల్ల వారు పనిచేసే చోటుల్లోనే పరిశోధకుడు వారి పాటల్ని, మాటల్ని రికార్డు చేసుకోవలసి ఉంటుంది. అదే విధంగా టేపుల ఎన్నిక విషయంలో పరిశోధకుడు మెలకువ చూపాలి. తన పరిశోధనానంతరం ఈ రికార్డెడ్ టేపుల్ని భవిష్యత్ జాతి కొరకై భద్రపరచవలసి వుంటుంది.

**2. కెమెరా & వీడియో :** జానపద విజ్ఞాన పరిశోధనలో కెమెరా / వీడియో జానపద సంస్కృతిలోని భౌతిక విజ్ఞానాన్ని బింబమాత్రంగానైనా భవిష్యత్తుకు అందించగల్గుతుంది. జానపదుల వస్త్రాలంకరణ, వస్తు సంస్కృతికి సంబంధించిన ( Meterial Culture ) బండి, నాగలి, ఇటువంటి పనిముట్లు అయా మతారాధనాలయాలు, దేవతా విగ్రహాలు, వాస్తు నిర్మాణాలు ప్రదర్శనల. పని విధానాలు అన్నీ యధాతథంగా మొదలైనవి. కెమెరా/వీడియో సహాయంతో భద్రపరుచవచ్చు.

**3. మ్యూజియం :** జానపద విజ్ఞాన పరిశోధనలో సేకరించుకొన్న విశేషాల్ని వింగడించి వారి భౌతిక సంస్కృతిని వస్తుప్రదర్శనాలయంలో భద్రపరచాలి. ఇందులో టేప్ రికార్డర్ ద్వారా, కెమెరా / వీడియో ద్వారా సంతరించుకొన్న జానపద విజ్ఞానంతోపాటు జానపదుల భౌతిక సంస్కృతికి చెందిన వివిధ పరికరాలు, వస్తువులు, దుస్తులు మొదలైనవి. యధాతథంగా భద్రపరుచుకోవాలి. ఇంటి నిర్మాణాలు, బండ్లు, మోట, ఇటువంటివి మ్యూజియంలో భద్రపరుచ రానటువంటి వాటి నమూనాల్ని వస్తుప్రదర్శనశాలల్లో ఏర్పాటుచేయాలి.

ఈ ప్రదర్శనశాలలో జానపదుల వస్తు సంస్కృతిని వివిధ వర్గాలుగా వ్యవసాయ పరికరాలు, గృహపరికరాలు, కులవృత్తుల పరికరాలుగా విభజించుకొని ప్రత్యేకంగా ఏర్పరచుకోవాలి. వీటితోపాటు వీటిని సేకరించిన ప్రాంతం, ఊరు, సేకరించిన వారి పేరు మొదలైన చరిత్ర ఒక కాగితంపై వ్రాసి, అయా పరికరాల వద్ద తగిలించాలి. ఈ ప్రదర్శనశాల సందర్శించేవారికి ఈ వస్తు సంస్కృతి సులభంగా తెలుస్తుంది.

జానపద వస్తు ప్రదర్శనాలయాల్లో దక్షిణ భారతదేశంలోని (కర్నాటక) మైసూరు విశ్వవిద్యాలయంలోని జానపద పరిశోధనశాల పేర్కొనదగినది. పాశ్చాత్య దేశాల్లో అయితే కృత్రిమంగా 'జనపదాల్ని' సైతం నిర్మించుకొని నవనాగరికత కాలుష్యంలో కలిసిపోకుండా, కాపాడి భవిష్యత్ జాతికి చూపాలనే తపన జానపద విజ్ఞాన పరిశోధకులది. తెలుగుదేశంలో కూడా డా॥ రామరాజుగారి ఆధ్వర్యంలో చిన్నదైన ఒక జానపద వస్తు ప్రదర్శనశాల ఉస్మానియా విశ్వవిద్యాయంలో ఏర్పాటు చేయించారు. వరంగల్‌లోని జానపద గిరిజన విజ్ఞానపీఠం (తెలుగు

విశ్వవిద్యాలయం), ఆచార్య ఎన్. భక్తవత్సలరెడ్డిగారు కొంత జానపద వస్తుసేకరణతో పాటు జానపద విజ్ఞాన విషయసేకరణతో ముందుకు సాగుతున్నారు.

## పరిశోధకుడి లక్షణాలు

జానపద విజ్ఞాన పరిశోధకుడు ముఖ్యంగా ఆధారపడవలసింది జానపదులపై జానపద జీవితంపై పుస్తక విజ్ఞానం సహకరిస్తుంది. కాని ప్రాధాన్యత వహించదు. అందువల్ల జానపద విజ్ఞాన పరిశోధకుడు సృజనాత్మకమైన ప్రతిభ కలిగివుండాలి. ఇది అతడి మొదటి లక్షణం. ఇక అమాయకులు, నిరక్షరాస్యులు అయిన జానపదుల మధ్య విషయాల్ని రాబట్టడం రెండవ లక్షణం. చక్కని మాటకారి అయి వుండి, సులభంగా ఎదుట వ్యక్తుల నుండి విషయాల్ని సేకరించుకొనడం మూడవ లక్షణం. జానపద విజ్ఞాన పరిశోధకుడు తనకు గలనాగరిక వ్యామోహాల్ని, రాజకీయ, మతసంబంధమైన వ్యక్తిగత విషయాల్ని తాత్కాలికంగా మరిచిపోయి జానపదుల మధ్య వారి అవగాహన ద్వారా విషయసేకరణ చేసుకోగలగడం నాలుగవ లక్షణం. వీటన్నింటికి తోడు సాధారణ పరిశోధకుడికి గల జిజ్ఞాసను పరిశోధనకు ఎన్నుకున్న రంగంపై చిన్నచూపు లేకపోవడం మరొక లక్షణంగా భావించవచ్చు.

# పఠించాల్సిన పుస్తకాలు

జానపద విజ్ఞాన పరిశోధకుడు విధిగా జానపద విజ్ఞానంపై తనకంటే ముందు పరిశోధకులు పొందిన అనుభవాల్ని వ్యక్తిగతంగాకాని, వారి గ్రంధమునుండి కాని తెల్సుకొని వుండాలి. ఈ అవగాహన వర్తమాన పరిశోధకుడికి తన పరిశోధన సక్రమమైన పంథాలో సాగుటకు తోడ్పడుతుంది. పాశ్చాత్యదేశాల్లో ఎందరో పరిశోధకులు ఎన్నో విశ్వవిద్యాలయాల్లో జానపద విజ్ఞానంపై పరిశోధన జరిపి అమూల్యమైన గ్రంధాల్ని ప్రచురించడం జరిగింది. ఆంగ్లభాషలో ఈ క్రింది పుస్తకాలు పఠించదగినవి.

1. Standard Dictionary of Folk lore Mythology & Legend by _M. Leach.
2. Folk lore & Folk life _ R. Darson
3. Eassy in Folkloristics _Alan Dunds
4. Mottifs index of Folk Literature _ S. Tith Thomson
5. Recial proverbs _ W. Champian
6. Study in Indian traditions _ Vedaprakash Vatuk
7. Anthropology _ an Introduction to the study of Man & Civillsation _ E.B. Tilor.
8. Elements of Folk psychology _ Nilhelm wandt
9. Faiths, Fairs & Festivals of India _ C.H. Back
10. The golden Bough _Jams Frazer
11. Lokayata _ D.P. Chatopadayaya
12. Study of Folk lore _ Alan Dunds
13. Totem & Taboo _Sigmend-Freud

ఇటువంటి గ్రంథాలన్నీ జానపద విజ్ఞాన పరిశోధకుడు తప్పనిసరిగా పరిశీలించాల్సి వుంటుంది.

# తెలుగు పుస్తకాలు

1. జానపదగేయ సాహిత్యము - ఆచార్య బి. రామరాజు
2. ఆంధ్రయక్షగాన వాఙ్మయము - ఆచార్య యస్.వి. జోగారావు
3. తెలుగులో హరికథా స్వరూపము - ఆచార్య తూమాటి గోణప్ప
4. తెలుగులో వీరగాథా కవిత్వము - డా॥ టి.వి. సుబ్బారావు
5. జానపద కథా గేయాలు - డా॥ నాయని కృష్ణకుమారి
6. జానపద కళాసంపద - డా॥ టి. దోణప్ప
7. జానపద గేయ వాఙ్మయ పరిచయము - హరి ఆదిశేషువు
8. జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి - నేదునూరి గంగాధరం
9. తెలుగుసామెతలు - అంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
10. పసిడి పలుకులు - నేదునూరి గంగాధరం
11. తెలుగు జానపద సాహిత్యం - పురాగాధలు- డా॥ రావి ప్రేమలత
12. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ ఆర్వీ. ఎస్. సుందరం
13. జానపద సాహిత్యం - ఎల్లోరా
14. పొడుపుకథలు - ఒక పరిశీలన - డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి
15. తెలుగు జానపదుల సామెతలు - డా॥ బి. దామోదరరావు
16. తెలుగు సామెతలు- జానపదసంస్కృతి -డా॥ బి. దామోదర్‌రావు
(పి.హెచ్.డి. గ్రంథం)

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C No. 88028
హైదరాబాద్-500 044.



మా ఊరు : ముస్తాబాద్ మండలంలోని గూడెం,
కరీంనగర్ జిల్లా

చదువు : ఎం.ఏ.ఎం.ఫిల్, పిహెచ్.డి. తెలుగులోనే

పని : తెలుగు ఉపన్యాసకుడిగా

రచనలు : ప్రభ, జ్యోతి, భూమి, మయూరి, సుప్రభాతం వంటి పత్రికల్లో ప్రచురితాలు.

నా ప్రచురణలు అయిదు : నా కవిత సమత కవితాసంపుటి,
సింగిడి తెలంగాణా యాస బాసకథలు
తెలుగు జానపదుల సామెతలు
ఎం.ఫిల్ పట్టానిచ్చింది.
తెలుగు సామెతలు - జానపద సంస్కృతి
పిహెచ్ డి. పట్టా తెచ్చింది,
జానపద విజ్ఞానం -పరిశోధన
మీ చేతుల్లో ఉంది.

సాహిత్య కృషికంటే మిన్నగా సాహితీ సంస్థల కార్యకర్తగానే ఇష్టపడతాను. మా ఊళ్ళో రవీంద్రసాహితీ మండలితో ప్రారంభించి, ఉస్మానియా రచయితల సంఘం - సాహిత్య వికాససమితి, జానపద సాహిత్య పరిషత్ హైదరాబాద్‌లో చదివే రోజుల్లో ..... తరువాత జానపద సాహిత్య పరిషత్ వరంగల్‌శాఖ కార్యదర్శిగా కరీంనగర్‌లో స్థిరపడ్డాక - సమతా సాహితి, సాహితీ గౌతమి, అధ్యక్షుడిగా 1996 వరకు ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా...

అరుణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్. కరీంనగర్. ఫోన్స్ : 22200 / 22755